www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


నల్లరిబ్బను ధరించి అసద్ ప్రార్థన

పహల్గాం మృతులకు మజ్లిస్ సంఘీభావం

దాడికి నిరసనగా నల్లరిబ్బన్లు కట్టుకుని శుక్రవారం ప్రార్థనలు
స్వయంగా నల్లరిబ్బన్లు పంపిణీ చేసిన ఎంపీ అసదుద్దీన్
'పాకిస్థాన్ ముర్దాబాద్' అంటూ ముస్లింల నినాదాలు 3
హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానం ఎంఐఎందే.. మీర్జా రియాజ్ విజయం
పోలైన ఓట్లు 88.. మీర్జాకు 63 ఓట్లు.. బీజేపీ అభ్యర్థికి 25 ఓట్లు

శనివారం | 26-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 27 |
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: త్రయోదశి ఉ.8.28, చతుర్దశి తె.4.49 వరకు; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.6.27, రేవతి తె.3.39 వరకు; వర్జ్యం: సా.5.03-6.27; దుర్ముహూర్తం: ఉ.5.55-7.36; అమృతఘడియలు: రా.1.31-2.56; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చుక్క నీరు పోనివ్వం

ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా చూసే పూచీ మాది
ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నాం
హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో భేటీ అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి

జమ్మూకశ్మీర్‌లో నివసించే స్థానికేతరులు, రైల్వే ఆస్తులు, కశ్మీరీ పండిట్లే లక్ష్యంగా దాడులకు.. 'ఉగ్ర' ప్రణాళికలు?
భద్రతా దళాలు అప్రమత్తం.. సిబ్బంది సెలవులు రద్దు
వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు
శ్రీనగర్‌కు ఆర్మీ చీఫ్.. అక్కడ భద్రత పరిస్థితిపై సమీక్ష
సరిహద్దుల్లో రాఫెల్స్ గర్జన.. ఐఏఎఫ్ యుద్ధ విన్యాసాలు
బందిపొరాలో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం
పహల్గాం ఉగ్రవాదుల ఇళ్లలో పేలుళ్లు
భద్రతా దళాలే లక్ష్యంగా పేలుడు పదార్థాల నిల్వ?

అవును.. ఉగ్రవాదాన్ని పెంచి పోషించాం

అమెరికా, బ్రిటన్ కోసమే ఈ చెత్తపనులు
పొరపాటు గ్రహించాం.. అనుభవిస్తున్నాం
పాక్ రక్షణ మంత్రి ఖవాజా సంచలన వ్యాఖ్యలు


జమ్ము కశ్మీర్‌లో సైనికాధికారులతో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: సింధు జలాలను మళ్లించే యత్నాలను యుద్ధచర్యగా భావిస్తామంటూ పాక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది! ఉగ్రవాదానికి ఊతమిస్తున్న దాయాది దేశానికి మన గడ్డ మీద నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా చూసే పూచీ తమదని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తేల్చిచెప్పారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీకి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న నదులపై నిర్మించిన ఆనకట్టల స్టోరేజీ సామర్థ్యాన్ని, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచాలని అందులో నిర్ణయించారు. ఈ భేటీ అనంతరం పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడిన సీఆర్ పాటిల్.. ప్రధాని నరేంద్రమోదీ తమకు ఈ దిశగా పలు సూచనలు చేశారని, వాటిపై సమావేశంలో చర్చించామని, వాటిని సమర్థంగా అమలుచేసేందుకు అమిత్ షా పలు సూచనలు చేశారని తెలిపారు. "నీటి నిలిపివేతకు సంబంధించి వ్యూహాన్ని ఈ భేటీలో సిద్ధం చేశాం. అందులో భాగంగా మూడు ప్రత్యామ్నాయాలపై చర్చించాం. సింధు జలాల నుంచి ఒక్క చుక్క నీరు కూడా పోకుండా తీసుకోవాల్సిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక

మిగతా 13వ పేజీలో...

పాక్‌కు గుణపాఠం ఖాయం!



స్థలం, సమయం ఖరారు చేయడమే మిగిలింది..
సింధు జలాల ఒప్పందం రద్దుతో పాక్ పంజాబ్‌లో నీరుండదు
3 యుద్ధాలు జరిగినా తీసుకోని కీలక నిర్ణయమిది
ఎఫ్ఏటీఎస్ నిఘాతో పాక్‌ను మళ్లీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి 12
'ఆంధ్రజ్యోతి'తో జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్రకుమార్

ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు తిప్పికొట్టిన భారత్

13
పీవోకేకు హమాస్ నేతలు!
ఏడాదిగా పలుమార్లు రాకపోకలు


కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్, సల్మాన్ ఖుర్షీద్, మహేశ్‌గౌడ్, పొంగులేటి తదితరులు

పాకిస్థానీలను వెనక్కి పంపండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమిత్ షా ఫోన్

దేశ భద్రత రీత్యా రాష్ట్రం తీసుకోవాల్సిన చర్యల్ని వివరించిన కేంద్ర హోంమంత్రి
ఒక్క పాకిస్థానీ కూడా ఉండొద్దు.. అన్ని రాష్ట్రాల సీఎంలకు స్పష్టం చేసిన షా
హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు.. రాష్ట్రం నుంచి తక్షణం వెళ్లిపోవాలి: డీజీపీ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. దేశ భద్రత, కేంద్ర, రాష్ట్రాల మధ్య పాలనా పరమైన సంబంధాల్లో భాగంగా ఆయన రేవంత్‌తో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌పై అనేక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా దేశంలో ఉన్న పాకిస్థానీలను ఈ నెలాఖరుకల్లా తిరిగి పంపించేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అమిత్ షా అన్ని రాష్ట్రాల సీఎంలకు ఫోన్ చేసి.. కేంద్ర ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

పీవోకేను భారత్‌లో కలపండి

ఉగ్రమూకలకు గట్టిగా బదులివ్వండి
ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకోండి
ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
కేంద్రానికి అండగా ఉంటామని వెల్లడి
పహల్‌గామ్ దాడికి నిరసనగా హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ 3
పాల్గొన్న సీఎం, మంత్రులు, ఎంపీ అసద్



హైపర్‌సోనిక్ స్క్రామ్‌జెట్ కంబస్టర్ పరీక్ష

విజయవంతం

హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లో ప్రయోగం
అత్యాధునిక ఆయుధ సాంకేతికతలో కీలక మైలురాయి 12
శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్

ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో ప్రజల ముందు

దోషిగా బీఆర్ఎస్!

రాష్ట్ర రైతులకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి
ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నిరుపయోగమని ఎన్‌డీఎస్ఏ తేల్చింది
నిర్మాణంలో లోపాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు: మంత్రి ఉత్తమ్ 3
నివేదిక అమలుకు ప్రభుత్వం కసరత్తు
28న సీఎంతో సమావేశంలో తుది నిర్ణయం


భారత సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, మహేశ్, మధు యాష్కీ

ఆ మూడు రంగాలకు.. రాష్ట్రం అనుకూలం

లైఫ్ సైన్సెస్, టూరిజం, ఐటీలో పెట్టుబడులు పెట్టండి.. సులభంగా అనుమతులు ఇస్తాం
విదేశీ ప్రతినిధులకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
అట్టహాసంగా 'భారత్ సదస్సు-2025' ప్రారంభం
100కుపైగా దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు
రాహుల్, ఖర్గే రాకపోవడంతో ప్లీనరీ వాయిదా
నేడు రాహుల్ రాక?.. ప్లీనరీని నిర్వహించే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి లైఫ్ సైన్సెస్, టూరిజం, ఐటీ వంటి రంగాలు ఎంతో అనుకూలమని, విదేశీ ప్రతినిధులు తమ దేశాలు, సంస్థల ద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెట్టించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ముందుకొచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని.. అన్ని రకాల అనుమతులు సులభంగా అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. 'భారత్ సదస్సు-2025'లో భాగంగా విదేశీ ప్రతినిధులకు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, యువజన,

మిగతా 2వ పేజీలో...

'ప్రపంచ శాంతి'లో మహిళల పాత్ర పెరగాలి
భారత్ సమ్మిట్‌లో 'జెండర్ జస్టిస్, ఫెమినిస్ట్ ఫ్యూచర్' అంశంపై చర్చాగోష్ఠిలో అభిప్రాయపడిన వక్తలు

తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించాల్సిందే
విద్వేషాలు క్షణాల్లో వ్యాపిస్తున్నాయి: దిగ్విజయ్‌సింగ్

కేసీఆర్ మాటే వేదం

ఆయన ఏ బాధ్యత అప్పగించినా చేపడతా.. ఆయనే మళ్లీ కాబోయే సీఎం
అసెంబ్లీ, లోక్‌సభలో గెలిపించి ఉంటే సంకీర్ణంలో తెలంగాణకు మేలయ్యేది



రేవంతే ఐదేళ్లుంటే కాంగ్రెస్ కనుమరుగు
మేం కూడా అదే కోరుకుంటున్నాం
ఉపయోగం లేదనే ఎమ్మెల్సీకి పోటీ చేయలే
మాకు అహంకారం లేదు.. మాటతీరే అంత
కవిత, కేటీఆర్ మధ్య ఎడం అబద్ధం
మంత్రిగా ఉన్నప్పుడు నిద్ర కూడా పోలేదు
ప్రతిపక్షంలో ఉంటేనే పరిణతి చెందుతాం
ఏబీఎన్ ఇంటర్వ్యూలో హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో కీలక నేతల మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని, మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే ఉంటారని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. కేటీఆర్, కవిత మధ్య గ్యాప్ అనేది గిట్టనివారి ప్రచారమని కొట్టిపారేశారు. కేసీఆర్ తమ నాయకుడని, ఆయన నిర్ణయమే శిరోధార్యమని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటతీరు, తిట్ల దండకం వల్ల ఆయన పార్టీ నేతల నుంచే మద్దతు కరవైందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా హరీశ్‌రావు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి వచ్చి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు..

బీఆర్ఎస్ విఫలమైంది. అదే పేరుతో రజతోత్సవం నిర్వహిస్తున్నారు?

జయాపజయాలు సహజం. పేరు మార్చినంత మాత్రాన విఫలమైందని అనుకోవడం సరికాదు. కేసీఆర్ విజన్ కరెక్టు. బీజేపీ సొంతంగా అధికారంలోకి రాదని, ప్రాంతీయ పార్టీలపైనే ఆధారపడుతుందని అంచనా

మిగతా 14వ పేజీలో...

'తెలుగు స్థానంలో సంస్కృతం'పై

ఇంటర్ బోర్డు యూటర్న్!

సాహితీవేత్తల విమర్శలతో వెనక్కు
తెలుగు పట్ల అపార గౌరవం.. అభిమానం
10 సంస్కృత అధ్యాపక పోస్టుల భర్తీ కోసమే వివరాలడిగాం 2
సంస్కృతాన్ని ప్రోత్సహించే ఉద్దేశం లేదు: ఆర్జేడీ జయప్రదబాయి



ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఉరి శిక్ష వేయండి

మాలేగావ్ కేసులో కోర్టుకు ఎన్ఐఏ విజ్ఞప్తి 12
గతంలో ఇచ్చిన క్లీన్‌చిట్‌కు భిన్నంగా యూటర్న్

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత

వృద్ధాప్య సమస్యలతో బెంగళూరులో తుదిశ్వాస
తొమ్మిదేళ్లపాటు ఇస్రో చైర్మన్‌గా విశేష సేవలు.. రాష్ట్రపతి ముర్ము ప్రధాని మోదీ నివాళి


12

ఉగ్రవాదంపై పోరులో ఐక్యంగా భారత్

ప్రతి భారతీయుడు కలిసి రావాలి
కశ్మీర్‌లో విపక్ష నేత రాహుల్‌గాంధీ
ఆర్మీ92 బేస్ ఆస్పత్రిలో పహల్గాం క్షతగాత్రుడికి పరామర్శ
ఎల్జీ మనోజ్‌సిన్హా, సీఎం ఒమర్‌తో భేటీ


12

వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వొద్దు

ఇస్తే న్యాయ వ్యవస్థే చట్టం చేసినట్లవుతుంది
పార్లమెంటు చేసిన చట్టం రాజ్యాంగబద్ధమే
సుప్రీంలో కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు

పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తి చేయాలి: తుమ్మల



హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై చేపట్టిన విజిలెన్స్ విచారణను సత్వరమే పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్లలో జరిగే ఎలాంటి అక్రమాలను ప్రభుత్వం ఉపేక్షించదని అన్నారు. అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమాలు ఎలా జరిగాయి? అనే అంశంపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను పిలిపించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో విజిలెన్స్ విచారణ చేపడుతున్నారని తెలిపారు. విజిలెన్స్ ఇచ్చే విచారణ నివేదిక ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెవెన్యూ మంత్రి పేరిట వసూళ్లు.. ఇద్దరి అరెస్ట్

» అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: పొంగులేటి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేష్.. కొంత కాలంగా పొంగులేటి వద్ద వ్యక్తిగత సహాయకులమని చెప్పుకొంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, పోలీసులకు ఫోన్లు చేసి బెదిరించడమే కాకుండా.. కొంతమంది వద్ద డబ్బు వసూలు చేశారు. ఈ విషయం మంత్రి దృష్టికి రాగా.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. నాగోలులో నివాసం ఉంటున్న వారిద్దరినీ అరెస్టు చేశారు. తన వ్యక్తిగత సహాయకులమనే పేరుతో ఎవరైనా ఫోన్ చేసినా, చిన్న అనుమానం తలెత్తినా సచివాలయంలోని తన కార్యాలయ నంబర్లకు(040-234541072, 040-23451073) ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తన పేరును వాడుకొని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మే తొలి వారంలో జీపీవోల ఎంపికకు పరీక్ష!

గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగియనుంది. దరఖాస్తు చేసుకున్న వీఆర్వో, వీఆర్ఏలకు మే తొలి వారంలో రాత పరీక్ష నిర్వహించేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది. ఈ పరీక్ష ఆధారంగానే పోస్టులకు ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలను సిద్ధం చేసిన సీసీఎల్ఏ.. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తోంది. నియామక ప్రక్రియను పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపట్టాలా.. లేక కలెక్టర్ల నేతృత్వంలోనా..? అన్న దానిపై త్వరలో ప్రభుత్వం ప్రకటన చేయనున్నట్లు తెలిసింది.

యథావిధిగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ సిలబస్

ఇంటర్ ప్రథమ సంవత్సరం పాఠ్యాంశాలలో మార్పులు చేయాలన్న ఇంటర్ బోర్డు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 20% ఇంటర్నల్ మార్కులు ప్రవేశ పెట్టాలని ఇంటర్ బోర్డు భావించింది. ఇంతవరకు వార్షిక పరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తున్నారు. దీనిని 80 మార్కులకు కుదించి 20 ఇంటర్నల్ మార్కులు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసింది. దీనికి అనుగుణంగా తెలుగు అకాడమీతో పాఠ్యాంశాలను సవరించింది. దీనికి సంబంధించి అనుమతి కోరగా బోర్డు ప్రతిపాదనను సర్కారు తిరస్కరించింది.

బీసీ సంక్షేమశాఖకు 4,639 కోట్ల నిధులు

బీసీ సంక్షేమశాఖకు 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.4,639 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న కల్యాణలక్ష్మి పథకానికి రూ.2,173కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్‌కు రూ.124కోట్లు, వృత్తివిద్యా విద్యార్థులకు సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్‌కు రూ.250కోట్లు విడుదల చేసేందుకు ఆర్థికశాఖ అనుమతులు మంజూరు చేసింది.

'తెలుగు స్థానంలో సంస్కృతం'పై

ఇంటర్ బోర్డు యూటర్న్!

» సాహితీవేత్తల విమర్శలతో వెనక్కి తగ్గిన బోర్డు
» తెలుగు పట్ల అపార గౌరవం.. అభిమానం
» 10 సంస్కృత పోస్టుల భర్తీ కోసమే వివరాలడిగాం
» సంస్కృతాన్ని ప్రోత్సహించే ఉద్దేశం లేదు: ఆర్జేడీ
» తప్పుడు సమాచారంతో జయప్రదబాయి ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగు స్థానంలో సంస్కృతాన్ని తీసుకురావాలని ప్రయత్నించిన ఇంటర్ బోర్డు.. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలపై ఎట్టకేలకు స్పందించింది. తెలుగు భాషావేత్తలు, సాహితీవేత్తల విమర్శలతో యూటర్న్ తీసుకుంది. తెలుగు పట్ల అపార గౌరవం, అభిమానం ఉన్నాయని, రాష్ట్ర అధికార భాష అయిన తెలుగును నిలబెట్టేందుకు తమ వంతు ప్రయత్నం తప్పకుండా చేస్తామని ప్రకటించింది. అయితే వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) హోదాలో జయప్రదబాయి నిబంధనలకు వ్యతిరేకంగా, ఇష్టానుసారంగా జారీ చేసిన ఉత్తరుల విషయాన్ని ప్రస్తావించిన 'ఆంధ్రజ్యోతి' పై తప్పుడు ఆరోపణలు చేస్తూ అసత్య వివరణ ఇచ్చారు. 'తెలుగుకు ద్రోహం.. 'జయప్రదం'గా సంస్కృతం" శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా, ఈ కథనంలోని ప్రశ్నలకు ఆమె సూటిగా సమాధానం ఇవ్వకుండా.. తప్పుడు సమాచారంతో ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టేందుకు, అందుకు అవసరమయ్యే సంస్కృత జూనియర్ లెక్చరర్ల పోస్టుల కోసం పూర్తి వివరాలతో కూడి నివేది అందించాలని ఇంటర్ బోర్డులో వరంగల్ ఆర్జేడీగా ఉన్న జయప్రదబాయి ఈ నెల 8న అన్ని ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు గతంలోని రెండు మెమోలను రిఫరెన్స్‌గా ఆమె ప్రస్తావించారు. అయితే ఆ రెండు రిఫరెన్స్‌లలో ఎక్కడ కూడా సంస్కృతాన్ని అన్ని కాలేజీల్లో ప్రవేశపెట్టాలన్న పదమే లేదు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రశ్నించింది. దీనికి సమాధానం చెప్పాల్సిన జయప్రదబాయి.. 'ఆంధ్రజ్యోతి' కథనం తప్పు అంటూ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె పేర్కొన్న విషయం ప్రభుత్వాన్ని కూడా తప్పుబట్టేలా ఉంది.

అవాస్తవాలతో ప్రకటన..

"ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేసిన 10 సంస్కృత పోస్టుల భర్తీ కోసమే కాలేజీల నుంచి అంతర్గతంగా సమాచారం కోరాం" అని ప్రకనటలో ఆర్జేడీ జయప్రదబాయి తెలిపారు. కానీ, ఇది అవాస్తవం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ 10 సంస్కృత పోస్టుల భర్తీకి సంబంధించి ఫిబ్రవరి 14న కౌన్సెలింగ్ నిర్వహించి పది మందిని ఎంపిక చేసింది. మార్చి 12న సీఎం వీరికి నియామక పత్రాలు జారీ చేశారు. వీరంతా మార్చి 13న ఉద్యోగ బాధ్యతలు కూడా స్వీకరించారు. కానీ, అన్ని కాలేజీల్లో సంస్కృతం అమలు సమాచారం కోరుతూ ఆర్జేడీ ఈ నెల (ఏప్రిల్) 8న ఆదేశాలు జారీ చేశారు. అంటే 10 మంది సంస్కృత ఉపాధ్యాయులు వారికి కేటాయించిన కాలేజీల్లో చేరిన 25 రోజుల తరువాత ఉత్తర్వులిచ్చారు. ఇది పూర్తిగా ఇంటర్ బోర్డుతోపాటు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడమే అవుతుంది. గత ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో వరంగల్ ఆర్జేడీగా ఉన్న జయప్రద బాయిని ఇంటర్ బోర్డులో అత్యంత కీలకమైన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించి నియమించారు. రెండు కీలక పదవుల్లో ఉంటూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, ఇష్టానుసారంగా ఉత్తర్వులు, తప్పుడు ప్రకటనలు జారీ చేస్తున్నా.. ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



భారత్ సదస్సులో పాల్గొన్న దిగ్విజయ్ సింగ్, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీలు చామల, మల్లురవి

ఆ మూడు రంగాలకు.. రాష్ట్రం అనుకూలం

(మొదటిపేజీ తరువాయి)

పర్యావరణ న్యాయం, ప్రపంచ శాంతి, రాష్ట్రంలోకి పెట్టుబడుల ఆహ్వానం, అహింస అంశాలు ఇతివృత్తంగా కాంగ్రెస్ సర్కారు చేపట్టిన రెండు రోజుల 'భారత్ సదస్సు-2025' శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లోని నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు 100కుపైగా దేశాల నుంచి 300 మందికిపైగా ప్రతినిధులు దీనికి తరలివచ్చారు. వివిధ దేశాలకు చెందిన మాజీ మంత్రులు, ఎంపీలు, సెనేటర్లు, ప్రగతిశీల రాజకీయ పార్టీల అధ్యక్షులు, నేతలు, వివిధ అంశాల నిపుణులు ఇందులో ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నాలుగు చర్చాగోష్ఠులు (ప్యానెల్ డిస్కషన్స్), ప్లీనరీ జరగాలి. కానీ కీలక నేతలు రాహుల్‌గాంధీ, ఖర్గే రాకపోవడంతో ప్లీనరీ వాయిదా పడింది. 'లింగ సమానత్వం - ఫెమినిస్ట్ ఫ్యూచర్'.. 'నిజాలు వర్సెస్ కల్పితాలు: తప్పుడు సమాచారాన్ని నిరోధించడం'.. 'యువత -రేపటి రాజకీయాలు'.. 'షేపింగ్ న్యూ మల్టీల్యాటెరిలిజం (బహుళ సంఖ్యలో దేశాల మధ్య ఒడంబడికలు)'పై చర్చాగోష్ఠులు జరిగాయి. సదస్సులో కాంగ్రెస్ జాతీయ నేతలు దిగ్విజయ్‌సింగ్, సల్మాన్ ఖుర్షీద్, గురుదీప్ సింగ్ సప్పల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బలరాం నాయక్, రేణుకా చౌదరి తదితరులు పాల్గొన్నారు.



భారత్ సదస్సులో నూలు తీస్తున్న విదేశీ మహిళ

ఉగ్రదాడిపై సదస్సు దిగ్భ్రాంతి

పహల్ గామ్ ఉగ్రవాద దాడిపై భారత్ సదస్సు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులంతా దీనిపై సంయుక్త ప్రకటన విడుదల చేశారు. "ఉగ్రదాడితో దిగ్భ్రాంతి చెందాం. 26 మంది అమాయక పౌరులు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. భారత ప్రజలకు మేం సంఘీభావం తెలుపుతున్నాం. ఉగ్రదాడిని ఖండిస్తున్నాం. ఇది రాజ్యాంగ విలువలపై జరిగిన ప్రత్యక్ష దాడి" అని పేర్కొన్నారు.



భారత్ సదస్సులో పాల్గొనేందుకు ఉత్సాహంగా వస్తున్న విదేశీ ప్రతినిధులు

భారత్ సదస్సుపై పహల్‌గామ్ ప్రభావం

ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ సదస్సుపై పహల్‌గామ్ ఉగ్రదాడి ఘటన ప్రభావం కనిపించింది. సదస్సు ఊహించిన రీతిలో జరగలేదు. విదేశీ ప్రతినిధులు తరలివచ్చినా.. కాంగ్రెస్ నేతల్లో కాస్త నిరుత్సాహం కనిపించింది. నిజానికి కాంగ్రెస్ మూల సిద్ధాంతం, రాహుల్‌గాంధీ చెప్పే 'న్యాయ్' అంశాన్ని ఈ సదస్సు ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ, ఆర్థికపరంగా పెను మార్పులు సంభవిస్తున్న తరుణంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ న్యాయాలపై చర్చించి.. ప్రపంచానికి ఓ సందేశాన్ని పంపాలని కాంగ్రెస్ నేతలు భావించారు. వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రగతిశీల రాజకీయ పార్టీల అధ్యక్షులు, మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొనే ఈ సదస్సుకు మంచి ప్రచారం వస్తుందని ఆశించారు. మరోవైపు బీజేపీ, ఇతర జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు కూడా ఈ సదస్సుపై దృష్టి సారించాయి. చాలా కాలం తర్వాత కాంగ్రెస్ ఇంత పెద్ద సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో.. దీని ప్రభావం ఏమైనా ఉంటుందా అన్న కోణంలో చూశాయి. కానీ ఉగ్రదాడి ఘటనతో యావత్ దేశం దృష్టి అటువైపే మళ్లింది. రాహుల్, ఖర్గే రాకపోవడంతో కాంగ్రెస్ నేతల్లో కాస్త నిరుత్సాహం కనిపించింది.

నేడు సాయంత్రం ప్లీనరీ!

శనివారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటలకు 'ఓవర్‌కమింగ్ పోలరైజేషన్ విత్ ప్లూరలిజం, డైవర్సిటీ, రెస్పెక్ట్' అంశంపై, 'యాక్సలరేటింగ్ క్లైమేట్ జస్టిస్'పై మొదటి, రెండో చర్చా గోష్ఠులు ఉంటాయి. మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు 'ఎకనామిక్ జస్టిస్ ఇన్ అన్‌సర్టేన్ టైమ్స్'పై, 'పీస్ అండ్ జస్టిస్ ఇన్ మల్టీపోలార్ వరల్డ్'పై చర్చాగోష్ఠులు ఉంటాయి. సాయంత్రం ప్లీనరీ నిర్వహిస్తారని సమాచారం. ఈ ప్లీనరీలో రాహుల్ గాంధీ, ఖర్గే పాల్గొనే అవకాశాలున్నాయి. సదస్సు ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పాల్గొంటారు.

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా...: శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. భారత్ సదస్సులో దేశ విదేశాల ప్రతినిధులకు రాష్ట్ర అభివృద్ధిని, ఇక్కడ పెట్టుబడులకు అవకాశాలను వివరిస్తున్నామని చెప్పారు.



'తెలంగాణ రైజింగ్'.. : భట్టి

రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విదేశీ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'తెలంగాణ రైజింగ్' నినాదంతో రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వెల్లడించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలు, స్కిల్స్ యూనివర్సిటీ, హరిత ఇంధన పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి, రీజనల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లు, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, నాలెడ్జ్ ఐటీ హబ్, ఇందిరా గిరి జల వికాసం, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలను వివరించారు. అభివృద్ధి విషయంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలవబోతున్నామని చెప్పారు. దావోస్, జపాన్‌లలో సీఎం రేవంత్ పర్యటించి వేల కోట్ల విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడుల కోసం లైఫ్ సైన్సెస్, టూరిజం, ఐటీ వంటి రంగాలు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. విదేశీ ప్రతినిధులు తమ దేశాలు, సంస్థల ద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెట్టించాలని కోరారు. వారికి ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాల అనుమతులను సులభంగా అందిస్తామని తెలిపారు.

ఈ సదస్సు చరిత్రలో నిలిచిపోతుంది..

కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన సత్యం, అహింస, సామాజిక న్యాయం ఆధారంగా ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ సదస్సును నిర్వహిస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తొలిరోజు కార్యక్రమాలు ముగిశాక ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ప్రపంచ దేశాలకు చాటి చెప్పామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏ విధంగా ముందుకు తీసుకుపోతున్నామో వివరించామని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేశారని భట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ.. 'రైజింగ్ తెలంగాణ.' ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సామాజిక న్యాయం అమలు దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ భేష్

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతం చేయాల్సిందే.. సదస్సులో పలువురి అభిప్రాయం

భారత్ సదస్సుకు దాదాపు 100 దేశాల నుంచి పలు పార్టీల ప్రతినిధులతో పాటు పెట్టుబడిదారులు, సామాజికవేత్తలు హాజరయ్యారు. లింగ సమానత్వం, సామాజిక న్యాయం తదితర అంశాలపై జరుగుతున్న చర్చలలో పాల్గొనడానికి ఆయా దేశాల నుంచి వచ్చిన కొంతమంది 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. - ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ

దక్షిణ భారత్‌లోనే పెట్టుబడులకు అవకాశాలు



ఉత్తర భారత దేశంతో పోలిస్తే దక్షిణ భారత దేశంలోనే పెట్టుబడులకు అవకాశాలెక్కువ. తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ భేష్. ఆర్థిక వృద్ధి బాగుంది. ఇక్కడ మంచి నాయకత్వం ఉంది. నేను న్యూయార్క్‌లో ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్‌గా చేస్తున్నాను. పలు దేశాలల్లో పెట్టుబడుల అవకాశాలను గురించి సలహాలివ్వడంతో పాటుగా అవకాశాలను కూడా చెబుతుంటాం. ఈ రోజు భారత్ సదస్సులో భాగంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కోసమే ఇక్కడికి వచ్చాను. ప్రపంచంలోనే పెట్టుబడులు పెట్టేందుకు భారత్ ఇప్పుడు అత్యుత్తమ దేశాలలో ఒకటి. కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ఘటన పిచ్చి చర్య. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతం చేయాల్సిందే.

- రాహుల్ దీదీ, ఎండీ, సౌత్ ఏసియన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్వైజరీ గ్రూప్, యూఎస్ఏ

అమెరికా నుంచి కుర్దిష్ గురించి పోరాటం



వాషింగ్టన్ నుంచి భారత్ సదస్సులో పాల్గొనడానికి ప్రత్యేకంగా వచ్చాను. నిజానికి నేను కెనడియన్‌ను.. కానీ, యుఎస్‌లో స్థిరపడ్డాను. కోమల పార్టీ ఆఫ్ ద ఇరానియన్ కుర్దిస్తాన్ ప్రతినిధిగా కుర్దిష్ ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నాము. ఇరాన్‌లో కుర్దిష్ ప్రజల మానవ హక్కులు హరించబడుతున్నాయి. మా కోమల పార్టీ సెక్యులర్ పార్టీ.

-సలా బయాజిద్ది, యుఎస్‌లోని కోమల పార్టీ ఆఫ్ ద ఇరానియన్ కుర్దిస్తాన్ ప్రతినిధి

అన్ని దేశాల్లోనూ లింగ వివక్ష

లింగ సమానత్వం గురించి మాట్లాడటానికి ఇక్కడికి వచ్చాను. అన్ని దేశాలల్లోనూ లింగ వివక్ష కొనసాగుతూనే ఉంది. లింగ సమానత్వం గురించి విస్తృతంగా చర్చ జరగాలి. నేను స్వీడన్ విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేసిన కాలంలో ఫెమినిస్ట్ ఫారిన్ పాలసీ తీసుకురావాలని ప్రయత్నించాను.

- ఆన్ లిండా, స్వీడన్ మాజీ మంత్రి



చర్చాగోష్ఠిలో సల్మాన్ ఖుర్షీద్, పల్లంరాజు, పర్ణికారెడ్డి తదితరులు

'ప్రపంచ శాంతి'లో మహిళల పాత్ర పెరగాలి

- ప్రభుత్వాల్లో మహిళలుంటేనే అవినీతికి కళ్లెం
- ఆయా దేశాల బడ్జెట్లలోనూ ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రైవేటు రంగంలోనూ ప్రోత్సాహకాలు ఉండాలి
- సమ్మిట్‌లో 'జెండర్ జస్టిస్, ఫెమినిస్ట్ ఫ్యూచర్' అంశంపై చర్చాగోష్ఠిలో అభిప్రాయపడిన వక్తలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని సాధించే ప్రక్రియలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం 'జెండర్ జస్టిస్, ఫెమినిస్ట్ ఫ్యూచర్' అంశంపై జరిగిన చర్చా గోష్ఠి (ప్యానెల్ డిస్కషన్)లో పలువురు విదేశీ ప్రతినిధులు, కేంద్ర మాజీ మంత్రులు సల్మాన్ ఖుర్షీద్, పల్లం రాజు, నారాయణ్‌పేట్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడారు. స్వీడన్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి ఆన్‌లిండే మాట్లాడుతూ ప్రపంచశాంతిని సాధించే ప్రక్రియలో మహిళల పాత్ర పెంచాలని సూచించారు. ఐరాస నిర్వహించే ప్రపంచ శాంతి చర్చల్లో మహిళల పాత్ర ఉండడం లేదన్నారు. మహిళలు పాల్గొనడం వల్ల ప్రపంచ శాంతి పరిఢవిల్లే అవకాశం ఉంటుందన్నారు. మంగోలియా ఎంపీ, ఆర్థికవేత్త ఉంద్రామ్ చిన్‌బాట్ మాట్లాడుతూ మహిళలు, పురుషుల సంఖ్య ఆధారంగా దేశాల బడ్జెట్‌ను రూపొందించాలని అభిప్రాయపడ్డారు. అందులో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తమ పార్లమెంటులో 25శాతం మంది మహిళా ఎంపీలేనని తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపుల విషయంలో కఠిన చట్టాలను అమలు చేస్తున్నామని వివరించారు. సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ ఒకప్పుడు టీచర్ వృత్తికే పరిమితమైన మహిళలు ఇప్పుడు భారత వైమానిక దళంలో యుద్ధ విమానాల పైలట్లుగా రాణిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ మహిళలకు ప్రోత్సాహకాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పల్లంరాజు మాట్లాడుతూ రాజీవ్ హయాంలో స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామికీకరణకు దారి తీసిందన్నారు. నారాయణ్‌పేట్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతను సాధించాలంటే సమాజ ఆమోదం ఉండాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే ప్రయత్నంలో ఉందని, తన నియోజకవర్గంలో మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయించానని తెలిపారు. జెండర్ జస్టిస్‌ను సాధించాలంటే సమ్మిళిత విధానాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. అర్జెంటీనా సోషలిస్ట్ పార్టీ నాయకురాలు మోనికా హైదీ ఫీన్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలను నిరోధించడానికి తమ దేశంలో కఠిన చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.



100 దేశాలు.. వివిధ భాషలు.. అయితేనేం.. అందరికీ అర్థమయ్యేలా వారికి తెలిసిన భాషలోకి అనువదించేందుకు ఈ ఆధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులో ఉంచారు.

తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించాల్సిందే

'నిజాలు, కల్పనలు.. తప్పుడు సమాచార వ్యాప్తి నిరోధం'పై చర్చలో వక్తలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా తప్పుడు సమాచార వ్యాప్తి, డీప్‌ఫేక్ వీడియోలు, సమాచార వక్రీకరణలు వంటి వాటిని నిరోధించడానికి రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. భారత్ సదస్సులో భాగంగా శుక్రవారం జరిగిన 'నిజాలు వర్సెస్ కల్పనలు.. తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించడం' అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో కేంద్ర మాజీ మంత్రి దిగ్విజయ్ సింగ్, విదేశీ ప్రతినిధులు మాట్లాడారు. థాయ్‌లాండ్ పంచప్ కంపెనీ సీఈఓ ధనిసారా రాంగ్‌దేజ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో జరిగే తప్పుడు సమాచారంపై ప్రజల్లో అవగాహన పెంచాలని.. వాస్తవాలను బయటపెట్టి, తప్పుడు పచారం చేసినవారిని బాధ్యులుగా చేయాలని సూచించారు. దిగ్విజయ్‌సింగ్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో తప్పుడు సమాచార సృష్టి, వ్యాప్తి పెరుగుతున్నాయని, పగ, విద్వేషాలు క్షణాల్లో వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు. ఫిన్లాండ్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు మియా పెట్రా కుంపులా నట్రి మాట్లాడుతూ.. డీప్‌ఫేక్ వీడియోలు, తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించడానికి తమ దేశంలో విద్యావ్యవస్థను మార్చామని చెప్పారు. ఇక తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి సూచించారు. ఈ చర్చలో యూకే లేబర్ పార్టీ నాయకుడు మాథ్యూ విలియమ్, మలేషియా ప్రతినిధి రామ్‌కర్పాల్ సింగ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకం తీరు



కంచి మఠం ఉత్తరాధికారిగా గణేశ శర్మ

» అన్నవరం రుగ్వేద పండితుడికి అవకాశం



గణేశ శర్మ

చెన్నై/అన్నవరం/బాసర, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని సుప్రసిద్ధ శంకర మఠం ఉత్తరాధికారిగా అన్నవరానికి చెందిన గణేశ శర్మ ద్రావిడ్ నియమితులయ్యారు. ఈ నెల 30న అక్షయ తృతీయ సందర్భంగా దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రావిడ్‌కు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతి శంకరాచార్యులు సన్యాస దీక్షను ఇస్తారని కంచి శంకర మఠం శ్రీకార్యం (మేనేజర్) చల్లా విశ్వనాథ శాస్త్రి శుక్రవారం తెలిపారు. అన్నవరం దేవస్థానం వ్రత పురోహితులుగా పనిచేస్తున్న దుడ్డు ధన్వంతరీ, మంగాదేవి దంపతులకు 2000 ఏప్రిల్ 24న గణేశ శర్మ జన్మించారు. తల్లి గృహిణి. గణేష శర్మ తన ఆరో ఏటనే రత్నాకర భట్టు వద్ద రుగ్వేదం అభ్యసించి, నిష్ణాతులయ్యారు. అనంతరం తెలంగాణలోని బాసర జ్ఞానసరస్వతి దేవస్థానంలో పండితుడిగా వ్యవహరించారు. ఆ సమయంలో బాసర పర్యటనకు వచ్చిన కంచి మఠం పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆయనను శంకర మఠానికి తీసుకెళ్లారు. అక్కడ తర్కం, మీమాంసతో పాటు సామవేదం, యజుర్వేదంలో స్వామీజీ స్వయంగా శిక్షణ ఇచ్చారు. కంచి మఠానికి ప్రస్తుతం విజయేంద్ర సరస్వతి 70వ పీఠాధిపతిగా ఉంటున్నారు. 2018 జనవరి 28న జయేంద్ర సరస్వతి మహాసమాధి చెందడంతో అప్పట్లో యువ పీఠాధిపతిగా ఉన్న విజయేంద్ర సరస్వతి బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆరేళ్ల పాటు ఉత్తరాధికారి ఎంపిక వాయిదా పడుతూ వచ్చింది. కాగా, సన్యాస దీక్ష స్వీకరించిన అనంతరం మే 2న కంచి మఠంలో జరిగే ఆది శంకర జయంతి ఉత్సవాల్లో విజయేంద్ర సరస్వతితో పాటు యువ పీఠాధిపతి కూడా పాల్గొంటారని మఠం నిర్వాహకులు వెల్లడించారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

కాటారం, రాజాపేట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పంట నష్టం, అప్పుల బాధతో జయశంకర్ భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలు, తెగుళ్లతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య (55) పత్తిపంట దెబ్బతిన్నది. వరి పొలం కూడా నీళ్లు అందక కొంతమేర ఎండిపోయింది. పంట కోసం చేసిన రూ.1.20 లక్షల అప్పు తీర్చలేననే బాధతో రాజయ్య గురువారం రాత్రి గడ్డిమందు తాగాడు. అస్వస్థతకు గురైన రాజయ్యను కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రేటి చెరువు గ్రామానికి చెందిన యువరైతు కర్రె మహేశ్ (28) తనకున్న ఎకరంన్నర పొలంలో వ్యవసాయం చేయడంతో పాటు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సాగునీటి కోసం రూ.4 లక్షలు అప్పుచేసి బోర్లు వేయించాడు. ఇంటి నిర్మాణం కోసం 10 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, ఆటో కూడా సరిగా నడవకపోవడంతో అప్పు తీర్చలేననే బాధతో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

పీవోకేను భారత్‌లో కలిపేయండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి.. పహల్‌గామ్ దాడికి నిరసనగా హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్, మంత్రులు దామోదర, పొన్నం, జూపల్లి, ఎంపీ అసద్, విజయశాంతి

హైదరాబాద్/సిటీ/మెదక్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడికి గట్టిగా బదులివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలిపేయాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యలకు భారతీయులంతా మద్దతుగా ఉంటారని చెప్పారు. ఈ విషయంలో ఇందిరాగాంధీని స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 1967, 1971లో ఇలాంటి దాడులు జరిగినప్పుడు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ పాక్‌కు గట్టి జవాబు ఇచ్చారని గుర్తుచేశారు. పాకిస్థాన్‌ను.. పాక్, బంగ్లాదేశ్‌గా రెండు ముక్కలు చేశారని చెప్పారు. ఆ సమయంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతగా అభివర్ణించారని తెలిపారు. దుర్గామాత భక్తులుగా ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకొని ఉగ్రమూకలకు గట్టిగా జవాబివ్వాలని మోదీకి సూచించారు. పహల్గాం ఉగ్ర దాడిని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్‌తో పాటు భారత్ సమ్మిట్-2025కు వచ్చిన పలువురు విదేశీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పహల్గాంలో భారతీయుల మీద పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులు చేసి 26 మందిని పొట్టనబెట్టుకున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో దేశం అభివృద్ధి పథం వైపు నడుస్తున్న సందర్భంలో పాక్ ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ విషయంలో 140 కోట్ల భారతీయులంతా ఏకమై రాజకీయాలకు అతీతంగా, పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరులో భారత ప్రభుత్వానికి అండగా నిలబడతామన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా ప్రధాని వెంట ఉంటారని, ఉగ్రవాదులకు ఇక్కడి నుంచే హెచ్చరికలు జారీ చేస్తున్నామని చెప్పారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అందరం ఏకమై ఉగ్రవాదాన్ని అంతమొందించి, ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దామని పిలుపునిచ్చారు. పహల్గాం దాడి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని, ఆ కుటుంబాలకు అండగా నిలబడతామని చెప్పారు. కొవ్వొత్తుల ర్యాలీలో భారత్ సమ్మిట్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. సమ్మిట్‌కు దాదాపు వంద దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. వారిలో చాలా వరకు ర్యాలీకి హాజరయ్యారు. ఉగ్రదాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ పర్యాటకుల తిరుగు ముఖం

కశ్మీర్ పర్యటనకు వెళ్లి, ఉగ్రదాడి నేపథ్యంలో చిక్కుకుపోయిన తెలంగాణవాసులు తిరుగుపయనమయ్యారు. ఓ చిట్‌ఫండ్ కంపెనీ తరఫున రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 80 మంది శ్రీనగర్ వెళ్లగా, ఆంక్షల నేపథ్యంలో వారంతా హోటల్‌లోనే ఉండిపోయారు. తమ పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు వివరించగా, ఆయన కశ్మీరు డీజీపీ నళినీప్రభాత్‌తో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున డీఎస్పీ స్థాయి అధికారిని అక్కడికి పంపించారు. శుక్రవారం వారంతా తిరుగు ప్రయాణమయ్యారు.

నల్ల రిబ్బన్లతో ముస్లింల ప్రార్థనలు



ప్రార్థనల అనంతరం మక్కా మసీదు ముందు నిరసన తెలుపుతున్న ముస్లింలు

పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా ముస్లింలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలపడంతో పాటు భారతదేశ ప్రజలంతా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా ఉన్నారని తెలిపేందుకు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొనాలని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ పిలుపునిచ్చారు. శాస్త్రిపురంలోని తన నివాసం సమీపంలోని మసీదులో ప్రార్థనలకు హాజరయ్యే వారికి ఒవైసీ నల్ల రిబ్బన్లు పంపిణీ చేశారు. అలాగే అక్బరుద్దీన్ ఒవైసీ కంచన్‌బాగ్‌లోని ఓవైసీ ఆస్పత్రి ఆవరణలో నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మక్కా మసీదులో జరిగిన ప్రార్థనల్లో వేలాది మంది ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. ప్రార్థనల అనంతరం 'పాకిస్థాన్ ముర్దాబాద్.. హిందుస్థాన్ జిందాబాద్.. అంటూ నినాదాలు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి మతం లేదని, ఉగ్రవాదుల దాడుల్లో ముస్లింలు సైతం భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని అసదుద్దీన్ చెప్పారు. పహల్గాం దాడిపై నిరసనలతోపాటు ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి భారతీయుల ఐక్యతను ప్రదర్శించే కార్యక్రమాలకు మజ్లిస్ పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మజ్లిస్ ఎమ్మెల్యేలు సైతం వారి నియోజకవర్గాల్లో పహల్గాం మృతులకు నివాళులర్పించేందుకు కొవ్వొత్తుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

సహకార సంఘాలు ఇక రైతు ఉత్పత్తిదారుల సంస్థలే!

» 311 పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ ఉత్తర్వులు

» ఎన్‌సీడీసీతో ఎంవోయూ చేసుకోవాలని కేంద్రం ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీవో)గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా తొలివిడతలో 311 పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ)తో అవగాహన ఒప్పందాలుచేసే ప్రక్రియను సహకారశాఖ ప్రారంభించింది. మరో రెండు విడతల్లో రాష్ట్రంలో మిగిలిన 597 పీఏసీఎస్‌లు కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థల జాబితాలో చేరనున్నాయి. వ్యవసాయరంగంలో అందుబాటులోకి వస్తున్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని చిన్న, సన్నకారు రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో కేంద్రం రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న విషయం విదితమే! వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరకు అందుబాటులో ఉంచటం, పంట ఉత్పత్తులకు విలువ జోడించటం, పంట ఉత్పత్తులకు అధిక లభించేలా అగ్రి మార్కెటింగ్ చేయటం, అధిక ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించటం, విత్తనోత్పత్తిని ప్రోత్సహించటం లాంటి కార్యకలాపాలు ఎఫ్‌పీవోల ద్వారా చేపడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 311 ప్రాథమిక పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా గుర్తించి అభివృద్ధి చేయటానికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్‌ను సీబీబీవో(క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థ)గా కేంద్రం గుర్తించింది. క్లస్టర్ల వారీగా నిర్వహణ, బేస్‌లైన్ సర్వే ఏజెన్సీల అమలు, వ్యాపార ప్రణాళికల తయారీ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను సహకార యూనియన్‌కు అప్పగించింది. ఎఫ్‌పీవోలుగా మారిన పీఏసీఎస్ సభ్యులకు రూ.15 లక్షల మ్యాచింగ్ గ్రాంటు మంజూరుచేస్తారు. ఎఫ్‌పీవోలు నిలదొక్కుకోవటానికి ఏడాదికి రూ.6 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.18 లక్షలు చెల్లిస్తారు. ఈ పథకానికి ప్రత్యేక క్రెడిట్ గ్యారెంటీ నిధి కింద రూ.1,500 కోట్లను కేంద్రం కేటాయించింది. ఎన్‌సీడీసీ, నాబార్డు ద్వారా ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు.

గిరిజన పాఠశాలల టీచర్లకు ఏఐపై శిక్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే 5,560 మంది ఉపాధ్యాయులకు విద్యారంగంలో 'కృత్రిమ మేధ(ఏఐ)' పాత్రపై అవగాహన తరగతులను నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి మే 30 వరకు ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మొత్తం 5,560 మంది ఉపాధ్యాయులను 15 బ్యాచ్‌లుగా విభజించారు. ఒక్కో రోజు ఒక్కో బ్యాచ్‌కు 6 సెషన్ల చొప్పున.. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు జూమ్/వెబెక్స్ ఆన్‌లైన్ వేదికల ద్వారా కృత్రిమ మేధపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

గిరిజన కళలపై 9రోజుల సమ్మర్ క్యాంప్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన కళలు, వస్తువుల తయారీ(ఆర్ట్, క్రాఫ్ట్)పై 9రోజుల పాటు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ దగ్గర డీఎస్‌ఎస్ భవన్ ప్రాంతంలో ఉన్న గిరిజన పరిశోధన సంస్థ భవనంలో ఈ నెల 28 నుంచి మే 7 వరకు ప్రతీ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్యాంపులో కోయ పెయింటింగ్, బంజారా క్రాఫ్ట్, వెదురుతో చేసే వస్తువులపై అవగాహన కల్పించనున్నారు. అదే విధంగా గిరిజన మ్యూజియం సందర్శన, గిరిజనులకు సంబంధించిన డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించనున్నారు.

మానుకోటలో ఏసీబీ దాడులు

» సస్పెండైన డీటీవో ఇంట్లో సోదాలు

» కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు స్వాధీనం

మహబూబాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారి(డీటీవో)గా పని చేస్తూ గతంలో సస్పెండైన మహ్మద్ గౌస్‌పాషా నివాసంతో పాటు ఆయన బంధువులు, కుటుంబసభ్యుల ఇళ్లలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ వివరాలను ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ విలేకరులకు వివరించారు. 2017ఏప్రిల్‌లో భద్రాది కొత్తగూడెం ఎంవీఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో గౌస్‌పాషాపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఏసీబీ అధికారులు దాడులు చేసి, ఆయనను అరెస్టు చేశారు. 2024 మే, ఆగస్టు నెలల్లో మహబూబాబాద్ ఎంవీఐగా, ఇన్‌చార్జ్ డీటీవోగా పనిచేస్తున్న సమయంలో మరోమారు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. అప్పుడు ఆయన కారు డ్రైవర్ వద్ద నగదు లభించడంతో గౌస్‌పాషాను అరెస్టు చేశారు. తాజాగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదు రావడంతో శుక్రవారం మహబూబాబాద్‌లో ఆయన అద్దెకుంటున్న ఇంటితో పాటు కరీంనగర్, హైదరాబాద్‌లోని గౌస్‌పాషా కుమారుడు, కుమార్తె, బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎనిమిది బృందాలు దాడులు నిర్వహించాయి. సుమారు రూ.26.85లక్షల విలువ చేసే రెండు ఇళ్లు, రూ.2.28 కోట్ల విలువ ఉండే 25 ఓపెన్ ప్లాట్లు, రూ.55.98 లక్షల విలువైన 10.36 ఎకరాల వ్యవసాయ భూములు, రూ.32.90 లక్షల విలువ ఉండే కారు, రెండు ద్విచక్రవాహనాలు, రూ.7.03 లక్షల విలువైన గృహోపకరణాలను గుర్తించారు. ఆ పత్రాలను స్వాధీనం చేసుకుని గౌస్‌పాషాను అరెస్టు చేశారు.

చక్కెర వ్యాధిని నియంత్రించే స్మార్ట్ కుక్కర్!

» బాపట్ల శాస్త్రవేత్త అద్భుత ఆవిష్కరణకు పేటెంట్



కుక్కర్ గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త సందీప్ రాజా

బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగులకు, ఊబకాయం ఉన్నవారికి ఉపయోగపడేలా బాపట్ల శాస్త్రవేత్త రూపొందించిన స్మార్ట్ కుక్కర్‌కు పేటెంట్ లభించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలకు సంబంధించిన కోత అనంతర పరిజ్ఞాన కేంద్రం (పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్) సీనియర్ శాస్త్రవేత్త దోనేపూడి సందీప్ రాజా ఈ స్మార్ట్ కుక్కర్‌ను రూపొందించారు. దేశంలోనే తొలిసారిగా రూపొందించిన ఈ స్మార్ట్ కుక్కర్‌కు మూడు రోజుల క్రితమే పేటెంట్ వచ్చిందని, త్వరలోనే ఇది మార్కెట్‌లోకి విడుదలవుతుందని అధికారులు తెలిపారు. గ్లైసెమిక్ ఇండెక్స్(జీఐ) స్థాయిలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. ఉదాహరణకు మనం రోజూ తినే వైట్ రైస్‌లో జీఐ స్థాయిలు అధికంగా ఉంటాయి. అయితే ఈ స్మార్ట్ కుక్కర్‌లో బియ్యాన్ని ఉడికించడం వల్ల జీఐ తగ్గుతుంది. దీంతో మధుమేహ రోగులకు చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఈ రైస్ కుక్కర్ మధుమేహ రోగులకే కాదు.. ఊబకాయం ఉన్నవారికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. అన్నంలోని గ్లైసెమిక్ ఇండెక్స్‌ను తగ్గించి నెమ్మదిగా జీర్ణమయ్యేలా చేయడమే డయాబెటిక్ స్మార్ట్ రైస్ కుక్కర్ ప్రత్యేకత అని సందీప్ రాజా తెలిపారు. ఇందులో వండిన అన్నం తింటే అరుగుదల నిదానంగా జరిగి రక్తంలో చక్కెరస్థాయి పెరగకుండా చేస్తుందని చెప్పారు. అలాగే జీవక్రియ కూడా మెరుగవుతుందని, శరీర బరువును కూడా నియంత్రణలో ఉంచుతుందని పేర్కొన్నారు. ఈ స్మార్ట్‌కుక్కర్‌ను మొబైల్ యాప్‌తో కూడా నియంత్రించవచ్చన్నారు. కాగా, గతేడాది సందీప్ రాజా రూపొందించిన రెండు పరికరాలకు కూడా పేటెంట్ లభించింది.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చెత్తబుట్టలో వేయాల్సింది

» మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్లపై ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ అథారిటీ) ఇచ్చిన నివేదిక కాంగ్రెస్, బీజేపీ కలిసి ఇచ్చినట్లుగా ఉందని, అది చెత్తబుట్టలో వేయడానికే పనికొస్తుందని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ నివేదిక ఇచ్చారని, దీన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

తుమ్మిడిహెట్టి నిర్మాణం

3 బ్యారేజీలు పునర్నిర్మాణం

కాళేశ్వరాన్ని నిలబెట్టేందుకు సమాంతర చర్యలు.. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అమలుకు ప్రభుత్వం కసరత్తు

» మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు సై

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఆధారంగా చర్యలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నివేదిక అమలు కోసం కమిటీని వేసే అవకాశాలను కూడా పరిశీలిస్తోంది. ఏక కాలంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ/మరమ్మతులతో పాటే కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా ముందుకెళ్లనుంది. ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై సమావేశం ఉంటుందని అధికారులకు సమాచారం వచ్చింది. నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇందులో పాల్గొంటారు. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డలోని ఏడో బ్లాకును తొలగించాలి. మూడు బ్యారేజీల్లో సమస్యలను గుర్తించి, మరమ్మతులకు ఉపక్రమిస్తారు. శుక్రవారం రాత్రి ఎన్‌డీఎస్‌ఏ నివేదిక రాగా నీటి పారుదల శాఖ యంత్రాంగం శనివారమంతా దాన్ని అధ్యయనం చేసింది. కొన్ని లోపాలను ఎన్‌డీఎస్‌ఏ సూటిగా ప్రస్తావించలేదన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమయింది. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగితే మరమ్మతులకు వీలుగా లోపాలపై అధ్యయనం చేయాలని తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా 2024 ఫిబ్రవరి 13న ఎన్‌డీఎస్‌ఏ ఛైర్మన్‌కు లేఖ రాశారు. 2024 మార్చి 2న కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురితో కమిటీ వేశారు. నివేదిక సత్వరం ఇస్తే బ్యారేజీలపై శాశ్వత చర్యల దిశగా ముందుకెళతామని ప్రభుత్వం పలు మార్లు అభ్యర్థించింది. పలు దఫాలుగా కేంద్రానికి లేఖలు రాసింది. ఇప్పుడు నివేదిక చేతికి రావడంతో చర్యలకు మార్గం ఏర్పడింది. మేడిగడ్డకు మరమ్మతులు/పునరుద్ధరణ పనులకు కనీసం ఏడాది సమయం పడుతుందని భావిస్తున్నారు. ఏటా జూలై నుంచి నవంబరు దాకా గోదావరికి భారీగా వరదలు వస్తుంటాయి. నదీగర్భంలో ఏ పని చేయడానికి వీలుండదు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం ఏడో బ్లాకులోని పిల్లర్లు అన్నీ తొలగించాల్సి ఉంది. 6, 8 బ్లాకులు కూడా ప్రభావితం అయ్యాయని తనిఖీల్లో తేలింది. దాంతో ఏ నిర్ణయమైనా తీసుకోవాలన్నా రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డకు ఎగువన కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద రబ్బర్ డ్యామ్ ఒకటే పరిష్కారం కానుంది. వరదల సమయంలో నీళ్లన్నీ వదిలేసి.. వరద ఉధృతి తగ్గగానే రబ్బర్ డ్యామ్ ద్వారా నీటిని నిలుపుదల చేసుకొని పంపింగ్ చేయడానికి ఆస్కారం ఉంది.

ప్రజల ముందు దోషిగా బీఆర్‌ఎస్: ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం లోపాల విషయంలో ఎన్‌డీఎస్‌ఏ నివేదిక బీఆర్‌ఎస్‌ను ప్రజల ముందు దోషిగా నిలబెట్టిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నిరుపయోగమని నివేదిక తేల్చిందని చెప్పారు. వాటిని కట్టించిన బీఆర్‌ఎస్ నేతలు తమ గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వాళ్లు తెలంగాణ రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని అన్నారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ చేపట్టిందని, నిర్మాణం ఆ పార్టీ అధికారంలో ఉండగానే జరిగిందని, బ్యారేజీలు కుంగింది కూడా ఆ పార్టీ అధికారంలో ఉండగానే అని గుర్తుచేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై శుక్రవారం ఆయన స్పందించారు. రూ.లక్ష కోట్లను అధిక వడ్డీకి అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అధోగతి పాలు చేసిందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై సమగ్ర అధ్యయనం చేసి, మంత్రివర్గ సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రాజెక్టును నాటి అధికార పార్టీ నేతల జేబులు నింపుకోవడానికే వినియోగించుకున్నారని మండిపడ్డారు. నిర్మాణంలో లోపాలను గుర్తించి, బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు బ్యారేజీలు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.



రాష్ట్ర మహాసభల సందర్భంగా ఖమ్మంలో ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ

నయా ఫాసిస్టు విధానాలకు బీజేపీ బీజం

» ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి వీపీ సాను

» ఖమ్మంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు షురూ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేస్తూ నయా ఫాసిస్టు విధానాలకు బీజం వేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి వీపీ సాను విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) అలుపెరగని పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఐదో మహాసభలు శుక్రవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీపీ సాను మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్రదాడులకు కేంద్ర ప్రభుత్వ భద్రతాలోపమే కారణమన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు ఆ పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. బీజేపీకి, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడారని యూనివర్సిటీ విద్యార్థులపై, విద్యా సమస్యలపై ప్రశ్నించిన నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సీయూ భూములను ప్రభుత్వాలు కొల్లగొడుతున్నాయని ధ్వజమెత్తారు. అభ్యుదయవాది, సినీ నటుడు మాదాల రవి మాట్లాడుతూ.. విద్యా సమస్యలపై పోరాటాలే ఏకైక మార్గమన్నారు. వామపక్షాలు ఏకం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. మహాసభల సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు నగరంలోని జడ్పీ సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నడూలేనిది అమెరికా అధ్యక్షుడికి రష్యా పాలకుడిమీద మాచెడ్డ కోపం వచ్చింది. ఇకచాలు, యుద్ధాన్ని ఆపేయ్ పుతిన్ అంటున్నారు డోనాల్డ్ ట్రంప్. పన్నెండుమందిని హతమార్చి, డెబ్బయ్‌మందిని తీవ్రంగా గాయపరిచిన రష్యా దాడి ట్రంప్‌ను కదిలించిందట. గాజాలో యుద్ధం ఆగి, ఆహారం చేరుతోందన్న సంతోషం ఎంతోకాలం నిలవనీయకుండానే, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ మళ్ళీ మారణకాండ మొదలుపెట్టినా ట్రంప్‌కు ఈ బాధకలగలేదు. ఇప్పుడు అక్కడ యథేచ్ఛగా ఊచకోతలు సాగిస్తూ ఒక్క పాలస్తీనియన్ కూడా మిగలకుండా ఇజ్రాయెల్ తరిమికొట్టేవరకూ, బహుశా దానిని మానవరహిత ప్రాంతంగా మార్చి రిసార్టు తయారీకి అప్పగించేంత వరకూ ట్రంప్‌కు గాజా గుర్తుకురాదేమో. ఉక్రెయిన్ విషయంలో మాత్రం తాను అనుకున్నట్టుగా జరగడం లేదని ట్రంప్‌కు చిరాకుగా ఉంది. అరుదైన, విలువైన ఖనిజాలు అప్పగిస్తామని ఉక్రెయిన్–రష్యా పోటాపోటీగా భారీ ఆఫర్ ఇచ్చి కూడా చాలారోజులైంది. వేగంగా ఒప్పందానికి రాకపోతే మధ్యవర్తిత్వాన్ని మధ్యలోనే వదిలేస్తామని అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అదేపనిగా హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్కాఫ్ ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉంటూ, పుతిన్ సహా కీలకనేతలతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో, యుద్ధం కొలిక్కివస్తుందని అంటున్నారు.

ట్రంప్ ప్రత్యేకదూత మాస్కోలో కాలూనినక్షణాల్లోనే రష్యా మిలటరీ జనరల్ హత్య జరిగింది. ఉక్రెయిన్ యుద్ధంలో కీలకపాత్ర నిర్వహిస్తున్న ఈ అధికారి కారుబాంబు పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది ఇదేవిధంగా ఒక జనరల్ హత్య జరిగినప్పుడు రష్యా దానిని ఉక్రెయిన్ ఖాతాలో వేసి, శపథాలు చేసింది. ఈ మారు ఉగ్రవాదుల దుశ్చర్య అని మాత్రమే ప్రకటించి ఊరుకుంది. గత ఏడాది జూలైలో కీవ్‌లోని అతిపెద్ద పిల్లల ఆస్పత్రిని నేలమట్టం చేసి, ముప్పైఐదుమందిని హతమార్చిన తరహాలోనే గురువారం

ఉక్రెయిన్ యుద్ధగతి

తెల్లవారుజామువరకూ నూటయాభై డ్రోన్లు, డెబ్బై మిసైళ్ళతో రష్యా ఉక్రెయిన్‌మీద భారీ దాడిజరిపిన విషయం తెలిసిందే. ఈ దాడి జరగడానికి ఒకరోజుముందు శాంతిచర్చలకు మోకాలడ్డుతున్నది జెలెన్‌స్కీయేనంటూ తప్పుబట్టిన ట్రంప్, ఈ దాడి అనంతరం విధిలేక పుతిన్‌ను కూడా ఓ మాట అనకతప్పలేదు.

క్రిమియా రష్యా చేతుల్లోకి పోయి పదేళ్ళయిన తరువాత కూడా దానిని గుర్తించకూడదంటే ఎలా అన్నది ట్రంప్ ప్రశ్న. మరో నాలుగేళ్ళ తరువాత, అంటే, 2018లో మీ ప్రభుత్వమే 'క్రిమియా డిక్లరేషన్'లో దానిని దురాక్రమణగా అభివర్ణించి, క్రిమియాను రష్యా అంతర్భాగంగా గుర్తించేది లేదని ప్రకటించి, ఇప్పుడు మాటమారుస్తున్నారెందుకని జెలెన్‌స్కీ ప్రశ్న. ట్రంప్ శాంతి ప్రతిపాదనలో భాగంగా క్రిమియాను రష్యాకు వదులుకోవడానికి జెలెన్‌స్కీ అంగీకరించడం లేదు. యుద్ధం ఆగకపోయినా పర్వాలేదు కానీ, మా రాజ్యాంగానికీ, ఆత్మగౌరవానికీ, క్రిమియాలో ఉన్న తోటి ఉక్రేనియన్లకు మేము ద్రోహం చేయలేమని అక్కడి 1ప్రజలు అంటున్నారు. శాంతి కావాలో, మరో మూడేళ్ళపాటు యుద్ధాన్ని కొనసాగనిచ్చి మొత్తం దేశాన్నే కోల్పోతారో ఆయనే తేల్చుకోవాలని అని ట్రంప్ మరోమారు జెలెన్‌స్కీని రెచ్చగొట్టారు కూడా.

దక్షిణ ఉక్రెయిన్‌లో నల్లసముద్రం వెంబడివున్న క్రిమియా వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో రష్యా ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. శాంతి ఒప్పందానికి క్రిమియా ప్రధాన అంశం కావడంతో, జెలెన్‌స్కీ మెడలు వంచేందుకు ట్రంప్ శతథాప్రయత్నిస్తున్నారు. టైమ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన మనసులో ఉన్నదంతా చెప్పేశారు. ఉక్రెయిన్ నాటోలో చేరదనీ, యూరోపియన్ యూనియన్ సభ్యత్వంతో సరిపెట్టుకుంటుందని తేల్చేశారు. అంతేకాదు, ఈ మూడేళ్ళయుద్ధకాలంలో ఉక్రెయిన్ కోల్పోయిన భూభాగాలమీద రష్యా ఆధిపత్యాన్ని గుర్తించేందుకు కూడా ట్రంప్ సిద్ధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. క్రిమియా యుద్ధంతో ముడిపడిన ఆంక్షలను రష్యామీద ఎత్తివేయడం, ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి అన్ని విధాల సాయపడడం ఇత్యాదివి ఉన్నాయి. ట్రంప్ ప్రతిపాదిత ఒప్పందం తనకు అనుకూలంగా ఉంటున్నందున రష్యా ఇప్పటికే జైకొట్టింది. జెలెన్‌స్కీని కూడా దారికి తేగలిగితే యుద్ధం ఆగడంతోపాటు, రెండుదేశాల్లోనూ కీలకవనరులు అమెరికా దక్కించుకోవచ్చు.

తెలుగు చరిత్రకారుడు ఫ్రికెన్‌బర్గ్ కన్నుమూత

తెలుగువారి చరిత్ర–సంస్కృతులను, ఆధునిక యుగానికి సంబంధించి, తన పరిశోధనల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిపిన ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ ఫ్రికెన్‌బర్గ్ కన్నుమూశారు. 1930లో జన్మించిన ఈయన, తమిళనాడులో విద్యాభ్యాసం మొదలుపెట్టి, ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (బర్కిలీ)లో రాజకీయ శాస్త్రం చదివి, 1961లో లండన్‌లో స్కూల్ ఆఫ్ ఒరియంటల్ స్టడీస్‌లో డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. విస్కాన్సిన్–మేడిసన్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో (1962–1997) బోధనావృత్తి చేపట్టారు. అక్కడు న్నప్పుడు, భారతదేశ చరిత్రకు సంబంధించి భూసమస్యలు, మత మార్పిడులు, హిందూ జాతీయవాదం, భారతదేశంలో క్రైస్తవమత పుట్టుక, ఎదుగుదల గురించి గణనీయమైన కృషి సలిపి, రచనలు చేశారు.



రాబర్ట్ ఎరిక్ ఫ్రికెన్‌బర్గ్
(జూన్ 8, 1930–ఏప్రిల్ 15, 2025)

ఫ్రికెన్‌బర్గ్ పరిశోధించి, వెలువరించిన 'గుంటూర్ డిస్ట్రిక్ట్' గ్రంథం ఆయనకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చింది. ప్రభుత్వ పరిపాలనను, వలస పాలనాధికారుల కంటే భారతీయులే అమితంగా ప్రభావితం చేశారన్న అంశాన్ని విపులంగా చర్చించారు. బ్రాహ్మణులు– నియోగులు, దేశస్థ బ్రాహ్మణులు, గ్రామకరణాలుగా, అనువాదకులుగా (దుబాషీలు), కచేరీ ఉద్యోగులుగా పనిచేస్తూ, వారి స్వప్రయోజనాలను పొందిన తీరు వివరిస్తూ, గ్రామకరణాలు లబ్ధిపొందిన తీరు, అవసరమైన రికార్డులను తొలగించి, వాటి స్థానంలో 'తప్పుడు' లెక్కలను చూపించిన పద్ధతులను వెలికి తీశారు. ఫ్రికెన్‌బర్గ్ అనుసరించిన భారతీయ చరిత్ర అధ్యయన విధానాన్నే ఆ తర్వాత ప్రాచుర్యాని కొచ్చిన కేంబ్రిడ్జి స్కూల్ చరిత్రకారులు అనిల్ సీల్, డేవిడ్ వాష్‌బ్రూక్, క్రిస్ బేకర్, సి.ఎ. బెయిలీ తదితరులు అవలంబించారు.

ఫ్రికెన్‌బర్గ్, ఆ తర్వాతి కాలంలో తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో క్రైస్తవ మతవ్యాప్తి గురించి అధ్యయనం చేశారు. ఈ ప్రక్రియలో తనకు తోడ్పడిన భారతీయ మద్దతుదార్లను గూర్చి రాశారు. 'క్రిస్టియానిటీ ఇన్ ఇండియా: ఫ్రం బిగినింగ్స్ టు ద ప్రెజెంట్' ప్రచురించారు. భారతదేశ గతాన్ని గూర్చి ఆయన రచించిన, 'ఇండియాస్ రాజ్: ఎస్సేస్ ఇన్ హిస్టారికల్ అండర్‌స్టాండింగ్స్' గ్రంథం, ఫ్రికెన్‌బర్గ్ ప్రశంసాపూర్వక విద్వత్తుకూ, భారతదేశ చరిత్ర గతానికీ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

– వకుళాభరణం రామకృష్ణ

అమెరికా–చైనా.. అడకత్తెరలో భారత్

ఈ నెల 2న ప్రారంభమైన సుంకాల యుద్ధంలో భారత్ రెండు దేశాల నుంచి సవాళ్ల నెదుర్కొంటున్నది. అవి అమెరికా, చైనా అని మరి చెప్పనవసరం లేదు. స్కిల్లా, చారిబ్డిస్ మధ్య (బిట్వీన్ స్కిల్లా అండ్ చారిబ్డిస్) భారత్ చిక్కుకున్నది. (గ్రీక్ పురాణ వీరుడు ఒడిస్సియస్ తన నౌకతో ఒక జలసంధి గుండా ప్రయాణించవలసి వచ్చినపుడు రెండు ప్రమాదాల నెదుర్కోవలసివచ్చింది. ఒకటి స్కిల్లా అనే ఆరు తలల రాక్షసి, మరొకటి చారిబ్డిస్ అనే సుడిగుండం. రెండు అవాంఛనీయమైన ఎంపికల మధ్య ఒకదాన్ని ఎంచుకోవడంలో ఉన్న కష్టనష్టాలను ఈ జాతీయం సూచిస్తుంది). మరో ఆంగ్ల జాతీయం కూడా భారత్ క్లిష్ట పరిస్థితికి అద్దం పడుతున్నది. అది 'బిట్వీన్ ది డెవిల్ అండ్ డీప్ సీ'. అయితే ఏది దెయ్యం? ఏది లోతైన సముద్రం? ఇది సందిగ్ధతను సూచిస్తుంది. ఏ దేశాన్ని ఏ విధంగా భావించినా ప్రతికూల పరిస్థితుల నెదుర్కోవలసిరావడం అనివార్యం. రెండూ సంతోషదాయకం కాని ప్రత్యామ్నాయాలే మరి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

సమస్యను మరింత వివరంగా చూద్దాం. 2024–25లో అమెరికా, చైనాలతో మన ఎగుమతులు, దిగుమతులు ఇలా ఉన్నాయి. తొలుత ఎగుమతులు : (అంకెలు అన్నీ డాలర్లలో) అమెరికాకు–88.51 బిలియన్; చైనాకు–14.25 బిలియన్, ప్రపంచ దేశాలకు–437.42 బిలియన్. దిగుమతులు: అమెరికా నుంచి–45.3 బిలియన్; చైనా నుంచి–113.45 బిలియన్; ప్రపంచ దేశాల నుంచి–720.24 బిలియన్. ఈ ప్రకారం ఆయా దేశాలతో మన వాణిజ్య మిగులు లేదా లోటు ఇలా ఉన్నది: అమెరికాతో మన వాణిజ్యం మిగులుతో జరుగుతుంది. అది +41.21 బిలియన్. చైనాతో మన వాణిజ్య లోటు ఇలా ఉన్నది: –99.20 బిలియన్. ప్రపంచ దేశాలతో మన వాణిజ్య లోటు: –282.82 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ గణాంకాలు చెబుతున్నదేమిటి? ప్రపంచ రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు భారత్ పూర్తిగా రెండు పరస్పర విరుద్ధ సవాళ్ల నెదుర్కొంటున్నది!

అమెరికాతో మన వాణిజ్య ఖాతా మిగులుతో ఉన్నది. అమెరికాకు మన ప్రధాన ఎగుమతులు రత్నాలు, బంగారు ఆభరణాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కొన్ని వ్యవసాయక ఉత్పత్తులు. ఔషధాలు మినహా మిగతా సరుకులు, వస్తువులను మన దేశం నుంచి దిగుమతి చేసుకోవలసిన అవసరం అమెరికాకు లేదు. ఇతర దేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవడం ద్వారా తన అవసరాలను తీర్చుకోగలుగుతుంది. అయితే మనం ఎగుమతి చేస్తున్న ప్రతి సరుకు, ఉత్పత్తి వేలాది స్త్రీ పురుషుల జీవనోపాధికి ఆధారంగా ఉన్నాయి. ఇప్పుడు భారీ సుంకాలు విధించేందుకు ట్రంప్ మహాశయుడు సిద్ధమవడంతో అమెరికాతో మన వాణిజ్య ఖాతాలోని మిగులు హరించుకుపోయే ప్రమాదమున్నది. సరే, ప్రతిపాదిత సుంకాల అమలును ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులకు అధిక సుంకాల నుంచి మినహాయింపునిచ్చారు. అయినప్పటికీ భారత్ శిరస్సుపై ట్రంప్ సుంకాల ఖడ్గం వేలాడుతూనే ఉన్నది. అమెరికా అధ్యక్షుడు సంకల్పించిన భారీ సుంకాలు అంతిమంగా అమలులోకి వచ్చినప్పుడు మన ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. లక్షలాది ఉద్యోగాలు మాయమవుతాయి. మన విదేశీమారకద్రవ్య నిల్వలు తగ్గిపోతాయి. కరెంట్ ఖాతా సమతౌల్యం గతించిన విషయమైపోతుంది. ఈ కష్ట నష్టాలను దృష్టిలో ఉంచుకుని అమెరికాతో సంప్రతింపుల ద్వారా సుంకాల భారాన్ని సాధ్యమైనంతగా తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

భారీ సుంకాల విధింపుతో భారతీయ సరుకుల దిగుమతులను నిరోధించడం వల్ల అమెరికాకు లబ్ధి సమకూరదు. ఈ వాస్తవం ట్రంప్‌కు బాగా తెలుసు. భారతీయ దిగుమతులను అనుమతించేందుకు ఒక మార్గాన్ని ఆయన కనుగొంటారు. అయితే అందుకు భారత్ నుంచి పెద్ద ప్రయోజనాన్ని దక్కించుకోవడానికి ఆయన తప్పక ప్రయత్నిస్తారు. ద్వైపాక్షిక వాణిజ్యం సమతౌల్యపరిచేందుకు అమెరికా నుంచి భారత్ మరిన్ని ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఆయన పట్టుబడతారు. నా ఊహ ఏమిటంటే సైనిక సామగ్రి, యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని భారత్‌ను ఆయన ఒత్తిడి చేయవచ్చు. ఆ రెండూ చాలా చాలా ఖరీదైన ఉత్పత్తులని మరి చెప్పనవసరం లేదు. భారత్ తనకు అవసరమైన ఉక్కు ఉత్పత్తులు, ఇనుప పరికరాలు, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్స్, ఖనిజాలు, లోహాలు, పెట్రోలియం ఉత్పత్తులు అమెరికాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవచ్చు. అయితే ఈ అవసరాలను సైతం అమెరికా ఉత్పత్తులతో తీర్చుకోవడం వివేకవంతమైన, ప్రయోజనకరమైన చర్య అవుతుంది. ఇంతకూ అమెరికా నుంచి సైనిక సామగ్రి, యుద్ధ విమానాలు, ఇంకా అణు రియాక్టర్లను దిగుమతి చేసుకునేందుకు అయ్యే భారీ వ్యయాలను భారత్ ఏ మేరకు భరించగలదు? ఇదొక పెద్ద ప్రశ్న. సమాధానం అంత సులువైనది కాదు.

ఇక చైనాతో వ్యవహారం పూర్తిగా భిన్నమైనది. ఈ దేశంతో భారత్ వాణిజ్య ఖాతా లోటు భారీ పరిమాణంలో ఉన్నది. అది ఇంచుమించు 100 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది! విద్యుత్ సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, మెషినరీ, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్‌లు, ఉక్కు ఉత్పత్తులు మొదలైన వాటికి భారత పారిశ్రామిక రంగం చైనాపైనే ఆధారపడి ఉన్నది. చైనా ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉండడమే అందుకు కారణం కొన్ని సందర్భాలలో ఈ దిగుమతులు 'డంపింగ్' (ఎగుమతిదారుడి దేశీయ మార్కెట్‌లో అమ్మే ధర కంటే తక్కువ ధరకు విదేశీ మార్కెట్‌లో వస్తువులను విక్రయించే పద్ధతి) కిందకే వస్తాయి. తక్కువ ధరకు, అవసరమైన సమయానికి సరుకులు పొందేందుకు భారత్‌కు చైనా ఉత్పత్తుల కంటే ప్రత్యామ్నాయాలు లేవు దేశీయ వస్తూత్పత్తి రంగం (మన స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా కేవలం 13 లేదా 14 శాతంగా మాత్రమే ఉన్నది!)



ట్రంప్ సుంకాలకారణంగా అమెరికాతో వాణిజ్య మిగులు హరించుకుపోయి, చైనాతో వాణిజ్యలోటు పెరిగిపోతే భారత్ ఆర్థిక రంగ పరిస్థితి దిగజారిపోతుంది. సుంకాల సమరం నేపథ్యంలో అమెరికా, చైనాలతో తన సంబంధాలు సమతౌల్యంగా ఉండేలా భారత్ జాగ్రత్తపడాలి.

స్థితిగతులను మెరుగుపరచుకుని విస్తరించనంతవరకు చైనాపై ఆధారపడడం భారత్‌కు తప్పనిసరి అవుతుంది.

చైనాకు భారత్ ప్రధానంగా వినియోగ వస్తువులు, ఖనిజ ఉత్పత్తులు, పెట్రోలియం ఆధారిత ఇంధనాలు, సముద్ర ఆహారోత్పత్తులు, పత్తి, మరికొన్ని వ్యావసాయక ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నది. చైనా దేశీయంగా ఉత్పత్తి చేసుకోలేక పోతున్న, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోలేక పోతున్న విలువ ఆధారిత వస్తువులను భారత్ ఆ దేశానికి ఎగుమతి చేయగలదు. అయినా చేయలేకపోతుంది. ఎందుకని? వస్తూత్పత్తి రంగాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే భారత్‌కు ఈ దురవస్థ ప్రాప్తించింది. భారత్ నుంచి మరిన్ని వస్తువులు దిగుమతి చేసుకునేందుకు చైనా సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే భారత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలదా అన్న విషయం చర్చనీయాంశమే. చైనాతో వాణిజ్యలోటు భారత్ కరెంట్ ఖాతా లోటును ప్రకోపించుతోంది. ఇది ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అమెరికాతో వాణిజ్య మిగులు, కొంతమేరకు చైనాతో వాణిజ్య లోటును భర్తీ చేస్తుంది. ట్రంప్ సుంకాలతో అమెరికాతో వాణిజ్య మిగులు హరించుకుపోయి, చైనాతో వాణిజ్యలోటు పెరిగిపోతే భారత్ ఆర్థిక రంగ పరిస్థితి దిగజారిపోతుంది.

భారత్ క్వాడ్ కూటమిలో భాగస్వామిగా ఉన్నది. అయితే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వ్యూహాత్మక ప్రాథమ్యాలు భారత్ వ్యూహాత్మక ప్రాథమ్యాలకు పూర్తిగా భిన్నమైనవి. చైనా విస్తరణవాదాన్ని అడ్డుకునే రక్షణ కుడ్యంగా క్వాడ్ పరిణమించాలని అమెరికా ఆశిస్తోంది. అయితే భారత్ వైఖరి భిన్నంగా ఉన్నది. నౌకా వాణిజ్య భద్రత, డిజిటల్ కనెక్టివిటీ, ప్రభవిస్తున్న నూతన సాంకేతికతల విషయంలో సహకారానికి క్వాడ్ పరిమితం కావాలని భారత్ భావిస్తోంది. ఈ కూటమిని చైనా వ్యతిరేక బృందంగా మార్చివేసే సంకల్పాలు, ప్రయత్నాలకు భారత్ సుముఖంగా లేదు. చైనా ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ఒప్పందాలు కుదుర్చుకునే ఏ దేశమైనా భారీ మూల్యం చెల్లించవలసివస్తుందని చైనా ఇప్పటికే ప్రపంచ దేశాలను హెచ్చరించింది. ఈ వాస్తవాల దృష్ట్యా పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలు సమకూర్చే అమెరికా, మధ్యస్థ వస్తువులు (వివిధ సరుకుల తయారీ ప్రక్రియలో వాడబడే వస్తువులు), ఉత్పాదక వస్తువులను సరఫరా చేసే చైనా మధ్య ఒక సమతుల్యతను భారత్ విధిగా పాటించాలి. భారత భూభాగాలను ఆక్రమించుకున్న శత్రుపూరిత పొరుగు దేశం చైనా అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. క్వాడ్‌లో భారత్ భాగస్వామ్యం ఇంతవరకు వాస్తవికంగా ఉన్నది అటు అమెరికాలోని, ఇటు భారత్‌లోని మితవాద వర్గాలు చైనాతో ఘర్షణపడేలా న్యూ ఢిల్లీని ప్రోద్బలించే అవకాశమున్నది. మరో ఆసక్తికరమైన విషయాన్నీ ప్రపస్తావించాలి: అధ్యక్షుడు ట్రంప్ జనవరి 20, 2029 దాకా మాత్రమే అధికారంలో ఉంటారు. అధ్యక్షుడు క్సీ జిన్ పింగ్ తాను కోరుకున్నంతకాలం అధికారంలో ఉంటారు. చైనా పాలన ఆయన నియంత్రణలో ఉంటుంది. ట్రంప్ దుడుకుగా, మొరటుగా వ్యవహరించే వ్యక్తి. జిన్ పింగ్ జిత్తులమారి, వంచనాశీలి. దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానాలను మోదీ అనుసరిస్తున్నారు. సుంకాల విషయంలో ట్రంప్ దుస్సాహసంతో ఆ విధానాలను మార్చివేయవలసిన అగత్యమేర్పడింది. మోదీ ఆ సంరక్షణ విధానాలను ఉపసంహరించుకోవాలి. ఆర్థిక నిపుణులను విస్తృతంగా సంప్రతించి విధాన నిర్ణయాలు తీసుకోవడాన్ని మోదీ అలవరచుకోవాలి. మరీ ముఖ్యంగా ప్రతిపక్షాలను శత్రువులుగా పరిగణించే వైఖరికి ఆయన స్వస్తి చెప్పాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మీ ఇల్లు సర్దుకోండి

మీరెప్పుడైనా చూశారా సింధూ నది జలాల్లో
పర్యాటకుల రక్తం ప్రవహించడాన్ని..!
ఎవరైనా విన్నారా కాశ్మీరం ప్రశాంతంగా నిద్రపోతుందని
భూతల స్వర్గంలో అప్పుడప్పుడు దయ్యాలు
కూడా శాంతిని భగ్నం చేస్తాయి
ఎత్తైన కొండల చాటు నుండి ఎవడు మనవాడో
ఎవడు పరాయివాడో గుర్తించనట్లుగా
ఎప్పుడు ఎవరిపై విరుచుకుపడతాడో
కానీ వారికి తెలియదు మా సంకల్పం ముందు
వారి పిల్ల చేష్టలు నిలబడవని...
పొరుగు దేశాన్ని ప్రేమించలేని వారిని మేమెలా ప్రేమిస్తాం..?
ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును అని గురజాడ వారన్నట్లు
మీరు తుపాకీ తూటాల్ని నమ్ముకుంటే
మేం బుద్ధుడు, గాంధీజీ బోధించిన
సత్యం, అహింసలను నమ్ముతుంటాం
తేడా వస్తే– 1965, 1971, 1999లో
జరిగింది మర్చిపోయారా..?
ముందు మీ ఇల్లు సరిదిద్దుకోండి...
సరిహద్దులు దాటి వచ్చారో తస్మాత్ జాగ్రత్త
అబ్ కీ బార్ ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే...

– డా. మహమ్మద్ హసన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రజతోత్సవ వేళ రగిలే ప్రశ్నలు!

తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం, మనుగడ సమీక్షించుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. దాని ఉత్థాన పతనాల పయనం ఏ పార్టీకైనా గుణపాఠమే. ఒక నిర్దిష్టమైన లక్ష్యం కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీ అది. 1970లలో తెలంగాణ ప్రజాసమితి ఏర్పడి, తెలంగాణ డిమాండ్‌కు ఒక రాజకీయ ప్రతిపత్తి మొదటిసారి లభించిన తరుణమది. అనతికాలంలోనే అది కాంగ్రెస్‌లో విలీనమైంది. మళ్లీ తెలంగాణ ఆకాంక్ష సామూహికంగా విజృంభించడానికి రెండు దశాబ్దాల కాలం పట్టింది. ఆ తరువాత ప్రజాసంఘాలు, కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులే తొంభయవ దశకంలో మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారు.

తెలంగాణ జనసభ వంటి సంఘాలు, మారోజు వీరన్న, గాదె ఇన్నయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, కేశవరావు జాదవ్, పాశం యాదగిరి, కొల్లూరి చిరంజీవి, ప్రొ. జయశంకర్, ప్రొ. బియ్యాల జనార్ధన్, బెల్లి లలిత వంటి వ్యక్తులు తెలంగాణ ఆకాంక్షను కాపాడడానికి శక్తిమేరకు కృషి చేశారు. భువనగిరి కేంద్రంగా సమీకరించబడిన ప్రజా చైతన్యం మరోసారి పోరుశంఖం

అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఎందుకంత రాచరికపు పోకడలుపోయారో ఈ రజతోత్సవవేళ ఆలోచించుకోవాలి. తన నాయకత్వంలో అప్పుల తెలంగాణ, ఆత్మహత్యల తెలంగాణ, నిరుద్యోగ తెలంగాణ, బాధల తెలంగాణ, మద్యం తెలంగాణను ఎట్లా తయారు చేశారో ప్రజలకు వివరించాలి. అప్పుడే రజతోత్స సభకు అర్థం, పరమార్థం.

పూరించింది. ఆ తరువాత ఈ ఉద్యమానికి రాజకీయ ప్రతిపత్తి లభించడం అనేది రెండవసారి కేసీఆర్ రూపంలోనే లభించింది. ప్రజల్లో రగులుకుంటున్న ఉద్యమ వేడిని కేసీఆర్ సరిగానే అంచనా వేశారు. 2001లో జలవిహార్ వేదికగా స్వీయ రాజకీయ పార్టీకి అంకురార్పణ చేశారు. ఇది నిజానికి చారిత్రాత్మక నిర్ణయం. అది మొదలు మలిదశ ఉద్యమం ఊరూరికి విస్తరించి తెలంగాణ ఆకాంక్ష మరింత పదునెక్కింది. తెలంగాణ కావాలనుకునే ప్రతీ పౌరుడికి టీఆర్ఎస్ ఆశాదీపంగా కనిపించింది. తెలంగాణ కోసం గులాబీ జెండాను ప్రజలే నిలబెట్టారు. ఆ విధంగా నిలబెట్టడం వెనకాల రేపటి తెలంగాణ అభివృద్ధి ఆశ దాగి ఉంది. తెలంగాణ వస్తే తప్ప బాగుపడలేమనే అవగాహన ఉంది. అట్లా 2014లో సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రకటించే వరకు ప్రజలు కేసీఆర్‌కు అండగా నిలిచారు.

ప్రజలేమో ఇంతటి అంకితభావంతో ఉంటే, కేసీఆర్ మాత్రం పక్కా పొలిటీషియన్‌గా ప్రవర్తించారు. తెలంగాణకు ఒక స్వీయ రాజకీయ శక్తి అవసరం అన్న ఆలోచన నుండి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడం తెలంగాణ రాకముందే మొదలైంది. తెలంగాణ వస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని ప్రకటించారు, మాట మీద నిలబడలేదు. ఆ తరువాత దళితుణ్ణే ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చి తప్పాడు. ఈ మాట తప్పడం అనేది అధికారంలోకి వచ్చాక నిత్యకృత్యంగా మార్చుకున్నారు. ఏ తెలంగాణ నామ జపమైతే తనకు, తన పార్టీకి ఒక గుర్తింపును ఇచ్చిందో ఆ విషయాన్ని మరిచారు కేసీఆర్. పార్టీ పేరును 'భారత రాష్ట్ర సమితి'గా మార్చుకొని దేశ రాజకీయాలవైపు అర్రులు చాచి, దారుణంగా విఫలమయ్యారు. ఎందుకంత రాజకీయ దురాశో ప్రస్తుతం కేసీఆర్ అండ్ కంపెనీ ఆలోచించుకోవాలి. ఇది తెలంగాణ ప్రజలను దారుణంగా అవమానించడమే. తెలంగాణ పేరునే కాదనుకోవడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టడమే అని ప్రజలు గుర్తించారు.

ఇక అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఎందుకంత రాచరికపు పోకడలకు పోయారో ఈ రజతోత్సవవేళ ఆలోచించుకోవాలి. ఉద్యమం ద్వారా పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆ రకమైన పోకడ దేనికోసం? అన్నది ప్రజలకు చెప్పాలి. రాచరికవ్యవస్థలో రాజులకు అహంకారం ఉన్నట్టు కేసీఆర్ కూడా అదే రీతిగా వ్యవహరించి ఎవ్వరినీ లెక్కచేయలేదు. కనీసం తన క్యాబినెట్లోని మంత్రులకు కూడా అపాయింట్మెంట్ ఇవ్వకుండా కంచెలు కట్టుకోవడం దేని కన్నది రజతోత్స సభలో చెప్పాలి. ఇక అసెంబ్లీకి సైతం రాకుండా చట్టసభలను అవమానిస్తూ ఫాంహౌజుకే పరిమితం కావడం వెనకాల ఉన్న మతలబు ఏమిటో కూడా చెప్పాలి. అన్నింటికంటే ముఖ్యంగా తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం ఎట్లా అప్పుల పాలైందో కూడా తెలియజేయాలి. కనీసం ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలోకి ఎట్లా తన నాయకత్వంలో తీసుకెళ్లారో వివరించాలి. అంతేకాదు తెలంగాణ కోసం తమ విలువైన ప్రాణాలను బలిదానమిచ్చిన 1300 మంది అమర వీరుల కుటుంబాలకు ఏం చేశారో చెప్పాలి.



తెలంగాణ రాష్ట్ర సాధనలోని ముఖ్యమైన లక్ష్యాల్లో ఒకటి ఉద్యోగాల భర్తీ. తెలంగాణలో ఉన్న 12 యూనివర్సిటీల్లో కనీసం ఒక్క కొలువునైనా ఎందుకు భర్తీ చేయలేకపోయారో చెప్పాలి. తమ జేబులు నింపడానికి, తమ కుటుంబ నేతల బొజ్జలు నింపడానికి జరిగిన ప్రాజెక్టుల అవినీతి మీద వివరణ ఇవ్వాలి. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందడానికి విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి జరగాలి. మరెందుకు ముఖ్యమైన ఈ రంగాలకు బడ్జెట్‌ను తగ్గించి విద్యా, వైద్య రంగాలను దశాబ్దకాలం పాటు నిర్వీర్యం చేశారో ప్రజలకు కేసీఆర్ వివరించాలి. పైగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారేలా అమలు చేసిన కేసీఆర్ మద్యం పాలసీ' తెలంగాణను ఏ విధంగా అభివృద్ధి చేసి, ఎన్ని కుటుంబాలను కుప్పకూల్చిందో ఈ గులాబీ పండుగ వేళ సమాధానం చెప్పాలి. తనకు అధికారం మూడోసారి ఎందుకు ప్రజలు కట్టబెట్టలేదో విడమరిచి చెప్పాలి. తన నాయకత్వంలో అప్పుల తెలంగాణ, ఆత్మహత్యల తెలంగాణ, నిరుద్యోగ తెలంగాణ, బాధల తెలంగాణ, మద్యం తెలంగాణను ఎట్లా తయారు చేశారో ప్రజలకు వివరించాలి. అప్పుడే ఈ రజతోత్స సభకు అర్థం, పరమార్థం. లేకుంటే తెలంగాణ ప్రజల విశ్వసనీయతను కూడగట్టుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు.

● పసునూరి రవీందర్

తెలంగాణ అస్తిత్వానికి కాపలాదారు!

భారత స్వాతంత్ర్య చరిత్రలో 1885 డిసెంబర్ 27కు ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో, తెలంగాణ చరిత్రలో 2001 ఏప్రిల్ 27కు అంతే ప్రాధాన్యత ఉన్నది. రెండింటి లక్ష్యం దాదాపు ఒక్కటే. పరాయి పాలన, దోపిడీ, పీడనలకు వ్యతిరేక పోరాటమే. తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తెలంగాణ సాధనే ఏకైక లక్ష్యంగా కేసీఆర్ ముందుకు వచ్చారు. సగటు తెలంగాణ పౌరుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై నమ్మకం పెంచుకునేందుకు కారకుడయ్యారు.

ప్రజల భావోద్వేగాన్ని, అంతఃసంఘర్షణను తెలంగాణ అస్తిత్వ ఉద్యమంగా మలిచి, టీఆర్ఎస్ ఉద్యమ పార్టీని నిర్మించి, రాజకీయ ప్రక్రియ ద్వారా స్వరాష్ట్ర ఉద్యమాన్ని దేశచిత్రపటం పైకి తీసుకురావటంలో కేసీఆర్ చేసిన పద్నాలుగేళ్ళ ఉద్యమం అసామాన్యం. ఎన్నెన్నో దారుల్లో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, తెలంగాణ విద్యావంతులు, కవులు, కళాకారుల గళాలు, ప్రతి ఊరు ఒక జేఏసీగా మారాయి. వీటన్నింటిని ఒక జేఏసీగా ఏర్పరచటంలోను, రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టటంలోను కేసీఆర్ అలుపెరగని కృషితో, వ్యూహాలు ఎత్తుగడలతో, ఎన్నికలు ఉపఎన్నికల గూండా పద్నాలుగేళ్ళ నిర్విరామ ఉద్యమాన్ని వెన్ను చూపకుండా నడిపారు. రాజకీయ పార్టీల ఆధిపత్య సంస్కృతి, అధికార పీఠాలపై కూర్చున్న కుట్రపూరిత చర్యలు, అడుగడుగునా ఆటంకాలు, అవమానాలు, విద్యార్థి యువకుల ఆత్మబలిదానాలు... వీటన్నిటి మధ్యా గుండెమండిన తెలంగాణను ఒక్క వేదిక మీదకు తెచ్చి ఒక్క తాటిపైన నడపటం, ధిక్కార స్వరాల్ని ఏకం చేసి రాజకీయ ఉద్యమ ప్రక్రియతో పద్నాలుగేళ్ళ సుదీర్ఘ పోరాటం చేయటం ఒక అసాధారణ చరిత్ర. ఆ చరిత్రకు రాజకీయ ప్రక్రియ ద్వారా నేతృత్వం వహించింది టీఆర్ఎస్ అని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. కొత్తపల్లి జయశంకరే చెప్పారు.

నీళ్ళు, నిధులు, నియామకాల నినాదాన్ని దిక్కులు పిక్కటిల్లేలా అరిచి తెలంగాణ గొంతుకను విశ్వవ్యాప్తంగా వినిపించి 'స్వరాష్ట్ర సాధనే నా స్వప్నం' అన్న ఏకవాక్య నినాదంతో కేసీఆర్ టీఆర్ఎస్‌ను ఉద్యమ పథాన నడిపించారు. పెద్దమనుషుల ఒప్పందాల్ని, ఇచ్చిన మాటల్ని తుంగలో తొక్కి తెలంగాణను నిర్దాక్షిణ్యంగా అణగదొక్కిన ఆధిపత్యాన్ని ధిక్కరించటం ఆ బక్కమనిషి కేసీఆర్‌కే దక్కింది. తెలంగాణ భూములు ఎండిపోయి; రైతులు, చేనేతలు, విశ్వకర్మల ఆత్మహత్యలు, వలసలు, ప్రపంచీకరణతో చెల్లాచెదురైన పల్లెలు, నీళ్ళ గోసలు... వీటన్నిటితో తెలంగాణ గుండెమండి తల్లడిల్లుతున్న ఉద్యమ సందర్భంలోనే దొంగాటలాడే నాయకుల్ని (బైటోడ్ని, ఇంటోడ్ని) దద్దమ్మలని, సన్నాసులని తిట్టింది నిజం. అది ఉద్యమభాష.

జయశంకర్ నుంచి తొలిదశ ఉద్యమకారుడు ఆదిరాజు వెంకటేశ్వరరావు, జనసంఘాల నేతలవరకు అందరితోనూ కేసీఆర్ కొన్ని వేలగంటలు నిరంతరంగా చర్చలు, మేధోమథనం చేశారు. టీఆర్ఎస్ చారిత్రక సందర్భంలో అవతరించిన పార్టీ. ఎన్టీఆర్ నేతృత్వంలో తెలుగుజాతి అస్తిత్వంతో టీడీపీ ఏర్పడినట్లుగా తెలంగాణ అస్తిత్వంతో పురుడు పోసుకుని పుట్టిన పార్టీ ఆనాటి టీఆర్ఎస్, ఇప్పటి బీఆర్ఎస్.

పద్నాలుగేళ్ళ ఉద్యమ ప్రస్థానంలో తెలంగాణ గోసల్ని, జరిగిన మోసాల్ని, తీవ్ర దుర్భిక్ష స్థితిగతుల్ని, దక్కకుండా పోతున్న కొలువుల్ని, నీటి దగాల్ని, నిధుల స్వాహాను పూసగుచ్చినట్లు చెప్పి తెలంగాణను జాగృతం చేస్తూ ఉద్యమ పథాన బీఆర్ఎస్ నడిచింది. తెలంగాణ ఉద్యమంలో ఎన్నెన్నో మలుపులు, ఎన్నెన్నో ద్రోహాలు, ఎన్నెన్నో అవమానాలు, ఎన్నెన్నో పరాభవాలు, అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొంటూ పోరాడి గెలిచింది. తెలంగాణను తెచ్చింది. తెలంగాణ వచ్చాక పదేళ్ళ పాలనాపగ్గాలను చేపట్టి రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలకపాత్రను పోషించింది. దేశానికే తెలంగాణను మోడల్‌గా నిలిపింది. ఇపుడు బీఆర్ఎస్ 2025 ఏప్రిల్ 27 నాటికి 25వ వసంతంలోకి అడుగుపెడుతుంది. ఉద్యమ సమయంలో జాతిని సన్నద్ధం చేసిన పార్టీనే పునర్నిర్మాణాన్ని చేపట్టిన ఉజ్వల చరిత్ర బీఆర్ఎస్‌ది. జలసాధన ఉద్యమాలు జరిగిన నేలలో ఎండాకాలంలో కూడా చెరువులు మత్తళ్ళు దూకే స్థితిని తెచ్చిన

పద్నాలుగేళ్ళ ఉద్యమ ప్రస్థానంలో తెలంగాణ గోసల్ని, జరిగిన మోసాల్ని, తీవ్ర దుర్భిక్ష స్థితిగతుల్ని, దక్కకుండా పోతున్న కొలువుల్ని, నీటి దగాల్ని, నిధుల స్వాహాను పూసగుచ్చినట్లు చెప్పి తెలంగాణను జాగృతం చేస్తూ ఉద్యమ పథాన బీఆర్ఎస్ నడిచింది. తెలంగాణ వచ్చాక పదేళ్ళ పాలనాపగ్గాలను చేపట్టి రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలకపాత్రను పోషించింది.

ఖ్యాతి బీఆర్ఎస్‌కే దక్కుతుంది. దశాబ్దకాలంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చరిత్రలోనే అత్యధిక కొలువుల నియామకాలు చేసింది. తెలంగాణను ధనిక రాష్ట్రంగా నిలుపుతూ, చీకట్లను తొలగిస్తూ నిరంతర విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసింది. వెయ్యికి పైగా గురుకులాలు, దళిత బంధు, రైతుబంధు పథకాలు విప్లవాత్మక చర్యలు. 33 జిల్లాలు ఏర్పాటు చేసి, ఆ జిల్లాలలో ప్రజల పక్షాన నిలిచి నిరంతరం ఉద్యమించేందుకు 30 బీఆర్ఎస్ కార్యాలయాలను నిర్మించుకుని తెలంగాణ సమాజానికి కాపలాదారుగా నిలిచింది. వానమ్మ వానమ్మ అని, పల్లె కన్నీరు పెడ్తుందని, చుక్కనీరు లేని తెలంగాణ అని పాటలు కట్టి పాడుకున్న తెలంగాణను దేశానికే ధాన్యాగారం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది.

తమిళుల అస్తిత్వం అంటే డీఎంకే పేరు చెబుతారు. అట్లనే తెలంగాణ అస్తిత్వమంటే బీఆర్ఎస్. తెలంగాణ స్వీయరాజకీయ అస్తిత్వంతో నిలిచి, తెలంగాణను గెలిపించిన బీఆర్ఎస్ రేపటి బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని నిలిపింది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని పరిపూర్ణం చేయవలసిన బాధ్యత బీఆర్ఎస్ భుజం మీద వేసుకుంది. పాలకులు ఎవరైనా తెలంగాణ సమాజంపై ఈగవాలకుండా చూసే బాధ్యత బీఆర్ఎస్‌దే.

■ జూలూరు గౌరీశంకర్

కరీంనగర్ మార్గంలో..
రేపు వాహనాల దారి మళ్లింపు
• బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు 6

'గులాబీ' ఆవిర్భావ సంరంభానికి సర్వం సన్నద్ధమైంది. రజతోత్సవ వేడుకలకు ఓరుగల్లు ముస్తాబవుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు టీఆర్ఎస్‌గా ఏర్పడి.. నేడు బీఆర్ఎస్‌గా రూపాంతరం చెంది. గులాబీ పార్టీ 25ఏళ్ల పండుగను ఘనంగా జరుపుకునేందుకు శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రతీ ఊరు, వాడ నుంచి జనాన్ని సమీకరించి, చరిత్రలో నిలిచేలా ఆవిర్భావ రజతోత్సవ సభను నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 50వేల మందికి తగ్గకుండా జనసమీకరణ చేసేలా కృషి చేయాలని అధిష్ఠానం ఆదేశాలిచ్చిన నేపథ్యంలో నెల రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గం, మండల కేంద్రాలతో పాటు పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో లక్షలాదిగా జనాన్ని తరలించి, రజతోత్సవ వేడుకలను అట్టహాసంగా విజయవంతంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక ఆదివారం ఎల్కతుర్తి వేదికగా జరగనున్న రజతోత్సవాల సభకు తరలేందుకు గులాబీ దళం వివిధ రూపాలను ఎంచుకున్నారు.

సంరంభానికి.. సన్నద్ధం



సిద్ధమైన సభ ప్రాంగణం

రజతోత్సవానికి సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులు

- రేపటి ఎల్కతుర్తి సభకు తరలేందుకు సన్నాహాలు
- పాటలు, ఎడ్లబండ్ల ర్యాలీలు, పాదయాత్రలతో మొదలైన సందడి
- సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఓరుగల్లు నేతలు
- ప్రతీ నియోజకవర్గం నుంచి 50వేలకు తగ్గకుండా జనసమీకరణకు కసరత్తు
- నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు



జెండాలు, ఫ్లెక్సీలతో ముస్తాబైన ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి



గీసుగొండ మండలం కొమ్మాల నుంచి సభకు తరలొస్తున్న ప్రభబండి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు అధిష్ఠానం ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి అండగా నిలుస్తున్న వరంగల్ నుంచి భారీగా జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టింది. మొత్తం 12నియోజకవర్గాల నుంచి 2.50లక్షల నుంచి 3లక్షల వరకు జనాన్ని తరలించాలని దిశానిర్దేశం చేసింది. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, వర్ధన్నపేట, భూపాలపల్లి, నర్సంపేట, స్టేషన్‌ఘనపూర్, జనగామ జిల్లాల నుంచి 50వేల నుంచి 75వేల వరకు, పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్, ములుగుతో పాటు వీలినియోజవర్గాల నుంచి 30వేల నుంచి 50 వేల వరకు జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. అయితే మొన్నటి వరకు విభేదాలతో అటుఇటుగా ఉన్న నేతల మధ్య ఇటీవల కేటీఆర్ పర్యటనతో సమన్వయం కుదిరిందని, దాంతో వారంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లుతున్నారనే చర్చ జరుగుతోంది. సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. సన్నాహక సమావేశాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్, శంకర్‌నాయక్, బడే నాగజ్యోతి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించిన

మిగతా 7వ పేజీలో..

లక్షలాదిగా జనసమీకరణ చేస్తున్నాం

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు లక్షలాదిగా జనం తరలి వస్తారు. బీఆర్ఎస్ 25ఏళ్ల ప్రస్థానంలో 14ఏళ్లు తెలంగాణ రాష్ట్రం కోసంఉద్యమించాం. 10ఏళ్లు అంబేద్కర్ ఆలోచన విధానంతో పరిపాలన చేశాం. 16 నెలలుగా ప్రజల ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నాం. బీఆర్ఎస్‌కు ప్రజలు ఏ బాధ్యతను ఇచ్చినా నిర్వహిస్తున్నాం. తెలంగాణ ప్రజల కోసం పుట్టిన ఇంటిపార్టీ బీఆర్ఎస్. ఈ గులాబీ పండుగకు ఎన్ని లక్షల మంది వచ్చినా సరిపడేలా ఏర్పాట్లు చేశాం.

- దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

పాటలు, ఎడ్ల బండ్ల ర్యాలీలతో గ్రామాల్లో జోష్

ప్రతీ ఊరు, వాడ నుంచి జనసమీకరణ చేయాలని నిర్ణయించుకున్న నేతలు.. నాటి తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను పాటలుగా చేసుకుని కవులు,కళాకారులు రూపొందించిన రజతోత్సవ వేడకల పాటల సీడీలను ఆవిష్కరిస్తూ జనాల్లోకి వెళుతున్నారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రూపొందించిన చలో ఓరుగల్లు పాటల సీడీని ఇటీవల ఎల్కతుర్తిలో కేటీఆర్ ఆవిష్కరించగా, ఎనుగుల రాకేష్‌రెడ్డి తయారు చేయించిన ఎగిసేర భలే ఎగిసేర.. సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచేరా.. అనే పాటల సీడీని ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. ఇలా ఓరుగల్లులో ప్రతి నియోజకవర్గంలో పాటలతో గులాబీ శ్రేణులు పల్లెలను హోరెత్తిస్తున్నాయి. వీటితో పాటు గులాబీ శ్రేణుల్లో జోష్ తీసుకొచ్చేలా ఎడ్లబండ్ల ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రజతోత్సవ వేడుకలకు జాతర తరహా లుక్ వచ్చేలా దృష్టి పెడుతున్నారు. సూర్యాపేట నుంచి వరంగల్ వరకు ఎడ్లబండ్లపై ర్యాలీగా గులాబీ కార్యకర్తలు తరలి రాగా, వర్ధన్నపేట నుంచి 500 ఎడ్లబండ్లతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం భారీ ర్యాలీ చేపడుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి బీఆర్ఎస్ నేతలు పాదయాత్రగా వస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాల్లో పలు గ్రామాల్లో మహిళ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గులాబీ పండుగకు రావాలని మహిళలకు బొట్టు పెడుతూ.. కరపత్రాలను ఇంటింటికి పంచుతూ.. రజతోత్సవ సభకు ఆహ్వానిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రధాన రహదారుల వెంట ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లతో గులాబీమయం చేస్తున్నారు.

ప్రతీ పల్లె నుంచి జనం తరలొస్తున్నరు

గులాబీ పండుగకు ప్రతీ పల్లె నుంచి జనసమీకరణ చేస్తున్నాం. రాష్ట్రంలోని 12,750 గ్రామాల నుంచి ప్రజలు సభకు వస్తారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ చేపట్టాం. 1,250 ఎకరాల్లో సభ ఏర్పాట్లు చేశాం. కేసీఆర్‌ను చూసేందుకు.. ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉండేది గులాబీ జెండా.. కేసీఆర్‌నే. బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా లక్షలాదిగా ప్రజలను తరలిస్తున్నాం.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే జనగామ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

భూ బాధితులు ఆందోళన చెందొద్దు

రైతులకు కలెక్టర్ భరోసా

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే 163జీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సత్య శారద భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆమె గీసుగొండ మండలం బొడ్డు చింతలపల్లి గ్రామ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణకు చర్యలు

అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మదన్‌మోహన్‌రావు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న జరుపుకుంటారని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వడ్డేపల్లి పట్టణ ప్రాంథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పక్షాన నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మలేరియాను నియంత్రించడానికి అవగాహన కోసం 2008 నుంచి ప్రతీ సంవత్సరం మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. 2030 నాటికి భారతదేశంలో మలేరియ నిర్మూలనకు నిబద్ధతతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియాసిస్, డెంగీ, మెదడువాపు, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని, మన ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో, ఏఎన్ఎం, ఆశ, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో మలేరియా నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, వి.అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, రమేశ్, జ్యోతి, శిరీష్, సుమన్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పదేళ్లలో ఏం ఒరగబెట్టారో ప్రజలకు చెప్పండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పక్కన ఎర్రబెల్లి స్వర్ణ, గుండు సుధారాణి, వెంకట్రాంరెడ్డి

- వారిని మెప్పించి ఆపై సభ జరుపుకోండి
- అంతేకానీ మాపై బురదు వేయడం సరికాదు
- అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారు
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ముఖ్య నేతల ఫైర్
- రజతోత్సవ సభను బహిష్కరించాలంటూ పిలుపు

6

సర్జరీలు నిలిచిపోయాయ్!



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేయని ఐసీయూ సర్జికల్ విభాగం

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సేవలు దారుణం
- నెల రోజులుగా ఇదే తీరు
- రోగులు హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్న వైనం
- పనిచేయని సెంట్రలైజ్డ్ ఏసీ

- వివరాలు 7లో

'ఇందిరమ్మ' అర్హులను ఎంపిక చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా పరిధిలోని 34వ డివిజన్ శివనగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. అక్కడి అధికారులతో మాట్లాడి సర్వే పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రజలు స్పందించే విధానంపై క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అక్కడి అధికారులకు పసు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషన్ మాట్లాడుతూ.. గతంలో బేస్‌మెట్, పిల్లర్లు కట్టిన వారు ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని అన్నారు. 60 గజాలకు మించకుండా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రొసిడింగ్ కాపీలు అందిన తర్వాతనే ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. వరంగల్ తూర్పులో 24 డివిజన్‌కు 24 మంది అధికారులు సర్వే చేస్తున్నారని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. సర్వేలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాశి బుగ్గ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణితో పాటు రెవెన్యూ అధికారి షహజాది బేగం, ఆర్ఐ సోహెల్‌తో పాటు వార్డు అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

- రూ.1.32,900నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న,ఆడుతున్న వారిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.1,32,900 నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను కేయూ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వెల్లడించారు. వర్సిటీ పీఎస్ పరిధి పరిమళకాలనీ రోడ్ నెంబర్-5లో శుక్రవారం ఇదే కాలనీకి చెందిన గన్నెబోయిన సురేష్ ఇంట్లో వరంగల్ కరీమాబాద్‌కు చెందిన క్రీడాకారుడు కదిరి ఎల్లయ్యతో కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ఎస్సై భానుప్రకాష్ బృందం సభ్యులు దాడులు చేసి బెట్టింగ్ నిర్వాహకులు సురేష్, రాజులతో పాటుబెట్టింగ్‌లో పాల్గొన్న నర్సంపేటకు చెందిన కొలువుల రాజును అదుపులోకి తీసుకున్నారు. వారిని కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు అప్పగించినట్లు ఏసీపీ వెల్లడించారు.

ఇప్పపువ్వు సేకరణతో వేసవి ఉపాధి..



ఇప్పపువ్వు సేకరిస్తున్న గిరిజనులు

- ఏజెన్సీలో గిరిజనులు బిజీ బిజీ
- దక్కని గిట్టుబాటు ధర, తగ్గుతున్న ఆసక్తి
- ఐటీడీఏ ద్వారా పువ్వు కొనుగోలు చేయాలని డిమాండ్

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందం టే చాలు ఏజెన్సీ గిరిజనులు ఇప్పపువ్వు సేకరణలో బిజీగా ఉంటారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఈ ఇప్పపువ్వు సేకరణ జోరుగా జరురగుతోంది. వారికి ఈ వేసవి కాలంలో ఉపాధి వనరుగా నిలిచే ఇప్పపువ్వు కోసం ఉదయం నుంచే గిరిజనులు తమ పిల్లలతో కలిసి అడవుల్లోకి వెళ్తారు. పువ్వులను ఏరి, వాటిని బుట్టల్లో నింపుకుని మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుని.. వాటిని కొద్దిరోజుల పాటు ఎండబెట్టి విక్రయానికి సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో మహిళలు, పురుషులు, చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అయితే తాము సేకరిస్తున్న ఇప్పపువ్వుకు సరైన ధర లభించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని, ఈ నేపథ్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ద్వారా నేరుగా ఇప్పపువ్వును కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేస్తే దళారుల దోపిడీ ఉండదని, తమకు కొంతైనా ఆదాయం లభిస్తుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, ఏజెన్సీలో ఇప్పపువ్వు సేకరణతో కొంత ఉపాధి లభిస్తున్నప్పటికీ, సరైన ధర లేకపోవడం గిరిజనులను కలవరానికి గురిచేస్తోంది. అంతేకా కుండా వేసవిలో ఎలాం టి పనులు దొరకక పస్తులుంటున్న గిరిజనుల కు ఇప్పపువ్వు సేకరణ మంచి ఉపాధిని కల్పిస్తోంది. మండు తున్న ఎండలను సైతం లెక్కచేయ కుండా వారం రోజులుగా గిరిజనులు అడవుల బాట పట్టి.. ఇప్పపువ్వు సేకరిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రతి వేసవికాలం ఏప్రిల్, మే నెలల్లో ఇప్పపువ్వులను సేకరించి ఇళ్ల ఎదుట వాకిట్లో ఆరబోస్తారు. వారం రోజుల పాటు ఎండలో ఎండబెట్టిన తర్వాత గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి వాటిని విక్రయిస్తారు. అలా కిలోకు సుమారు రూ.20 నుంచి రూ.50వరకు ధర పలుకుతుంది. ఒక్కో కుటుంబం రోజుకు రూ.400 నుంచి రూ. 500 వరకు ఉపాధి పొందుతోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూ డెం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం

ఏజెన్సీ మండలాల్లో సుమారు 40 నుంచి 60 వరకు గొత్తికోయ గూడేలు ఉండగా సుమారు 4,500 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వారిలో సగానికి పైగా గిరిజనులు వేసవిలో ఇప్పపువ్వు సేకరణ, విక్రయంపై ఆధారపడుతున్నారు. ఇక ఇప్పపువ్వుతో తయారు చేసే సారాయికి కూడా మంచి గిరాకీ ఉంటుంది.





ఇప్పపువ్వు తెస్తున్న గిరిజనులు

దైవంగా భావిస్తారు..

గిరిజనులు ఇప్ప చెట్టును దేవతగా.. ఇప్పపువ్వును ప్రసా దంగా భావిస్తారు. అందుకే ఆ చెట్లకు నిత్యం పూజలు చేస్తుంటారు. గిరిజనులు ఎప్పటికీ ఇప్పపువ్వుల చెట్ల ను వారి ఇంటి చుట్టుపక్క ప్రాంతాల్లోనే ఉంచుకుంటారు. ఇప్ప చెట్లను ధ్వంసం చేయకుండా, చెట్లపైకి ఎవరినీ ఎక్కకుండా చూసుకుంటారు.

అనేక రకాలుగా వినియోగం

ఇప్పపువ్వులను చిక్కుడు గింజలు, అలసందలతో కలిపి ఉడికించి అంబలి కాసుకుంటారు. నీటిలో ఉడకబెట్టి ఆహారంగా తింటారు. ఈ పువ్వులను నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం తదితర వ్యాధులకు వాడతారు. ఇప్పపువ్వుల నుంచి నూనెను తయారు చేసి వారు తినే వంటలతో పాటు దీపాలకు వాడతారు.

దక్కని గిట్టుబాటు ధరలు...

ఇప్పపువ్వులకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో ప్రస్తుతం వీటి సేకరణపై గిరిజనుల ఆసక్తి ఏటా తగ్గుతూ వస్తోంది. ప్రస్తు తం ఇప్పపువ్వును జీసీసీకి కిలో రూ. 30 చొప్పున కొనుగోలు చేస్తుండగా.. బయట మార్కెట్‌లో కిలోకు రూ. 50 చెల్లిస్తున్నారని గిరిజనులు చెబుతున్నారు. కిలో ఇప్పపువ్వుకు జీసీసీ రూ. 50 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజను లు డిమాండ్ చేస్తూన్నారు. ఒక్క కుటుంబంలో ఇప్పపువ్వుల సీజన్‌లో సుమారు 10 క్వింటాల నుంచి 20 క్విం టాల వరకు ఇప్పపువ్వును సేకరిం చి ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికా రలు స్పందించి కిలో ఇప్పపువ్వుకు కనీసం రూ. 50ల చొప్పున మద్దతు ధర



సేకరించిన ఇప్పపువ్వును వాకిట్లో ఎండపోస్తున్న గొత్తికోయ మహిళ

కరీంనగర్ మార్గంలో ... రేపు వాహనాల దారి మళ్లింపు



ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్క తుర్తిలో బీఆర్ఎస్ రజతోత్స వ సభ ఉన్న నేపథ్యంలో ఆ దివారం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కరీంనగర్, సిద్ది పేట నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలను దారి మళ్లి స్తున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీ పీ సత్యనారాయణ తెలిపారు. వాహన దారులు పోలీసులు సూచించిన మార్గా ల్లోనే ప్రయాణించి ట్రాఫిక్ అంతరా యం కాకుండా సహకరించాలని వి జ్ఞప్తి చేశారు.

మళ్లించిన రూట్లు..

1. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు
హుజురాబాద్ నుంచి వచ్చే వాహనాలు పరకా ల క్రాస్ రోడ్డు, ఉప్పల్, కమలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్ రోడ్డు, ఓఆర్ఆర్ మీదుగా నగరంలోకి చేరుకోవాలి.

2. వరంగల్, హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు..
తిరుగు ప్రయాణంలో హనుమకొండ ముచ్చర్ల క్రాస్‌లోని నూతనంగా నిర్మించి న ఓఆర్ఆర్ రోడ్డు నుంచి అంబాల, కమ లాపూర్, ఉప్పల్, పరకాల క్రాస్ రోడ్డు, హుజురాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లాలి.

3. సిద్దిపేట నుంచి హనుమకొండ: సిద్దిపేట వయా జన గాం, హనుమకొండకు చేరుకోవ చ్చు. తిరుగు ప్రయాణంలో హనుమకొండ నుంచి సిద్దిపే టకు జనగాం టూ సిద్ది పేట, అదే విధంగా హుస్నాబాద్ నుంచి హనుమకొండకు వయా తరిగొప్పుల నుంచి హను మకొండకు ఒక రూట్ ఉండగా మరో రూట్ ముల్కనూర్, కొత్తకొండ, వేలేరు, మల్లికుదుర్ల, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, హనుమకొండకు ఇం కో రూట్‌లో సైతం వాహనదారులు వెళ్లొచ్చని తెలిపారు.

సందడిగా హ్యాండ్‌బాల్ పోటీలు



సెమీ ఫైనల్స్‌లో తలపడుతున్న టీడబ్ల్యూఎంఎస్ఎస్ అసిఫాబాద్ వర్సెస్ టీజీడబ్ల్యూఆర్ఎస్ బాలానగర్ జట్లు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : వరంగల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో నిర్వహిస్తున్న నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మధ్య హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శుక్రవారం లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. పూల్ ఏ బాలికల విభాగంలోని టీడబ్ల్యూఎంఎస్ఎస్ అసిఫాబాద్ వర్సెస్ టీజీడబ్ల్యూఆర్ఎస్ (బాలానగర్) మహబూబ్‌నగర్ జిల్లాల జట్ల మధ్య నిర్వహించిన సెమీ ఫైనల్ పోరులో 12-09 తేడాతో టీజీడబ్ల్యూఆర్ఎస్ (బాలానగర్) మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై టీడబ్ల్యూఎంఎస్ఎస్ అసిఫాబాద్ జట్టు విజయ దుందుభి మోగించి ఫైనల్‌కు అర్హత సాధించిది. అదే విధంగా పూల్ బీ లోని మరో బాలికల జట్లు టీడబ్ల్యూఎంఎస్ఎస్‌బీ అసిఫాబాద్ వర్సెస్ జీహెచ్ఎస్ కరీమాబాద్ వరంగల్ జిల్లాల మధ్య జరిగిన సెమీస్‌లో టీడబ్ల్యూఎంఎస్ఎస్‌బీ అసిఫాబాద్ జట్టుపై జీహెచ్ఎస్ కరీమాబాద్ వరంగల్ జిల్లా జట్టు 14-07 తేడాతో ఘన విజయాన్ని సాధించడంతో కరీమబాద్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. కాగా, శనివారం బాలికల విభాగంలో కరీమాబాద్ వర్సెస్ టీడబ్ల్యూఎంఎస్ఎస్ అసిఫాబాద్ జిల్లా జట్ల మధ్య ఫైనల్ పోరు జరుగనుంది. అదే విధంగా పూల్ ఏ లో బాలురు విభాగంలో టీడబ్ల్యూఎంఎస్ఎస్ కొత్తగూడ మహబూబబాద్ జిల్లా, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కల్వకూర్తి మహబూబ్‌నగర్ జిల్లాల సెమీ ఫైనల్స్ చేరుకున్నాయి. అదే విధంగా పూల్ బీ బాలరు విభాగంలో టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ కాటారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏకశిల ఇంటర్నేషనల్ స్కూల్ మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన జట్టు సెమీ ఫైనల్స్ చేరుకున్నాయి. కాగా క్రీడా పోటీల్లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను నిర్వహకులు నిరంతర పర్యావేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్, నల్గొండ, జిల్లాల కార్యదర్శులు బాసరవేణి లక్ష్మణ్, చింతకాయల పుల్లయ్య, పీడీలు జెట్టి రాజేశ్వర్, తాళ్ళ గ్రేసమ్మ, లక్ష్మీనారాయణ, రెఫరీలు శ్రీనివాస్, వెంకటేశ్, అరుణ్‌కుమార్, కోచ్ నిమ్మల సుధీర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో ఏం ఒరగబెట్టారో ప్రజలకు చెప్పండి

- వారిని మెప్పించి ఆపై సభ జరుపుకోండి
- అంతేకానీ మాపై చిందులు వేయడం సరికాదు
- అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారు
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ముఖ్య నేతల ఫైర్
- రజతోత్సవ సభను బహిష్కరించాలంటూ పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి స్వర్ణ, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, తదితరులు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పదే ళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేతలు ఏం ఒర గబెట్టారో ప్రజలకు చెప్పి.. వారిని మెప్పించి ఆపై సభ ను జరుపుకోవాలని, అంతేకానీ అకారణంగా తమపై చిందులు తొక్కడం సరికాదని కాంగ్రెస్ హనుమకొండ, వరంగల్ ముఖ్య నేతలు ఫైర్ అయ్యారు. శుక్రవారం సాయంత్రం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాల యంలో జరిగిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడారు. తొలుత నాయిని రాజేందర్‌రెడ్డి ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు బహిష్కరించాలని పిలుపు నిచ్చారు. సభను నిర్వహించుకోవడం వారి ఇష్టమని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, పదేళ్ల అధికారంలో ఉన్న ఆ పార్టీ రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు అభి వృద్ధి పరంగా ప్రజలకు ఏమి మేలు చేశారో వివరించా లనణి తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నేతలు అకారణంగా కాంగ్రెస్ నేతలపై చిందులు వేయ డం సరి కాదని, సభను అడ్డుకునే చర్యలకు తాము పాల్పడడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో తమను నిర్బంధించడం, పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడం లాంటి కుట్రలకు బీఆర్ఎస్ పాల్పడిందని తెలిపారు. కొన్ని సంఘటనలు, నిజాలను బయటపెడితే బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేరని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు భ్రమ పడుతున్నారని, ఉనికి కోసం సభను నిర్వహిస్తున్నార న్నారు. మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితర నేతలు మళ్లీ కేసీఆర్ అధి కారంలోకి వస్తారంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్ప దమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డంగా సంపా దించిన వేల కోట్లతో సభను నిర్వహిస్తూ.. ప్రజలను రప్పించే పాట్లు పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమ ని మీడియా ప్రశ్నలకు సమాధానంగా రాజేందర్‌రెడ్డి చెప్పారు. దీనిపై చర్చకు రమ్మంటే ముఖం దాటేస్తు న్నారని దుయ్యబట్టారు.

మభ్యపెట్టి అధికారంలోకి రాలేరు : స్వర్ణ

మళ్లీ అధికారంలోకి వస్తామంటున్న బీఆర్ఎస్ నేతల వి దింపుడు కల్లం ఆశలని, అక్రమంగా దోచుకున్న సం పదతో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రాలేర ని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. వరంగల్ నగరాన్ని డల్లాస్‌లా మారు స్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు బీఆర్ఎస్‌లో ఎందుకు ఓటమి చెందారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఓ సర్కస్ లాంటిదని చూసేందుకు ప్రజలకు వస్తారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఏనాడూ ప్రజల బాధలు పట్టించుకోలేదని, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్లు ఇవ్వలేదని మండిపడ్డారు. సభకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడకపోయినా..అక్రమంగా సంపాదించిన లక్షల కో ట్లతో జనాన్ని తరలించానలి ప్రణాకలు వేశారని, సభకో సం రెండువేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తు న్నారని, అభివృద్ధిపై మాటలు చెప్పి చేతులు దులుపే సుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల జరుగుతున్నాయన్నారు. కార్పొరేషన్ పరిపాలన భవనా నికి రూ.32 కోట్లు కేటాయించడం, నగరాభివృద్ధి కోసం అడిగిన వెంటనే రూ.323 కోట్లు అత్యవసరంగా విడుద ల చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, రింగ్ రోడ్డు భూసేకరణ తదితర అభివృద్ధి పనులు వేగవం తం చేస్తున్నట్లు వివరించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ వరంగల్‌లో టెక్స్‌టైల్ పా ర్క్ పేరిట రైతుల నుంచి బీఆర్ఎస్ నేతలు భూములు లాగేసుకొని అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. రైతులకు తక్కువ ధరల్లో డబ్బులు చెల్లించి కమీషన్ల పేరిట బీఆర్ఎస్ నేతలు రూ.కోట్లు మింగేశారన్నారు. మాస్టర్‌ప్లాన్-2024 కోరిన వారికి ఆ వివరాలను అంద చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టరేట్, కార్పొరేషన్, కుడా కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివా స్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, కార్పొరేటర్ విజయశ్రీ ర జాలీ, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ సభ్యులు మండల సమ్మయ్య తో పాటు రజాలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి.. మహాకవులు పుట్టిన పుణ్యభూమి

- సాహిత్య, సాంస్కృతిక పర్యాటకం మొదలైంది
- ప్రముఖ కవులు శంకరమంచి శ్యాంప్రసాద్, పల్లెర్ల రామ్మోహన్‌రావు



పాల్కూరికి స్మృతి వనం వద్ద కవులు

పాలకుర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఆదికవి పాల్కూరికి సోమనాథుడు, బమ్మెర పోతన వంటి మహాకవులు పుట్టిన పుణ్యభూమి పాలకుర్తి అని ప్రముఖ కవి శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో పాల్కూరికి సోమనాథుడు స్మృతి వనంతోపాటు శివైక్యం చెందిన స్థలాన్ని, పోతన స్మారక మందిరం, పోతన దున్నిన పొలాలు, మోట తోలిన బావి, లక్కసముద్రం చెరువు, గూడూరులో శాసనంను, వల్మిడీ రామాలయాన్ని ప్రముఖ కవి పల్లెర్ల రామ్మోహన్‌రావు నేతృత్వంలో 23మంది కవులు, సాహితీ వేత్తలు, తెలుగు పండితులతో సాహితీ యాత్రలో భాగంగా సందర్శించారు.

శ్యాంప్రసాద్, రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సోమ నాథుడు, పోతన, వానమామలై వరదాచారి, బిరుదురా జు రామరాజు, కాళోజీ నారాయణరావు, ధాశరథి సోద రులు, ఇనుగుర్తి ఒద్దిరాజు సోదరులు లాంటి కవి పం డితులు చేసిన సాహిత్య సేవలు మరువలేనివన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో మహాకవులు పుట్టిన పుణ్య స్థలాలను సందర్శించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంత చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలుసుకొని, ప్రపం చ నలుమూలలకు ప్రచారం చేయడం అవసరం ఎంతై న ఉందన్నారు. సోమనాథ కళాపీఠం ఆధ్వర్యంలో డాక్ట ర్ రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మీనారాయణ కవులకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరిజారమణ శర్మ, కట్టా అని, సిద్ధాంతి, రాజశేఖర్ శర్మ, తిరుపతమ్మ, నారజ ఉమాదేవి, డాక్టర్ మాడి పుష్పలత, కమలాకర్, శ్యాంప్రసాద్‌రావు, శ్వేత, నరేష్, అనితాకుమారి, సువర్ణ, శ్రీదేవి, శ్రీలత, సుజాత, తిరుపతయ్య, బలరాం, పుట్టి గిరిధర్, సభాపతి, చంద్ర మౌళి, పుష్పలత, రామన్న శివాచార్య, సునీల్ శివాచా ర్య, ఇమ్మడి దామోదర్, మెరుగు మధు ఉన్నారు.

ఎంఎస్సీ కెమిస్ట్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26 నుంచి జరుగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంఎస్సీ ఇంటి గ్రేటెడ్ కెమిస్ట్రీ 3వ ఏడాది 6వ సెమిస్టర్ పరీక్షల ను జూన్ 6కు రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫె సర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజ న్యలు శుక్రవారం తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 30 లోపు పూర్తి చేయాల ని పేర్కొన్నారు. ఇతర వివరాలకు విభాగా ధిపతిని సంప్రదించాలని సూచించారు.

30 నుంచి వర్సిటీ హాస్టల్స్, మెస్‌ను మూసివేస్తాం

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల హాస్ట ల్స్, మెస్‌లను ఏప్రిల్ 30 మధ్యాహ్నం భోజనం తర్వాత నుంచి మూసివేస్తామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చే శారు. మే 1 నుంచి 31 వరకు వేసవి సెల వుల దృష్ట్యా వర్సిటీ ఉన్న తాధికారుల ఆదే శాల మేరకు హాస్టల్స్‌తో పాటు మెస్‌లను క్లోజ్ చేస్తామని వెల్లడించారు. వర్సిటీ హాస్ట ల్స్ బోర్డర్లు ఏప్రిల్ 30న సాయంత్రం 5 గంటల వరకు హాస్టల్ రూంలు ఖాళీ చే యాలని కోరారు. జూన్ 1 నుంచి పీజీ నా ల్గవ సెమిస్టర్ పరీ క్షల కోసం మెస్, హాస్ట ల్స్‌ను పునఃప్రారంభిస్తామని పేర్కొ న్నారు. విద్యార్థులు వర్సిటీ నియమనిబంధనల మేరకు నడు చుకోవాలని సూచించారు.

శాంతిచర్చలకు ముందుకు రావాలి..

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మావోయిస్టు పార్టీ లేఖ

వెంకటాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ముట్టడి నిర్మూలన సైనిక చర్యను నిలిపివేసి శాంతిచర్చలకు ముం దుకు రావాలని మావోయిస్టు పార్టీ నార్త్-వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జి రూపేష్ అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవన్ పేరిట లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోం ది. శాంతి చర్చల ద్వారా సమస్యను పరి ష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ అణ చివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ప్రయ త్నిస్తుందని లేఖలో పేర్కొన్నారు. దీని ఫలి తంగా బీజాపూర్ - తెలంగాణ సరిహద్దు లో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైం దని, ఈ ప్రచారాన్ని వెంటనే నిలిపివేసి బలగాలను ఉపసంహరించుకోవాలన్నారు. తుపాకీతో సమస్యను పరిష్కరిం చడానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కగార్ సైనిక్ ప్రచారాన్ని ఒక నెల పాటు వాయిదా వేయాలని ఆయన లేఖలో కోరారు.

బాబోయ్ ఎండలు

- పగలంతా అత్యధిక ఉష్ణోగ్రతలు
- మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో 43 డిగ్రీల పైనే
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి
- ఆరెంజ్ అలెర్ట్ జారీ



హనుమకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సూర్యుడి సూర్రుమంటున్నాడు. సగటు ఉష్ణోగ్రత 43 డిగ్రీల కన్నా తగ్గడం లేదు. మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఎండలు మరింతగా మండిపోతున్నాయి. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ఉప్పరగూడెంలో అత్యధికంగా 43.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, హనుమకొండ జిల్లా ములుగు రోడ్డులో 42.9, జనగామ జిల్లాలో 42.8, వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌లో 42.6, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 42.5 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. గత అయిదు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరుకోవడమే కాకుండా రాత్రి వేళల్లో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిని వామ్‌నైట్ కండిషన్ అంటారు. ఈ స్థితి ఉమ్మడి జిల్లా అంతటా ఉంది. ఉష్ణోగ్రత 44 డిగ్రీలు ఉన్నప్పటికీ తేమ శాతం అధికంగా ఉంటే ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితి మరో మూడు రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. వడగాడ్పుల ప్రభావం కూడా ఉంటుందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండడం వల్ల ఆరుబయట పనిచేసే వారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఎండవేడి నుంచి రక్షణకు తల, శరీర భాగాలను పూర్తిగా కప్పి ఉంచుకోవాలని, ప్రతీ గంటకు ఒకసారి నీడకు వెళ్లి సేద తీర్చుకోవాలని, తరుచూ నీటిని సేవిస్తుండాలని సూచిస్తున్నారు. లేకుంటే శరీరంలోని తేమ శాతం తగ్గిపోయి వడదెబ్బకు గురై డీహైడ్రేషన్ వల్ల ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందంటున్నారు.

సర్జరీలు నిలిచిపోయాయ్!

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సేవలు దారుణం
- నెల రోజులుగా ఇదే తీరు
- రోగులు హైదరాబాద్‌కు రెఫర్
- పనిచేయని సెంట్రలైజ్డ్ ఏసీ



దయాలసిస్ వార్డులో ఏసీలు పనిచేయక పోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఫెడస్టల్ ఫ్యాన్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గత నెల రోజులుగా సర్జరీలు నిలిచిపోయాయి. పేరుకు పెద్ద ఆసుపత్రి అయినప్పటికీ సేవలు మాత్రం దారుణంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర రోగులను హైదరాబాద్‌కు రెఫర్‌చేస్తూ ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సూపర్ సేవలు స్థానికంగా అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఐదు విభాగాల సేవలు

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో యూరాలజీ, కార్డియో థోరాసిక్, ఆంకాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాలను ఏర్పాటు చేశారు. ఎండాకాలంలో కిడ్నీ రోగుల కోసం విశిష్టమైన సేవలిందించాల్సిన యూరాలజీ విభాగం సర్జరీలకు స్వస్తి పలికింది. అదే విధంగా మిగతా విభాగాల్లో కూడా నెల రోజులుగా సర్జరీలు నిలిచిపోయాయి. ప్రతి రోజు 145 వరకు ఐదు విభాగాలలో సర్జరీలు జరిగేవి.

ఏసీలు పనిచేయక సర్జరీలు వాయిదా

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సెంట్రలైజ్డ్ ఏసీలోని చిల్లర్స్ మోటార్ రిపేర్‌కు వచ్చాయి. దీంతో ఈ ఏసీ పని చేయడం నిలిచిపోయింది. ఆసుపత్రి అధికారులు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. నిధులు విడుదల కాక పోవడంతో కొన్ని నెలలుగా ఏసీలు పనిచేయడం లేదు. ఫలితంగా సర్జరీలన్నీ వాయిదా వేస్తున్నట్టు రోగులు వాపోతున్నారు. రోగులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియాకు రెఫర్ చేస్తూ స్థానిక వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

కరెంట్ పోతే అంతే సంగతులు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స అందించే సమయంలో కరెంట్ పోతే అంతే సంగతులని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు 750 కేవీ జనరేటర్లున్నా ఇందులో ఒకటి రిపేర్‌కు వచ్చినట్టు తెలుస్తోంది. పనిచేస్తున్న ఆ ఒకటిని ఆన్ చేస్తే ఒకదానిపై లోడ్ పడి అది కూడా రిపేర్‌కొచ్చే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఇక వేసవిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు 125 పెడస్టల్ ఫ్యాన్లు, 60 వాల్మౌటెడ్ ఫ్యాన్ల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. కేవలం 10 ఫ్యాన్లు ఉన్నతాధికారులు మంజూరు చేశారని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం.

డయాలసిస్ రోగులకు శాపం

కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం 10 డయాలసిస్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యంతాలతో నిత్యం 30 మందికి డయాలసిస్ చేస్తుంటారు. ఏసీలు పనిచేయక పోవడం వల్ల పెడస్టల్ ఫ్యాన్లతో విఫన్ చల్లబరుస్తూ డయాలసిస్ చేస్తున్నారు. ఫలితంగా డయాలసిస్ మిషన్లు కూడా వేడెక్కి ఏక్షణాన్నయినా రిపేరుకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆసుపత్రిలోని రోగుల కోసం ఆరు లిఫ్టులను ఏర్పాటు చేయగా ప్రస్తుతం రెండు రిపేర్‌లో ఉన్నాయి. డయాలసిస్ చేయించుకునే రోగులు ర్యాంపు నుంచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పోస్ట్ ఆపరేటివ్ వార్డుల్లో ఇబ్బందులు

సర్జరీలు పూర్తి చేశాక రోగులను పోస్ట్ ఆపరేటివ్ వార్డులో ఉంచుతారు. ఇక్కడ ఏసీలు పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా సర్జరీలు నిలిచిపోయాయి. నిత్యం 500కు పైగా ఓపీ, 145కు పైగా మేజర్, మైనర్ ఆపరేషన్లు జరగాల్సి ఉండగా అన్ని వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇప్పటికైనా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆపరేషన్లు లేక బోసిపోయి కనిపిస్తున్న నెఫ్రాలజీ విభాగం



నెలలు లేక ఆపరేషన్లు బంద్ కావడంతో మూతపడిన ఆపరేషన్ థియేటర్

గులాబీమయమైన ఎల్కతుర్తి



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ముస్తాబైన వేదిక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న వివిధ జిల్లాల నేతలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేదికైన ఎల్కతుర్తి గులాబీమయంగా మారింది. మూడు జిల్లాలకు ముఖద్వారంగా ఉన్న ఎల్కతుర్తిలో సభ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి వరంగల్ నేతలతో పాటు ఇతర జిల్లాల నేతల రాకపోకలతో సభా స్థలి సందడిగా మారింది. సుమారు నెలరోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో కేసీఆర్, హరీష్‌రావు మినహా మిగతా రాష్ట్ర నాయకులంతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇక ఆదివారం జరిగే సభకు లక్షలాది మంది తరలిరానున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 1,250 ఎకరాలను సభ కోసం సిద్ధం చేయగా.. 169 ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని నిర్మించారు. ఇందులో 500మంది కూర్చునేలా సభా వేదికను తయారుచేశారు. వేదికకు ఓ వైపు కళాకారులు ధూం..ధాం కార్యక్రమాలు చేపట్టడానికి మరో వేదికను సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ స్థలాలను కలుపుకుని 20 భారీ వైర్‌లెస్ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

• ప్రముఖుల రాకతో సందడిగా సభాస్థలి

విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా 400 కిలోవాట్స్ సామర్థ్యం గల విద్యుత్ జనరేటర్లను అందుబాటులో ఉంచారు. సభ ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లోనూ గులాబీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపుల నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు, గులాబీ జెండాలతో నింపేశారు.

10 లక్షల మజ్జిగ, 10 లక్షల వాటర్ ప్యాకెట్లు

రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే ప్రజలకోసం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సభ స్థలితో పాటు రహదారులకు ఇరువైపుల తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు నాయకులు తెలిపారు. అలాగే సభకు ఇరువైపులా వేర్వేరుగా మెడికల్ క్యాంపులు, అందుబాటులో డాక్టర్లను నియమించినట్లు తెలిపారు. ప్రధాన రహదారుల్లో నాలుగు వైపులా అంబులెన్స్‌లు సిద్ధం చేశారు. సభ స్థలానికి నాలుగు రోడ్ల నుంచి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవడానికి 2 వేల మంది పార్టీ కార్యకర్తలు వాలంటీర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేసి అధికారులకు అందజేశారు.

సాయంత్రం 4.30కు ఎల్కతుర్తికి చేరుకోనున్న కేసీఆర్

ఈనెల 27న ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మాజీ సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో సభ స్థలానికి చేరుకోనున్నట్లు సభ నిర్వాహకులు తెలిపారు. కేసీఆర్‌కు పార్టీ నాయకులు స్వాగతం పలికి నేరుగా వేదిక పైకి తీసుకెళ్లనున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించి తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

సంరంభానికి.. సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

పార్టీ నేతలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లోనూ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రజతోత్సవ వేడుకలకు రైతులతో పాటు మహిళలు, యువతను భారీగా తరలించేందుకు కసరత్తు చేస్తున్నారు.

గులాబీ నేతల్లో సమన్వయ మంత్రం

రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్టానం ఓరుగల్లు గులాబీ నేతల మధ్య ఉన్న విభేదాలపై కూడా ఫోకస్ పెట్టింది. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంట్లో ఐదు గంటలకు పైగా సమీక్ష చేశారు. చిన్నచిన్నవాటిని పట్టించుకోని.. రజతోత్సవ సభకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. అంతేకాకుండా ఎవరికి ఏ నియోజకవర్గాల బాధ్యతలు ఇచ్చారో వాటిపై ఫోకస్ చేయాలని కోరారు. ప్రతీ గ్రామం నుంచి సభకు వచ్చే కార్యకర్తల జాబితా ఇవ్వాలని, 50వేలకు తగ్గకుండా జన సమీకరణ చేయాలని సూచించారు. ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల మధ్య ఉన్న భేదాభిప్రాయాలపై చర్చించి, అందరినీ సమన్వయం చేయటంలో కేటీఆర్ సక్సెస్ అయ్యారనే చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. మొత్తంగా మాజీ మంత్రితో కొందరు నేతలకు ఉన్న విభేదాలు తాత్కాలికంగా పక్కన పెట్టి సమన్వయంతో పని చేస్తున్నారనే చర్చ జరుగుతుంది.

సభా ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు

బీఆర్ఎస్ రజతోత్సవాలకు వేదికైన ఎల్కతుర్తి గులాబీమయమైంది. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే బహిరంగ సభకు మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ కీలక నేతలు పాల్గొననున్నారు. 1,250 ఎకరాల్లో రజతోత్సవ సభకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 169 ఎకరాల్లో సభ ప్రాంగణాన్ని నిర్మించారు. ఈ ప్రాంగణం మొత్తం గులాబీ రంగు జెండాలు, పరదలతో నిండిపోయింది. కేసీ ఆర్, కేటీఆర్‌లతో సెల్ఫీల కోసమని సెల్ఫీ బోర్డులను, మీడియాకోసం వైఫై, భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 200లకు పైగా జనరేటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పార్కింగులకు కేటాయించారు. పార్కింగ్ ప్రాంతాల్లో మొత్తం గులాబీ జెండాలను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి జంక్షన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలన్ని గులాబీ ఫ్లెక్సీలు, జెండాలతో గులాబీమయంగా మారుతున్నాయి.



ప్రభబండిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

కొమ్మాల నుంచి ప్రభబండి

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గీసుగొండ మండలం కొమ్మాల నుంచి భారీ ప్రభబండిని తరలిస్తున్నారు. శుక్రవారం ఆ ప్రభబండిని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆర్చిగేటు వద్ద కొబ్బరికాయ కొట్టి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారెడ్డి స్వయంగా ఆ ప్రభబండిని నడిపి కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పట్ల ప్రజలు విరక్తి చెంది సీఎంగా మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బోడకుంట్ల ప్రకాష్, పుండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, గుర్రం రఘు, కంబాల కోటి, సద్ది తిరుపతిరెడ్డి, ధనుంజయ్, జూలూరి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసింది కేసీఆరే

- గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- మళ్లీ బీఆర్ఎస్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారు
- ఎడ్లబండి ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో ఎడ్లబండ్ల ర్యాలీలో దప్పుకొడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఎడ్లబండ్ల ర్యాలీలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజు చేసింది కేసీఆరేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ 65వ డివిజన్ దేవన్నపేటలో శుక్రవారం ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత తన పదేండ్ల కాలంలో రైతును రాజును చేసిందన్నారు. కేసీఆర్ ఒక విజన్‌తో పని చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవగాహనా రాహిత్యంతో ప్రజలను ఆగం పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీల అమలు మరిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమం కోసం పని చేస్తామని చెప్పి రైతు వెన్నముక విరిచిందని ఎద్దేవా చేశారు. పింఛన్లు పెట్టింది ఎన్‌టీఆర్ అయితే దాన్ని పెంచి ఆసరా అయ్యింది కేసీఆరేనని అన్నారు. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని వాటికి బిల్లులు చెల్లించడానికి కూడా ఈ ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. రైతు బంధు ఎగ్గొట్టిన మోసపూరిత ప్రభుత్వాన్ని ప్రజలు, రైతులు ఛీదరించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సీఎంగా మళ్లీ కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్లు వచ్చినా 100 సీట్లు బీఆర్ఎస్ పార్టీకి పక్కా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రేపు జరగబోయే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యరాణి రాజునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు సూరం రాజు, పంజాల భూపాల్, సుదన్, విజేందర్, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శనిత్రయోదశి

రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : శనివారం మాస శివరాత్రితోపాటు శనిత్రయోదశి కలిసి రావడం చాలా అరుదుగా జరుగుతుందని ఈ సందర్భంగా రుద్రేశ్వరాలయంలో శనివారం దోష నివారణకై శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. కుంభం, మీనం, మేషం, వృశ్చిక రాశుల వారికి అర్ధఅష్టమ శని, ఏలిన నాటి శని ఉన్నందున ఈ రాశుల వారు పూజలు నిర్వహించుకోవాలని మిగతా రాశుల వారు కూడా శనేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు.

జూనియర్, సీనియర్ జడ్జీల బదిలీలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.చండీశ్వరిదేవిని యాదాద్రి భువనగిరి జిల్లా జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీచేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఈ మేరకు ప్రకటనజారీచేశారు. చండీశ్వరిదేవి స్థానంలో కుషాయిగూడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.పూజాను నియమించారు.అదేవిధంగా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న ఎస్.అంకిత్‌ను నియమించారు.ఇప్పటి వరకు పరకాల జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న శాలినిలింగంను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో జి.సాయిశరత్‌ను నియమించారు. ఆయన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తూ పరకాలకు బదిలీపై వచ్చారు.


మేడారంలో శాశ్వత పనులకు రంగం సిద్ధం

ప్రణాళికల రూపకల్పనకు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ సురేష్ పర్యటన



భక్తులకు నీరందించే వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మల మహా జాతరలో శాశ్వత అభివృద్ధి పనుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ కె.సురేష్ అన్నారు. మేడారం పర్యటనలో భాగంగా చేయబోయే పనులను శుక్రవారం అధికారులతో కలిసి తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి నెలలో జరగబోయే సమ్మక్క సారలమ్మల మహా జాతరకు తరలి వచ్చే భక్తులకు శాశ్వత సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచనల మేరకు చేపట్టబోయే శాశ్వత పనుల నిర్మాణ పనులకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు. ఈ క్రమంలో మేడారం పరిసర ప్రాంతాలైన చింతల్ క్రాస్ రోడ్డు, కాల్వపల్లి క్రాస్ రోడ్డు, కన్నెపల్లి, చిలకల గుట్ట, జంపన్నవాగు, జంట వంతెనల వద్ద, ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్, శివరాంసాగర్, పలు ప్రాంతాల్లో పర్యటించి శాశ్వత పనుల ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. శాశ్వత నిర్మాణాల కోసం గుర్తించిన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేష్, ఈఈలు, మాణిక్యాలరావు, రామాంజనేయులు, సుభాష్, డీఈలు సునీత, సతీష్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, మధుకర్, ఏఈలు నవీన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతీ హామీని నెరవేరుస్తాం : ఎమ్మెల్యే నాయిని

న్యూశాయంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 31వ డివిజన్ సూర్జిత్‌నగర్‌లో శుక్రవారం రూ.కోటితో సీసీ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణం, సీసీ డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. సూర్జిత్ నగర్‌కు ఎమ్మెల్యే నిధులనుంచి రూ.70లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే సూచించారు. దీన్‌దయాళ్‌నగర్‌ను ఇప్పటికే జూబ్లీహిల్స్‌లా మార్చామని, సూర్జిత్‌నగర్‌నూ అలాగే మార్చే బాధ్యత తనదేనన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పశ్చిమ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు వీ మోహన్‌రావు, ఎం శివశంకర్, కాంగ్రెస్ నాయకులు సురేందర్, కృష్ణ, మామిండ్ల సురేష్, పార్టీ యూత్ నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» బల్దియా కమిషనర్ అశ్విని తానాజి వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర ప్రజలు గృహ, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎర్లీబర్డ్ స్కీం ద్వారా పన్నులు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. ఆస్తిపన్నులో 5 శాతం రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న శివనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి రూ.15లక్షల చెక్కును స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 30 వరకు ముందస్తుగా ఇంటి పన్నులు చెల్లించే వారికి 5శాతం రిబేట్ వర్తిస్తుందని తర్వాత ఈ అవకాశం ఉండదని అన్నారు. కార్యక్రమంలో కాశిబుగ్గ డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, ఆర్ఐలు సహజాది బేగం, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్లలో నీడతెరల ఏర్పాటు

• వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



అదాలత్ ప్రాంతంలో నీడ తెరలను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):వాహనదారుల సౌకర్యం కోసం వరంగల్ నగరంలోని పలు జంక్షన్లలో నీడ తెరలు(గ్రీన్‌మ్యాట్‌లు) ఏర్పాటు చేశామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీడ తెరలను శుక్రవారం మేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా ప్రతీ రోజు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వరంగల్ ట్రైసిటీస్‌లో ప్రధాన కూడళ్లు, జంక్షన్లవద్ద నీడ తెరలు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎండలో ఆగి ఉన్న వాహనదారులకు నీడ తెరలు బాగా ఉపయోగపడుతాయన్నారు. ముందుగా అదాలత్, అశోక జంక్షన్, సీపీవో జంక్షన్, కేయూ జంక్షన్, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ ప్రాంతాలలో నీడ తెరలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, ఏఈ హరికుమార్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




గ్యాదరి ఉప్పలయ్య, కె.శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్లో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య ఎన్నికల అధికారిగా, ఉపాధ్యక్షుడు బాబుదొర పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా గ్యాదరి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా కటుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి.అంజనీదేవి, జె.గోవర్ధన్, ఎల్. మల్లయ్య, కార్యదర్శులుగా డాక్టర్ ఎం.సారంగపాణి, ఎస్.సుమ, సీహెచ్. బాపూరావు, డాక్టర్ ఎ.కిషన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.గంగాధర్, ఎస్.సుభాషిణి, టి.లింగారెడ్డి, ఫ్రాన్సిస్ జేవియర్, ఎ.సంజీవరెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, డి.రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.సమ్మిరెడ్డి, సభ్యులుగా బి.రవి, ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

బార్ షాపుల దరఖాస్తుల స్వీకరణకు నేడు ఆఖరు తేది

వరంగల్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో గతంలో రెన్యూవల్ కాకుండా మిగిలిఉన్న నాలుగు బార్ షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు శనివారం చివరి గడువని వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు శనివారం సాయంత్రం 5 గంటల లోపు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరు మీద లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ డీడీ లేదా చలాన్ తీసి 3 కలర్ ఫోటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డును జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం లేదా నిట్ సమీపంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో లేదా హైద్రాబాద్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలు సమీప ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో లేదా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు..ఈ నెల 29న వచ్చిన దరఖాస్తుల నుంచి డ్రా తీయనున్నట్టు తెలిపారు. మిగితా వివరాలకు 0870-2577502, 87126 59019 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దంపతుల అదృశ్యంపై కేసు నమోదు

కాజీపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి సమీపంలోని బైక్‌ను వదిలి దంపతులు అదృశ్యమయ్యారు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వడ్డెపల్లి సమీపంలోని జవహర్‌నగర్‌కు చెందిన దంపతులు ఐత సందీప్‌కుమార్, మానస ఈ నెల 21 న ఉదయం ఇంటి నుంచి వచ్చి బైక్‌ను వడ్డెపలి సమీపంలో వదిలి వెళ్లారు. గురువారం రాత్రి స్థానికులు బైక్‌ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బైక్ నంబర్ ఆధారంగా అడ్రస్, ఫోన్ నంబర్‌ను కనుక్కున్నారు. సందీప్ తండ్రి సంపత్ కుమార్ ఆ బైక్ తన కుమారుడిదిగా నిర్ధారించారు. ఆ నెల 21న తన కుమారుడు, కోడలు బైక్‌పై వెళ్లి ఇంటికి రాలేదని చెప్పారు. సంపత్ కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అదృశ్యమైన దంపతులు స్థానికంగా ఓ కిరాణ షాపు నడిపిస్తుంటారు. వారికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు తెలుస్తోంది.

శ్వేతార్కలో గణపతి వసంతోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాజీపేట, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట విష్ణుపురి శ్వేతార్క ఆలయంలో ఈ నెల 30 నుంచి మే 4 వరకు గణపతి 27వ వసంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటేశ్వరశర్మ తెలిపారు. వెంకటేశ్వరశర్మ, ఆలయ నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణ శర్మ వేడుకల వివరాలను శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు గజారోహణం పురవీధుల్లో ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం వసంతోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్ యాదవ్, దేవాలయ కార్యకర్తలు దేవులపల్లి సదానందం, మైలవరపు శివరాం, లక్క రవి, దుర్గం సుధీర్, సరిత పాల్గొన్నారు.

పహల్గాం అమరులకు నివాళులు

• ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు




హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, భవానీనగర్ నుంచి గోకుల్‌నగర్‌కు ర్యాలీగా వస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా శుక్రవారం రాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేయిస్తంభాల ఆలయం నుంచి చౌరస్తా వరకు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ హిందువులందరు ఐక్యమత్యంతో ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిందేనని ఆయన పిలుపునిచ్చారు. గోపు సారయ్య, ప్రభాకర్, దయానంద్‌జీ, హరిసింగ్ లాల్, ఆజాద్‌సింగ్ తదితర పలు కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

• వరంగల్ ఎడ్యుకేషన్: కశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల దాడిలో మృతి చెందిన అమరులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శుక్రవారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, కుమార్, రాజు, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, దామోదర్, సదాశివరెడ్డి, మల్లిక్, లింగారావు, గిరిధరాచార్యులు, ప్రసన్నానంద్, కరుణాకర్,రమేష్, రవీందర్,మహేష్,రాజిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, థావూ, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

• హనుమకొండ చౌరస్తా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడి పిరికిపందల చర్య అని జీడబ్ల్యూఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజోద్దీన్ అన్నారు. శుక్రవారం హనుమకొండ 10వ డివిజన్ చమన్ వద్ద ఉన్న మసీద్ ముందు రాయ్‌పుర మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎండీ.షఫీ, సభ్యులు మౌలానా ఇదరీఫ్, ఉబేద్ సిద్దికి, తౌసిఫ్‌హైమద్, ముస్లింలు పాల్గొన్నారు.

• జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర్ అధ్యక్షుడు కేశిరెడ్డి జయపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై బుధవారం కాల్పులకు తెగబడి ఉగ్రమూకల దిష్టిబొమ్మ హనుమకొండ చౌరస్తాలో దహనం చేసి, అనంతరం దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్ వరంగల్ మహానగర్ అధ్యక్షుడు కేశిరెడ్డి జయపాల్‌రెడ్డి మాట్లాడు తూ.. ఉగ్ర కిరాతకులు నువ్వు హిందువేనా అని మతాన్ని అడిగి మరీ కర్కశంగా కాల్పులకు తెగపడటం దుర్మార్గమని మండిపడ్డారు. హిందువుల జోలికి వస్తే అస్సలు ఒదిలి పెట్టబోమని హెచ్చరించారు. అదే విధంగా భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో చొరబడి ఉన్న మతోన్మాదులను విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యు లం ఏకమై ఏరి వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర్ కార్యదర్శి రాజు సభ్యులు రాజు, తాడిశెట్టి శ్రీధర్, సునందకుమార్, ఓం కుమార్, రమేష్, బజరంగ్‌దల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

• వడ్డెపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీజీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు సయ్యద్ విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, గుంటి స్వప్న, నాయకులు ఈవీ శ్రీనివాసరావు, డాక్టర్ పులిఅనిల్‌కుమార్, డాక్టర్ పేరుమాండ్ల రామకృష్ణ, పల్లె రాహుల్‌రెడ్డి, మారంరెడ్డి కౌటిల్‌రెడ్డి, దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

• పహల్గాంలో అసువులు బాసిన పర్యాటకులకు నగర వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీలు తీశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి భవాని నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గురిజెపల్లి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమాకర్‌రెడ్డి, 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, వికాస్‌నగర్ అధ్యక్షుడు పులి వీరారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో భవానినగర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజమౌళి, సామాజికవేత్తలు కొండా కృపాకర్, కంది శ్రీనివాస్, మరికంటి ధన్‌రాజ్, అల్లం మల్లికార్జున్, ప్రొఫెసర్లు రాంరెడ్డి, నర్సింహమూర్తి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ప్రజా సంఘాల నాయకులు మార్క శంకర్‌నారాయణ, డీటీఎఫ్ సోమయ్య, ఉస్మాన్‌పాషా, వేణుగోపాల్‌రావు, కర్రె భిక్షపతి, వేల్పుల సారంగపాణి, ఎండీ రఫీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

• బాలసముద్రం: కశ్మీర్‌లో ఉగ్రవాదులు భయానకమైన సంఘటనకు పాల్పడడం విషాదకరమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అన్నారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ పాలక మండలి సభ్యులు, ఉద్యోగులు సంఘటనను తీవ్రంగా ఖండించారు.

అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను సందర్శించారు. దీక్షల్లో కూర్చున్న అధ్యాపకులకు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాగా, దీక్షలు శుక్రవారం నాటికి 7వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ సాధు రాజేశ్, పి.కరుణాకర్‌రావు, జూల సత్య, అరూరి సూర్యం, రవీందర్, చంద్రశేఖర్, నాగయ్య, రఘువర్ధన్ రెడ్డి, ఫిరోజ్, కొమురయ్య, ప్రణీత, శ్రీలత, కవిత, సరిత, సుజాత, స్వప్న, కల్పన, వాణిశ్రీ, దీప్తి, ఫాతిమా, సలోని తదితరులు పాల్గొన్నారు.

దివంగత జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి

• ఐజేయూ నేత దాసరి కృష్ణారెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దాసరి కృష్ణారెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దివంగత జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ నేత దాసరి కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రం ప్రెస్ క్లబ్‌లో దివంగత ఎం.సుధాకర్‌రావు ప్రాంగణంలో క్యాతం విజయ అధ్యక్షతన నిర్వహించిన దివంగత జర్నలిస్టుల కుటుంబ సంక్షేమ సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు యూనియన్‌తో పాటు మీడియా అకాడమీ ద్వారా రావాల్సిన పెన్షన్, రూ. లక్ష ఆర్థిక సాయం అందించేలా కృషి చేస్తామని, ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య, టీయూడబ్ల్యూజే నేత కంకణాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బి. సమంత కుమారి, ఉపాధ్యక్షురాలిగా పోలు దేవకి, ప్రధాన కార్యదర్శిగా చిర్ర మానస, సహాయ కార్యదర్శిగా ఎండీ ఆర్షియా తబసం, కోశాధికారిగా క్యాతం విజయ, కార్యవర్గ సభ్యులుగా రజిత, వాడపల్లి కస్తూరి, అరూరి రాజేశ్వరి, బంక రమ, సుహాసిని, వసుమతిని ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ సభకు 30వేల మందిని తరలించాలి

» మండలాల ఇన్‌చార్జ్‌లకు ఎర్రబెల్లి దిశానిర్దేశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు 30వేల మందిని తరలించే విధంగా మండల ఇంచార్జిలు, డివిజన్ ఇంచార్జిలు కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం రాంనగర్‌లోని తన నివాసంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, ఐనవోలు, హసన్‌పర్తి, గ్రేటర్ పరిధిలోని 13 డివిజన్ల ముఖ్య నాయకులతో జనసమీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఏవిధంగా సభకు తీసుకురావాలనే విషయంపై ఆయా మండలాల ఇంచార్జిలతో పాటు ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలను తరలించేందుకు ఏఏ ప్రాంతానికి ఎన్ని వాహనాలు కేటాయించాలని కలిసి నిర్ణయం తీసుకున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా మార్గమధ్యలో తాగునీరు, మజ్జిగ ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎవరి వాహనాలకు వారే బాధ్యులని ఇంటి నుంచి బయలుదేరి ఇంటికి చేరుకునే వరకు ఆయా మండల ఇంచార్జిలతో పాటు వాహన ఇన్‌చార్జలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి కేటాయించిన పార్కింగ్ కేంద్రాల్లో వారే వెళ్లాలని ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం తలపెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఇన్‌చార్జి చింతల యాదగిరి, వర్ధన్నపేట ఇన్‌చార్జి ఎల్లావుల లలితాయాదవ్, ఐనవోలు ఇన్‌చార్జి గుజ్జ గోపాలరావు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి గోపాలపురం హనుమకొండ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో సమ్మయ్యనగర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ప్రభుత్వ ఆయుర్వేద బోధన అసుపత్రి వరంగల్ వారి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు 2120 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శోభాకిరణ్, సంస్థ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, సంస్థ ప్రతినిధులు మానపాటి రజని, నాగులగాం నర్సయ్య, తేరాల యుగందర్, మార్క రవిందర్‌గౌడ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపాల్గొన్నారు.

భారతదేశ సంస్కృతి ఆదర్శనీయం

• సుమతిరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లోని కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే శ్రీథమ్-25 సంప్రదాయ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డప్పు, డోలు వాయిద్యాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన వేషధారణ, వంటల పోటీలు, సంప్రదాయ నృత్యాలు, బతుకమ్మ ఆటలు, బోనాలు, కోలాటాలు, ముగ్గుల వంటి కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు కె.మహేందర్, ఈ.సుదర్శన్, ఎస్ శ్రీవాణి, కన్వీనర్ కె.రవికిరణ్, ప్రణతి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, విద్యార్థి కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి జైలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించిన వ్యక్తిపై నేరం రుజువైనందున ఆరు నెలల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా 2వ అదనపు సెషన్స్ జడ్జి కం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి మనీషా శ్రవన్ ఉన్నమ్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2010 మార్చి 29న సాయంత్రం 5.30 గంటలకు తన క్యాంపు కార్యాలయంలో వరంగల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లకావత్ ధనవంతి విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో నర్సంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ తరపున జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన మోహన్‌రెడ్డి వచ్చి జనరల్ ఫండ్ కింద పనుల కోసం నిధులు మంజూరి చేయాలని వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం స్వీకరించిన చైర్ పర్సన్ మార్చినెల నిధులు ఏమీ లేవని తెలియజేయడంతో తనకు నిధులు లేవంటావా అంటూ దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించి నీ సంగతి చూస్తానంటూ బెదిరించాడు.

దీంతో తనను మహిళా అని చూడకుండా కులం పేరుతో దూషించి నిందితుడు మోహన్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు మోరాల మోహన్‌రెడ్డికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.చందర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఏసీపీలు పి.శోభన్‌కుమార్, ఎం. జితేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి వ్యవహరించారు. కోర్టు పీపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషి కేసు వాదించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్

• కాంటాలో తేడాలను ప్రశ్నించిన రైతులు



ఏపీఎం ప్రభాకర్‌తో మాట్లాడుతున్న రైతులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయగిరి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం గోల్‌మాల్ చోటు చేసుకున్నట్లు రైతులు గుర్తించారు. స్థానిక రైతులు కొనుగోలు కేంద్రంలోని ఎలక్ట్రానిక్ కాంటాలో 10 కిలోల ఇనుప బాటు తూకం వేశారు. అందులో 10కిలోలకు ఆరకిలో (500 గ్రాములు) తూకం తక్కువ వచ్చింది. రైతులు నిర్వాహకులతో గొడవకు దిగారు. విషయం తెలిసిన ఐకేపీ ఏపీఎం ఆకుల ప్రభాకర్ కొనుగోలు కేంద్రానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అనంతరం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడా వస్తున్నట్లు గుర్తించి గురువారం మెకానిక్‌తో రిపేర్ చేయించామని నిర్వాహకులు తెలిపారు. అయినా ఎందుకు తూకంలో తేడాలు వస్తున్నాయో ఏపీఎం ఆరా తీశారు. కొత్త కాంటా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన 25 క్వింటాళ్ల ధాన్యంలో 12.50 క్వింటాళ్ల నష్టాన్ని కేంద్రం నిర్వాహకులు భరించడానికి ఒప్పుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

ఆపరేషన్ 'కగార్'ను వెంటనే నిలిపివేయాలి

» ఎస్ఆర్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సెక్యులర్ రైటర్స్ ఫోరం (ఎస్ఆర్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నేత జనగాం కుమారస్వామి, పౌరహక్కుల సంఘం నాయకుడు పి. రమేష్‌చందర్, మానవ హక్కుల నేత బాదావత్ రాజు మాట్లాడారు. ఆదివాసీలు, మావోయిస్టుల నిర్మూలన కోసం కొనసాగిస్తున్న కాల్పులను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. మధ్య భారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ప్రొఫెసర్ కల్యాణి, కోడం కుమారస్వామి, కళావతి, శాంత, క్రాంతి, రాచర్ల బాలరాజు, ప్రవీణ్‌కుమార్, శివ, యాకూబ్, దయాకర్, అమరేందర్, ఎం. కుమారస్వామి, ప్రవీణ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

నియామకాల్లో పీడీఎఫ్ అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించాలి



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న పీడీఎఫ్ నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో భర్తీ చేసే అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల నియామకాల్లో దేశంలో అత్యున్నత డిగ్రీకలిగిన పీడీఎఫ్ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని పోస్టు డాక్టరల్ ఫెల్లోషిప్ (పీడీఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణాలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పీడీఎఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాలమాకుల కొమురయ్య, డాక్టర్ మంద వీరాస్వామిలు మాట్లాడుతూ... వర్సిటీల్లో టీచింగ్ పోస్టుల భర్తీ కోసం వెలువరించిన జీవో 21లో పీడీఎఫ్ అభ్యర్థులకు యూజీసీ నిబంధనల మేరకు 10 మార్కులు కేటాయించాలని స్పష్టం చేశారు. ఐదేళ్ల ఫెల్లోషిప్ కాలంలో క్లాస్ వర్క్ చేశామని, దానికి ఏడాదికి రెండు మార్కుల చొప్పున మరో 10 మార్కులను అదనంగా కేటాయించాలని కోరారు. దీనిపై బాలక్రిష్ణారెడ్డి స్పందిస్తూ జీవో 21లో మార్పులు చేసి పీడీఎఫ్ అభ్యర్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టు డాక్టరల్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు డాక్టర్ పాలమాకుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహ, డాక్టర్ మంద వీరాస్వామి, కన్వీనర్లు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, డాక్టర్ సురాసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేకప్

చెమటకు చెదరకుండా

వేసవిలో ఉక్కపోతకు మేకప్ చెదిరిపోతుందనే భయం వెంటాడుతూనే ఉంటుంది. ఇలాంటి భయాలకు లోను కాకుండా ఉండాలంటే 'స్వెట్ ప్రూఫ్ మేకప్' ఎంచుకోవాలి. అందుకోసం...

వేసవి ఉక్కపోత, చెమటలతో మస్కారా కారిపోవచ్చు. ఫౌండేషన్ చెదిరిపోవచ్చు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే చెమటకు చెదరని మేకప్ మెలకువలు పాటించాలి.

చల్లని నీళ్లతో: స్వేద రంధ్రాలు కుంచించుకుపోయి, చర్మం నిగనిగలాడాలంటే, చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచాలి. మేకప్ ముందు కొన్ని నిమిషాల పాటు గడ్డకట్టే చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచి ఉంచి, ఆ తర్వాత మేకప్ వేసుకోవడం మొదలుపెట్టుకోవాలి. అప్పుడు చెమట తగ్గుతుంది

ప్రైమర్‌తో: వాటర్ రెసిస్టెంట్ ప్రైమర్‌తో చర్మపు నూనెల ప్రభావానికి కారిపోకుండా ఉంటుంది. వేసుకున్న మేకప్ చెమటకు కారిపోకుండా నియంత్రించాలంటే, చక్కని మ్యాటిఫైయింగ్ ప్రైమర్‌ను ఎంచుకోవాలి



ఫౌండేషన్: తేలికగా ఉండే సీరమ్ ఫౌండేషన్స్ వేసవికి తగినవి. వీటిని ఉపయోగించుకుంటే మేకప్ ముద్దలుగా ఊడిపోకుండా ఉంటుంది. అలాగే ఆల్ ఇన్ వన్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయిశ్చరైజర్‌లలో ఏదో ఒకదాన్ని వాడుకోవాలి

చెదిరిపోకుండా: ఐషాడో, లేదా మస్కారా చెమటకు కారిపోతూ ఉంటుంది. కాబట్టి నీటితో చెక్కుచెదరని ఐ మేకప్‌ను ఈ కాలంలో ఎంచుకోవాలి. ఖోల్, జెల్ ఐలైనర్లు, మస్కారాలు, ఐషాడోలు ఈ కోవకు చెందినవే అయి ఉండాలి. స్మడ్జ్ ప్రూఫ్ ఉత్పత్తులు చర్మపు జిడ్డుకు చెక్కుచెదరకుండా ఉంటాయి.

పౌడర్ బ్లష్ వద్దు: చెక్కిళ్ల మీద గులాబీ రంగు బ్లష్ అద్దుకోనిదే మేకప్ పూర్తి కాదు. కానీ చెమటలు ఎక్కువగా పట్టే తత్వం ఉన్నవాళ్లు పౌడర్ బ్లష్‌కు బదులుగా క్రీమ్ బ్లష్ ఎంచుకోవాలి. దీంతో చెక్కిళ్లకు సహజసిద్ధమైన గులాబీ రంగు సమకూరడంతో పాటు, ఈ రంగు చెమటకు కారిపోకుండా కూడా ఉంటుంది.

సెట్టింగ్ స్ప్రే: మేకప్ కరిగిపోకుండా ఉంచే మరొక చిట్కా సెట్టింగ్ స్ప్రే. నాణ్యమైన సెట్టింగ్ స్ప్రేతో మేకప్ ముద్దలు కట్టదు, చెదిరిపోదు. ఈ స్ప్రేలోని దినుసులు చెమటకు అవరోధంగా మారి, వాటర్‌ప్రూఫ్ మేకప్ లుక్‌ను తెచ్చిపెడతాయి. స్ప్రే బాటిల్‌ను ముఖానికి అడుగు దూరంలో ఉంచి ముఖం మీద స్ప్రే చేసుకోవాలి. ఇదే సరైన పద్ధతి.

బ్లాటింగ్ పేపర్: ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఎంతో కొంత చెమట ముఖానికి పడుతూనే ఉంటుంది. దీన్ని అద్దుకోవడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి.



అతిథి
ఫరా రూబీ
స్విట్జర్లాండ్ ఎంపీ

శ్రీలంకలో పుట్టారు. ఆరేళ్లకే కుటుంబంతో సహా స్విట్జర్లాండ్ వెళ్లారు. అక్కడే నర్సింగ్ విద్య అభ్యసించారు. కొవిడ్ సమయంలో అత్యవసరమైన వైద్య సేవలు అందించారు. నర్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా హక్కుల కోసం పోరాటం చేశారు. ఆ నేపథ్యమే ఆమెను రాజకీయాల వైపు నడిపించింది. గ్రెంచెన్‌బర్గ్ మున్సిపల్ కౌన్సిలర్‌గా, సొంత రాష్ట్రం సోలోథర్న్ కౌన్సిల్ సభ్యురాలిగా... ఆ తరువాత స్విట్జర్లాండ్ పార్లమెంటు ఎంపీగా గెలిచారు. రాజకీయ నాయకురాలిగానే కాకుండా... ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యారు... స్విట్జర్లాండ్ ఎంపీ **ఫరా రూబీ**. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆమెతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

45 శాతం మేమే

'భారత్ సమ్మిట్' లక్ష్యం ఏంటి?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులన్నీ ఒక చోట చేరి... సమానత్వం, శాంతి, సౌభ్రాతృత్వం, న్యాయ సాధనల కోసం ఒక విధానం, ఒక కార్యాచరణ తయారు చేయడం.

నర్సింగ్ సేవల నుంచి రాజకీయాల వైపు పయనం ఎలా? ఎందుకని?

నర్సింగ్‌లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశా. మేముండే గ్రెంచెన్‌బెర్గ్‌లోనే పని చేసేదాన్ని. అయితే కొవిడ్‌లో భయంకర పరిస్థితులు చూడాల్సి వచ్చింది. ఆ మహమ్మారి అప్పటివరకు వైద్య రంగంలో ఉన్న అనేక లోపాలను బయటపెట్టింది. అయితే దాని ఫలితం అనుభవించింది మాత్రం సంరక్షణ సేవలు అందిస్తున్న నర్సులు, సహాయకులు, వైద్యులే. కొవిడ్‌లో నిరంతరాయంగా పని చేశాం. ఒకసారి 48 గంటలపాటు నిరంతరంగా సేవలు అందించాం. ఆ సమయంలో నాతో పని చేసే ఒకామె బోరున ఏడ్చింది. ఆ పరిస్థితుల్లో పని చేయడం అత్యంత అవసరం. కానీ అంత సుదీర్ఘ పని గంటలు మానసికంగా దెబ్బతీసేవి. అంతే కాకుండా అటు ప్రజలతో పాటు ఇటు సంరక్షకులుగా ఉన్న మాకూ రక్షణ లేకుండా పోయింది. అప్పటికి మా రాష్ట్ర నర్సింగ్ సంఘం ఉపాధ్యక్షురాలిగా ఉన్న నేను... సంరక్షకులకు కూడా రక్షణ ఉండాలనే ప్రచారం ప్రారంభించా. దీనికి ప్రజలు, రోగుల నుంచి కూడా మద్దతు లభించింది. ఈ ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. ఒక కార్మిక సంఘం పెట్టిన ప్రతిపాదన స్విట్జర్లాండ్‌లో తొలిసారి 61 శాతం ఓట్లతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలోనే నాకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన వచ్చింది. ఆ లక్ష్యంతోనే 'సోషల్ డెమొక్రటిక్ పార్టీ'లో చేరా. తొలుత మా గ్రెంచెన్‌బర్గ్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికయ్యా. ఆ తర్వాత సోలోథర్న్ కౌన్సిల్ సభ్యురాలిగా గెలిచా. అనంతరం స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువసభ సభ్యురాలిగా ఎన్నికయ్యా.

స్విట్జర్లాండ్‌లో పార్లమెంటు ఎన్నికల్లో ఖర్చు ఏ స్థాయిలో ఉంటుంది? మీకెంత ఖర్చయింది?

ఎన్నికల్లో డబ్బు అవసరం అనేది అంత ముఖ్యం కాదు. అయితే మా దేశంలోనూ డబ్బు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలవాలనుకునేవారు ఉన్నారు. కానీ డబ్బున్నవాళ్లు చాలామంది ఎన్నికల్లో గెలవలేదు. నేను కొన్ని వందల స్విస్ ఫ్రాంక్స్ మాత్రమే ఖర్చు చేశా. మా నియోజకవర్గాల్లో భారత్‌లోలా భారీ సంఖ్యలో ఓటర్లు ఉండరు. మాదేశ జనాభానే 89 లక్షలు. నా నియోజకవర్గ జనాభా 30 వేల మంది. అందులో ఓటర్లు ఇంకా తక్కువ మంది ఉంటారు. నా ఉద్దేశంలో రాజకీయాల్లో డబ్బుకు ఉన్న ప్రాముఖ్యత కొద్ది శాతమే. అదే సమయంలో రాజకీయాల్లో తెలివితేటలతో సంబంధం లేదు. స్మార్ట్‌గా మాత్రం ఉండాలి. స్విస్‌లో భారీ డబ్బు అవసరం లేదు. ఒక ఆలోచన కావాలి. దానిపై పని చేయాలి. మార్పు కోసం పోరాడాలి. నేను నర్సును. నర్సులు, వైద్యులం కొవిడ్‌లో ఏం కావాలో చూశాం. రాజకీయంగా చేసిందేమీ లేదు. మేం సేవ చేశాం. మార్పు కోసం ప్రయత్నించా. అనేక అంశాలపై మాట్లాడా. ప్రజలతో ఉన్నా. ఆ తర్వాత ఎంపీ అయ్యా.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సామాజిక, న్యాయ సవాళ్లు ఏంటి?

ప్రపంచ వ్యాప్తంగా రైట్ పార్టీలు ఎన్నికవడంతో సమస్యలు వస్తున్నాయి. భవిష్యత్తులోనూ ఇది సమస్యలకు దారి తీస్తుంది. ఇక మా దేశంలో ద్వేషం, తప్పుడు సమాచారం, లింగ సమానత్వం ప్రధాన సవాళ్లు. మాది బలమైన ప్రజాస్వామ్య దేశమే అయినా కొన్ని సమస్యలున్నాయి. భవిష్యత్తులో ఏమవుతుందో అన్న భయం కూడా ఉంది. అదే సమయంలో జీవన వ్యయం పెరిగిపోతోంది. మాది ధనిక దేశమే. కానీ పేద ప్రజలూ ఉన్నారు. అంతేకాదు... ఆసియా దేశాలతో పోలిస్తే ఎంతో ఉన్నతంగా స్విస్ ఉన్నా... మా దేశంలోనూ గత మూడు నెలల్లో 14 భ్రూణ హత్యలు జరిగాయి. ఆడపిల్లలను గర్భంలోనే చంపేశారు. అందుకే వచ్చే అక్టోబరులో మా దేశంలో లింగ సమానత్వంపై ఒక సదస్సు పెట్టాం.

సామాజిక న్యాయం సాధించేందుకు ఎలాంటి విధానాలు కావాలంటారు?

క్లిష్టమైన ప్రశ్నే. ప్రస్తుతం అనేక దేశాల మధ్య భారీ వాణిజ్య, స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాలు జరుగుతున్నాయి. మరోవైపు సుంకాల యుద్ధం కూడా జరుగుతోంది. కానీ ఈ వాణిజ్య, వ్యాపార ఒప్పందాలే కాదు... సామాజిక న్యాయం, లింగ సమానత్వం లాంటివి కూడా కావాలి. వీటి కోసం ప్రతి స్థాయిలో సంస్కరణలు కావాలి. మనం ఎలాంటి సమాజంలో జీవించాలని అనుకుంటున్నామనేది ముఖ్యం. దానికి అనుగుణంగా, అందులో అంతా ఉండేలా విధానాలు రూపొందించుకోవాలి. దానికి భారత్ సమ్మిట్‌లాంటివి ఉపకరిస్తాయి.

ప్రపంచ సంతోషకర దేశాల్లో స్విట్జర్లాండ్ మూడో స్థానంలో ఉంది? ఎలా?

మేం మా లక్ష్యం ఏంటో తెలుసుకుంటాం. దాని కోసమే పనిచేస్తాం. అదే సమయంలో ఆ లక్ష్యం సాధించేశాం అనుకుంటే... ఆ తర్వాత వెంటనే ఇంకా ప్రపంచ బాగుకోసం ఏం చేయాలి. మనిషి జీవితం బాగుండేందుకు ఇంకా ఏం చేయాలి అని ఆలోచిస్తాం. అయితే ఒత్తిడితో పని చేయం. ఇష్టంతోనే, ఇష్టమైన రంగంలోనే పని చేస్తాం. అదే బహుశా మా సంతోషానికి కారణాల్లో ఒకటి కావొచ్చు.

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిపై మీ స్పందనేంటి?

మనసును పిండేసే ఘటన. దుర్మార్గం. అంతా ఖండించాల్సిందే. చర్చలు, పరస్పరం మాట్లాడుకోవడం, అదే సమయంలో ఉగ్రవాదంపై పోరు చాలా ముఖ్యం. ఇలాంటి సమయంలో విడిపోవడం కాదు. దేశమంతా దీనికి వ్యతిరేకంగా నిలబడాలి. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం.

మీ దేశంలో మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు ఉన్నాయా?

స్విస్‌లో మహిళలకు మంచి ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రగతిశీలంగా ఉన్నాం. మహిళల విద్య చాలా ఎక్కువ. మేం చాలా ఇన్నోవేటివ్‌గా ఉంటాం. మా దేశానికి వలసలు ఎక్కువ. దేశ జనాభాలో 33 శాతం వలస వచ్చినవారే. అయితే స్విస్, విదేశీయులు అన్న తేడా అక్కడ ఉండదు. అందరికీ సమానావకాశాలే. ఇక మా దగ్గర రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లు లాంటివి లేవు. అయినా మొత్తం చట్టసభల సభ్యుల్లో 45 శాతం మంది మహిళలమే ఉన్నాం. మా దగ్గర రెండు సీట్లు ఉంటే ఒకటి మగ, ఒకటి ఆడ అన్నట్లుగానే అనుకుంటాం. అలాగని దానికి సంబంధించిన కచ్చితమైన నిబంధన ఏదీ లేదు. కానీ అది పూర్తిగా లాజిక్ కదా! సమానత్వం ఉండాలి కదా!

• ఉప్పులూరి మురళీకృష్ణ
హైదరాబాద్

వంటిల్లు



బూడిద గుమ్మడి కాయ... అనగానే మనకి కరకరలాడే వడియాలు, తీయని పేఠా గుర్తుకు వస్తాయి, దీనితో రకరకాల కూరలు, కమ్మని పులుసు కూడా చేసుకుంటూ ఉంటాం. ఇవి కాక బూడిద గుమ్మడికాయతో చేసే వెరైటీ వంటకాలు మీ కోసం...

బూడిద గుమ్మడితో భలే భలేగా...

మజ్జిగ పులుసు

కావాల్సిన పదార్థాలు

- పెరుగు- రెండు కప్పులు, బూడిద గుమ్మడికాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చి కొబ్బరి ముక్కలు- అర కప్పు, అల్లం ముక్కలు- రెండు చెంచాలు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పచ్చి మిర్చి- నాలుగు, శనగపిండి- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, ఇంగువ- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, నెయ్యి- ఒక చెంచా, మెంతులు- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, కొత్తిమీర తరుగు- ఒక చెంచా

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నె పెట్టి ధనియాలు, అర చెంచా జీలకర్ర, మిరియాలు వేసి రెండు నిమిషాలపాటు దోరగా వేయించాలి.
- మిక్సీలో కొబ్బరి ముక్కలు, అల్లం ముక్కలు, వేయించిన ధనియాలు-జీలకర్ర-మిరియాలు, పచ్చిమిర్చి, శనగపిండి వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని రెండు కప్పుల పెరుగు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో బూడిద గుమ్మడికాయ ముక్కలు వేసి రెండు గ్లాసుల నీళ్లు పోసి ఉడకనివ్వాలి. మెత్తగా ఉడికాక అందులో కొబ్బరి-శనగపిండి, పెరుగు మిశ్రమాన్ని పోసి ఉప్పు వేసి బాగా కలపాలి. మూడు పొంగులు రానిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నూనె, నెయ్యి వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, అర చెంచా జీలకర్ర, మెంతులు, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, పసుపు, కరివేపాకు వేసి వేగనివ్వాలి. ఈ తాలింపుని గుమ్మడికాయ ముక్కలు-పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. తరవాత కొత్తిమీర తరుగు చల్లాలి. ఈ బూడిద గుమ్మడికాయ మజ్జిగ పులుసు అన్నంలోకి రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- బూడిద గుమ్మడికాయ ముక్కలను మరీ పెద్దగా లేదా మరీ చిన్నగా కోయకూడదు.
- కొబ్బరి-శనగపిండి-పెరుగు మిశ్రమం కలిపిన తరవాత పులుసు చిక్కగా ఉందనిపిస్తే మరోగ్లాసు నీళ్లు పోసి చిన్న మంట మీద మరగించాలి.
- మజ్జిగ పులుసు చల్లారే కొద్దీ చిక్కగా అవుతుంది. కాబట్టి పలుచగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి.
- శనగపిండికి బదులు బియ్యప్పిండి లేదా కార్న్‌ఫ్లోర్ వాడుకోవచ్చు.

ఆవకాయ

కావాల్సిన పదార్థాలు

- బూడిద గుమ్మడికాయ ముక్కలు- మూడు కప్పులు, ఆవపిండి- అర కప్పు, కారం- అర కప్పు, ఉప్పు- పావు కప్పు, నిమ్మకాయలు- రెండు, ఉల్లిపాయ- ఒకటి, నూనె- అయిదు చెంచాలు, ఆవాలు- అర చెంచా, మెంతులు- అరచెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- చిటికెడు

తయారీ విధానం

- ఒక గిన్నెలో గుమ్మడికాయ ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి అరగంటసేపు ఉంచాలి. తరవాత ఈ ముక్కలను చేతిలోకి తీసుకుని గట్టిగా నీటిని పిండి వెడల్పాటి గిన్నెలోకి వేయాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఆవపిండి, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత ఇందులో నిమ్మరసం వేసి కలపాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఆవాలు, మెంతులు, ఇంగువ, పసుపు వేసి దోరగా వేపాలి. ఈ తాలింపును గుమ్మడికాయ ముక్కల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. దీని మీద మూతపెట్టి ఒక పూట ఊరనివ్వాలి. తరవాత ఒకసారి ఉప్పు, పులుపు సరి చూసుకోవాలి. ఈ ఆవకాయ వేడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.



జాగ్రత్తలు

- బూడిద గుమ్మడికాయను వీలైనంత చిన్న ముక్కలుగా తరిగితే ఆవకాయ రుచి బాగుంటుంది. గింజలు తీసివేయాలి. తొక్క తీయనవసరం లేదు.
- గుమ్మడికాయ ముక్కలనుంచి పిండిన నీటిలో కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగవచ్చు. ఇది ఆరోగ్యానికి మంచిది.
- ఈ ఆవకాయ నాలుగు రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. కాబట్టి కొద్ది పరిమాణంలో మాత్రమే తయారు చేసుకోవడం మంచిది.

బూడిద గుమ్మడికాయలో ఎ, బి, సి, ఇ విటమిన్లతోపాటు ఐరన్, సోడియం, పొటాషియం, కాల్షియం, జింక్ లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇందులో కొలెస్ట్రాల్ అసలు ఉండదు. దీనికి క్షార గుణం ఎక్కువ. అందుకే దీనిని ఆహారంగా తీసుకోవడం వల్ల కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బూడిద గుమ్మడికాయలో ఉండే పీచు పదార్థాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తాయి. వారానికి రెండు రోజులు దీనిని ఆహారంలో చేర్చుకుంటే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. దీనిలో అధిక శాతం నీరు ఉంటుంది కాబట్టి వేసవి తాపాన్ని హరిస్తుంది.

కూటు



కావాల్సిన పదార్థాలు

- బూడిద గుమ్మడికాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చి శనగపప్పు- పావు కప్పు, చింతపండు- కొద్దిగా, మినప్పప్పు- ఒక చెంచా, జీలకర్ర- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, ఇంగువ- చిటికెడు, ఎండు మిర్చి- అయిదు, మిరియాలు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, పచ్చి కొబ్బరి ముక్కలు- పావు కప్పు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో పచ్చి శనగపప్పు వేసి బాగా కడిగి నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. మరో గిన్నెలో చింతపండును కూడా నానబెట్టి రసం తీసి ఉంచుకోవాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో మినప్పప్పు, జీలకర్ర, ఎండు మిర్చి, మిరియాలు వేసి దోరగా వేపాలి. వీటిని మిక్సీ గిన్నెలో వేయాలి. అలాగే పచ్చి కొబ్బరి ముక్కలు కూడా వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, ఇంగువ, పసుపు, కరివేపాకు, నానబెట్టిన పచ్చి శనగపప్పు వేసి దోరగా వేపాలి. తరవాత బూడిద గుమ్మడికాయ ముక్కలు వేసి బాగా కలిపి మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి చింతపండు రసం పోసి ఉడికించాలి. పచ్చి శనగపప్పు, గుమ్మడికాయ ముక్కలు మెత్తగా ఉడికిన తరవాత ముందుగా గ్రైండ్ చేసుకున్న కొబ్బరి పేస్టు, ఉప్పు వేసి కలపాలి. మిశ్రమం మరీ చిక్కగా అనిపిస్తే అరగ్లాసు నీళ్లు పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. కూటు చపాతీ, పుల్కా, అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు


- పచ్చి శనగపప్పుకు బదులు కందిపప్పు లేదా పెసరపప్పు వేసుకోవచ్చు.
- ఈ కూటులో ఒక చెంచా నెయ్యి కలిపితే కమ్మగా ఉంటుంది.

ఆరోగ్యానికి కుసుమ ఆకుల మందు!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

కుసుమ మొక్కను సంస్కృతంలో 'కౌసుంభ' అని పిలుస్తారు. ఇది పొద్దు తిరుగుడు తరహాలో కనిపించే నూనె గింజల మొక్క. అయితే దీని అసలైన విశిష్టత గింజల్లో కన్నా ఆకుల్లో ఎక్కువ కనిపిస్తుంది. కూరలుగా వండుకునేందుకు, ఔషధంగా వినియోగించేందుకు ఇవి శక్తివంతమైనవి. మిగతా నూనె గింజల మొక్కల ఆకులకు వండుకుతినే అవకాశం లేదు. భోజన కుతూహలం గ్రంథంలో ఈ మొక్క ఆకుల్ని, పూలని, నూనెని కూడా ఆహార పదార్థాలుగా వండుకునే విధానాల్ని విడివిడిగా వివరించారు. కుసుమ ఆకులు కొంచెం తీపి, కారం రుచుల్ని కలిగి ఉంటాయి. వీటి వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం...

- కీళ్ల నొప్పులు వంటి వాతవ్యాధులకు కుసుమ ఆకులు ఉపశమనాన్ని కలిగిస్తాయి. వీటిలోని వేడి లక్షణం శరీరంలోకి కండరాలకు మేలు చేస్తుంది. ఈ ఆకులను తగిన మోతాదులో వాడితే నొప్పుల తీవ్రత తగ్గుతుంది.



జాగ్రత్తలు

కుసుమ ఆకులను ఎక్కువగా తినకూడదు. ఇవి ఎక్కువగా తింటే శరీరంలో ఆమ్లతత్వం పెరుగుతుంది. అలర్జీలు వచ్చే అవకాశం కూడా ఉంది.

- అతి వేడి కారణంగా మూత్ర విసర్జనలో కలిగే మంట, నొప్పులను ఈ ఆకులు తగ్గిస్తాయి. కుసుమ ఆకులతో చేసిన టీ మూత్రం సులభంగా వెళ్ళిపోవడాన్ని ప్రేరేపిస్తుంది.
- వాపులపైన ఆకులను నూరి కట్టు వేస్తే ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా కీళ్ల వాపు, వాత సంబంధిత రుగ్మతలలో ఇది చాలా ఉపయోగపడుతుంది.
- కుసుమ ఆకులకు కఫహర గుణం ఉంది. . బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల్లో ఇవి ఉపశమనం ఇస్తాయి. దగ్గు, ఉబ్బసం వంటి లక్షణాల నివారణకు కూడా ప్రయోజనకరం.
- 'భావప్రకాశ' గ్రంథం ప్రకారం ఈ ఆకులు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. కండరాల కదిలికలను వేగవంతం చేస్తాయి.
- కుసుమ ఆకుల్లో ఫ్లావనాయిడ్లు, ఫినాలిక్ యాసిడ్లు, ల్యూటెయోలిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తాన్ని శుద్ధి చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, గుండె జబ్బుల నివారణలో కూడా ఈ ఆకులు కీలక పాత్ర పోషిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. కుసుమ ఆకులు రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.

• గంగరాజు అరుణాదేవి

తన కోసమే...



నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేశ్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. మిక్కీ జె మేయర్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ ఆలపించారు.

జార్జియాలో లొకేషన్ల అన్వేషణ





నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎమ్. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా, ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ జార్జియాలో జరగనుంది. దర్శకుడు బోయపాటి శ్రీను ప్రస్తుతం అక్కడ అందమైన లొకేషన్ల వేటలో ఉన్నారు. ఈ క్రమంలోనే బోయపాటి తన పుట్టినరోజును జార్జియాలో జరుపుకున్నారు. బాలకృష్ణ, ఇతర ప్రముఖ నటులు పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలను అక్కడ చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి థమన్ స్వరాలు సమకూర్చుతున్నారు. సినిమాటోగ్రాఫర్ సి.రామ్‌ప్రసాద్, ఎడిటర్ తమ్మిరాజు.

ఆరు రోజులు ముందుగానే...!



యాక్షన్ చిత్రాలను అభిమానించే ప్రేక్షకులను అలరించడానికి హాలీవుడ్ నటుడు టామ్ క్రూస్ నటించిన 'మిషన్ ఇంపాజిబుల్' సిరీస్‌లో భాగమైన 'ద ఫైనల్ రెకనింగ్' చిత్రం వారంలో రోజులు ముందుగానే మన దేశంలో విడుదల కానుంది. ఈ సినిమాను వచ్చే నెల 23న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ మొదట ప్రకటించింది. ఇండియాలో ఆరు రోజుల ముందే విడుదల చేస్తున్నట్లు పారామౌంట్ సంస్థ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. మనదేశంలో ఆంగ్ల వెర్షన్‌తో పాటు తెలుగు, తమిళ, హిందీ వెర్షన్స్‌లో కూడా రిలీజ్ చేస్తున్నారు. 'ద ఫైనల్ రెకనింగ్' చిత్రం 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంఛైజీల్లో ఎనిమిదోది.

'సింగిల్'గా వస్తున్నాడు



శ్రీవిష్ణు హీరోగా, కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సింగిల్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్ చేశారు. వీడియోలో హీరో విష్ణు మే 9న విడుదలైన సూపర్ హిట్ మూవీస్ గురించి చెబుతుండగా చివర్లో నిర్మాత అల్లు అరవింద్ ప్రవేశించారు. జైలర్ హుకుం స్టయిల్‌లో మే 9న రిలీజ్ డేట్‌ని అల్లు అరవింద్ లాక్ చేయడం ఆసక్తిగా అనిపించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ముక్కు రాజు విగ్రహావిష్కరణ



హైదరాబాద్‌లో ఫిల్మ్ ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి చేసి, ఆరంభంలో డ్యాన్సర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన నృత్య దర్శకుడు ముక్కు రాజు విగ్రహాన్ని నటుడు ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. డ్యాన్సర్స్ యూనియన్ ఏర్పాటై 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, భరత్ భూషణ్, వల్లభనేని అనిల్, వీరశంకర్, దామోదర ప్రసాద్, టీఎఫ్‌టీడీడీ అధ్యక్షుడు జోసెఫ్ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలియుగంలో పోరాటం



శ్రద్ధా శ్రీనాథ్ లీడ్‌రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కలియుగం 2064'. కిశోర్ కీలకపాత్ర పోషించారు. ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో కేఎస్ రామకృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'కలియుగమ్ 2064' చిత్రాన్ని మే 9న తెలుగు తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ '2064లో వచ్చే విపత్కర పరిస్థితుల్లో మానవజాతి మనుగడ కోసం చేసిన పోరాటం నేపథ్యంలో కథ సాగుతుంది' అని అన్నారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోందని నిర్మాత తెలిపారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానం ఎంఐఎందే

38 ఓట్ల తేడాతో మజ్లిస్ అభ్యర్థి ఎఫెండీ విజయం.. బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం ఘనవిజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ.. బీజేపీ అభ్యర్థి ఎన్.గౌతమ్ రావుపై 38 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 112 ఓట్లకు ఎంఐఎం, బీజేపీ, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సంబంధించిన 88 ఓట్లు మాత్రమేపోలయ్యాయి. ఇందులో ఎంఐఎం అభ్యర్థికి 63 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థికి 25 ఓట్లు దక్కాయి. 24 మంది ఓటర్లున్న బీఆర్ఎస్ పోలింగ్‌కు దూరంగా ఉంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏజెంట్ల సమక్షంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించగా.. 40 నిమిషాల్లోనే లెక్కింపు ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకున్న అనంతరం ఎఫెండీ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. అనంతరం ఆయనకు డిక్లరేషన్ సర్టిఫికెట్ అందజేశారు.



హసన్ ఎఫెండీ

ప్రజా సమస్యలపై పోరాడతా: ఎఫెండీ

ఎమ్మెల్సీగా ఎన్నికవడం పట్ల మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడతానన్నారు. ప్రధానంగా పాతబస్తీకి ప్రత్యేక నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో.. తన గెలుపుపై సంబురాలు జరుపుకోవడం లేదన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రం తీసుకుని పార్టీ కార్యకర్తలతో కలిసి ఎఫెండీ నేరుగా శాస్త్రీపురంలోని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ నివాసానికి వెళ్లారు. ఎఫెండీని ఒవైసీ ఆలింగనం చేసుకుని అభినందించారు. కాగా, ఎఫెండీ శాసనమండలికి ఎన్నిక కావడం ఇది రెండోసారి. తొలిసారి ఆయన 2019లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలి: బీజేపీ

ఎమ్మెల్సీ ఎన్నికలో కార్పొరేటర్లు ఓట్లు వేయకుండా అడ్డుకున్న బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలంటూ ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. ఒక రాజకీయ పార్టీ ఎన్నికలను బహిష్కరించాలనడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్.గౌతమ్‌రావు.. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు తదితరులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ పోటీ చేయకపోవడంతో ఆ పార్టీకి చెందిన పలువురు ఓటర్లు తమ అభ్యర్థి గౌతమ్‌రావుకు మద్దతు పలికేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని బీజేపీ నేతలు సీఈవోకు వివరించారు. అయితే ఆ పార్టీ నాయకత్వం బెదిరింపులకు భయపడి వారు ఓటు వేసేందుకు రాలేదని తెలిపారు. కాగా, ఈ ఎన్నికల్లో నైతిక విజయం తనదేనని గౌతమ్‌రావు మీడియాతో అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల పేర్లు వేర్వేరుగా ఉన్నా.. అంతర్గతంగా అవి ఒకే పార్టీలా వ్యవహరిస్తున్నాయని బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్ ఆరోపించారు.

ఎండ.. వడగాలి.. వాన

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 42-45.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు

- వడదెబ్బకు ఐదుగురి మృతి
- పలు జిల్లాల్లో వర్ష బీభత్సం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎండ, ఆ తర్వాత వడగాలులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇల్లు కదలలేని పరిస్థితులు ఉండగా ఆ తర్వాత ఈదురుగాలులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా సూరీడు నిప్పులు కురిపించాడు. అన్ని జిల్లాల్లోనూ సగటున 42-44.5 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. నిర్మల్ జిల్లా తనూరు, నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్‌లో 45.3, ఆదిలాబాద్ జిల్లా బేలలో 45.2, మంచిర్యాల జిల్లా భీమినిలో 45.1, ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరిలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 42డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది.ఇక, వడదెబ్బ వల్ల శుక్రవారం రాష్ట్రంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జగిత్యాలకు చెందిన గొల్లపెల్లి శ్రీనివాస్(38) రెండ్రోజుల క్రితం అస్వస్థతకు గురై శుక్రవారం మరణించాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన వొల్లాల వెంకన్న(55), ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడేనికి చెందిన బయ్యారపు దర్గయ్య(70) కూడా వడదెబ్బ వల్ల ప్రాణాలు కోల్పోయారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన చింతకింది హన్మయ్య(60) చేర్యాల వ్యవసాయ మార్కెట్‌లో వడదెబ్బకు గురై మరణించాడు. నిజామాబాద్ జిల్లాలోని బాగేపల్లికి చెందిన పినిగిరి పెద్ద మల్లుగొండ అనే గొర్రెల కాపరి వడదెబ్బ వల్ల శుక్రవారం మరణించాడు. వికారాబాద్ జిల్లాలో ఉదయం నుంచి ఎండలు దంచికొట్టగా సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. మర్పల్లి, పట్లూర్, పంచలింగాల్, కొత్తాపూర్, తుమ్మలపల్లి, మొగిలిగుండ్ల మండలాల్లో పంటనష్టం వాటిల్లింది. తాండూరు మండలం అంతారం శివారులోని రైతు వేదిక వద్ద ఉన్న ఎడ్ల బండి ప్రతిమ నేలకూలింది. కాగా, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో శని, ఆదివారాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గంటకు 30-40కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

కర్రెగుట్టలపై కాల్పుల మోత!

- డ్రోన్లతో అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్న బలగాలు
- సమీపంలోని గ్రామాల వద్దకు మూడు రాష్ట్రాల మీడియా
- అనుమతి లేనందున.. వెనక్కి వెళ్లాలని బలగాల ఆదేశం
- శాంతిచర్చలకు ముందుకు రావాలని మావోయిస్టుల లేఖ
- కేంద్ర బలగాల కూంబింగ్ నిలిపివేయాలని డిమాండ్

చర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో దాక్కున్న మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర బలగాలు దాడులను ముమ్మరం చేశాయి. డ్రోన్ల ద్వారా మావోయిస్టులు ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్న బలగాలు..ఆ వెంటనే హెలికాప్టర్‌ను మోహరించి కాల్పులు జరుపుతున్నాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను తెలుసుకునేందుకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రాష్ట్రాలకు చెందిన మీడియా బృందం శుక్రవారం కర్రె గుట్టల ప్రాంతానికి చేరుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బీమారం, చిన్నఉట్లపల్లి, కస్తూరిపాడు గ్రామాల్లోని గిరిజనులతో మాట్లాడి.. అక్కడి పరిణామాలపై చర్చించింది. మీడియాను చూసి అక్కడి గిరిజనులు చాలాసేపు మాట్లాడలేదు. అనంతరం ఒక్కొక్కరు మాట కలిపారు. ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పోలీసులు హెచ్చరించారని, మూడు రోజులుగా ఉదయం, మధ్యాహ్నం సమయంలో హెలికాప్టర్ వచ్చి కాల్పులు జరుపుతోందని పేర్కొన్నారు. తాము కూలి పనులకు కూడా వెళ్లడం లేదని చెప్పారు. వారితో మీడియా ప్రతినిధులు మాట్లాడుతుండగానే మరో సారి భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. గుట్టలపై హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. అక్కడి నుంచి కొంచెం దూరం ముందుకు వెళ్లగా.. మీడియాకు అనుమతి లేదని, వెళ్లిపోవాలని అక్కడ ఉన్న బలగాలు ఆదేశించాయి. కాగా, కర్రెగుట్టల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, శుక్రవారం కూడా ఆ మృతదేహాలను మీడియాకు చూపించలేదు.

లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని మావోయిస్టు పార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేష్ పేరుతో లేఖ విడుదలైంది. శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యే వాతావరణాన్ని కల్పించాలని, వెంటనే కర్రెగుట్టలపై కేంద్ర బలగాల దాడులను నిలిపి వేయాలని ఆ లేఖలో కోరారు.

వడదెబ్బతో జవాన్లకు అస్వస్థత

భద్రాచలం: అడవిలో ఎండ వేడి, రాతి గుట్టల్లో ఉక్కపోత కారణంగా కూంబింగ్‌లో పాల్గొంటున్న బలగాలు అస్వస్థతకు గురవుతున్నాయి. గురువారం 15మంది జవాన్లు వడదెబ్బతో అస్వస్థతకు గురికాగా, హెలికాప్టర్‌లో వెంకటాపురానికి తీసుకువెళ్లారు. తొలుత వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలలో వారికి చికిత్స అందించారు. వీరిలో ముగ్గురు తీవ్ర డీహైడ్రేషన్ బారిన పడడంతో అత్యవసర చికిత్స నిమిత్తం అర్ధరాత్రి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స తర్వాత వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది

ఉద్యోగుల సమస్యలను పట్టించుకోరా?

- సమస్యలు.. మ్యానిఫెస్టోలకే పరిమితమా?
- జూన్ 9న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలకే పరిమితం అవుతున్నాయని, అధికారంలోకి వచ్చాక పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో శుక్రవారం రాత్రి సకల ఉద్యోగులు, సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగ సదస్సు నిర్వహించారు. సదస్సులో, అంతకుముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం మొదట్లోనే సెంబర్ స్టేట్మెంట్ పంపే ముందు ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను మినహాయించి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం బాగుంటేనే ఉద్యోగులు ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయడంలో చురుగ్గా పాల్గొంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలైనా ఇప్పటికీ మంత్రుల పేషీల్లో ఉద్యోగ సంఘ నాయకులని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టారన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా 13.50 లక్షల మంది ఉద్యోగులను ఐక్యం చేసి జూన్ 9న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. మే 4న ఉద్యోగుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అలవెన్సుల చెల్లింపు, బకాయిలతో సహా 5 డీఏల చెల్లింపు విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉపసంఘం జేఏసీ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

బిజినెస్

వరంగల్ ● శనివారం 26 ఏప్రిల్ 2025

దేశీయ అణు విద్యుత్ ప్లాంట్లలోకి 49 శాతం విదేశీ పెట్టుబడులు!

- అనుమతించే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: దేశ అణు విద్యుత్ రంగంలోకి విదేశీ సంస్థలకు గేట్లు తెరిచేందుకు భారత ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయ అణు విద్యుదుత్పత్తి ప్లాం ట్లలో విదేశీ సంస్థలు 49 శాతం వరకు వాటాలను కొనుగో లు చేసేందుకు అనుమతించే అవకాశం ఉందని ముగ్గురు ప్రభుత్వ ఉన్నతాధికారులు వెల్లడించినట్లు రాయిటర్స్ వార్తా కథనం వెల్లడించింది. విదేశీ పెట్టుబడులు ఈ రంగానికి ఊతమివ్వడంతో పాటు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దేశీయ అణురంగంలో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను సడలించాలని ప్రభుత్వం 2023 నుంచే ప్రయత్నాలు చేస్తోంది. కాలుష్యకారక బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తికి ప్రత్యామ్నాయంగా శుద్ధ ఇంధన ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వం కొంతకాలంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాలనుకుంటోంది. కానీ, ఇందుకు పెద్దఎత్తున పెట్టుబడులు అవసరం. విదేశీ సంస్థలను అనుమతించడం ద్వారానే ఇది సాధ్యమని కేంద్రం భావిస్తోంది. 2047 నాటికి దేశీయ అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 100 గిగావాట్ల స్థాయికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ @ రూ.10 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ స్థూల ఆదాయమిది.. ఈ ఘనత సాధించిన తొలి కంపెనీ

- క్యూ4 లాభం రూ.19,407 కోట్లు
- రెవెన్యూ రూ.2.64 లక్షల కోట్లు
- ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్
- రూ.25,000 కోట్ల సమీకరణ



ముంబై: దేశీయ ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం రూ.19,407 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.14.34) చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.18,951 కోట్ల (ఒక్కో షేరుకు రూ.14) లాభంతో పోలిస్తే 2.4 శాతం పెరిగింది. 2024-25లోనే డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఆర్జించిన రూ.18,540 కోట్ల లాభంతో పోల్చినా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది.

ఆయిల్ అండ్ కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనంగానే ఉన్నప్పటికీ రిలయన్స్ జియో, రిటైల్ వ్యాపారాల్లో జోరు లాభం వృద్ధికి దోహదపడింది. కాగా, క్యూ4లో ఆర్ఐఎల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన దాదాపు 10 శాతం వృద్ధి చెంది రూ.2,64,573 కోట్లకు పెరిగింది. ఎబిటా 3.6 శాతం పెరుగుదలతో రూ.48,737 కోట్లుగా నమోదైంది.

గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి ఆర్ఐఎల్ లాభం 2.9 శాతం పెరిగి రూ.81,309 కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.1 శాతం వృద్ధి చెంది రూ.10.71 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.10 లక్షలకు పైగా నెట్‌వర్త్ సాధించిన తొలి కంపెనీ రిలయన్సే. గత ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్‌ను ప్రకటించింది. అలాగే, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.25,000 కోట్ల సమీకరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వెల్లడించింది.

జియో ప్లాట్‌ఫామ్స్: టెలికాం సంస్థ రిలయన్స్ జియోతో పాటు ఇతర డిజిటల్ వ్యాపారాలను ఒకే గొడుగు కిందికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ క్యూ4 లాభం 26 శాతం వృద్ధితో రూ.7,022 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.26,120 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ మార్చి 31 నాటికి రిలయన్స్ జియో కస్టమర్లు 48.82 కోట్లకు చేరగా.. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) రూ.206.2కు పెరిగింది.

రిలయన్స్ రిటైల్: ఈ మార్చి త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ లాభం 29 శాతం పెరిగి రూ.3,545 కోట్లకు చేరింది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా 238 స్టోర్లను ప్రారంభించినట్లు, మొత్తం స్టోర్ల సంఖ్య 19,340కి చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఓ2సీ: క్యూ4లో ఓ2సీ విభాగ ఆదాయం 15.4 శాతం వృద్ధితో రూ.1,64,613 కోట్లకు పెరిగినప్పటికీ, ఎబిటా మాత్రం 10 శాతం తగ్గి రూ.15,080 కోట్లకు పడిపోయింది. ముడి చమురు శుద్ధి, పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడం ఇందుకు కారణమైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఓ2సీ ఆదాయం 11 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు స్థాయి రూ.6,26,921 కోట్లకు చేరింది.

ఆయిల్ అండ్ గ్యాస్: మార్చి త్రైమాసికంలో ఈ విభాగ ఆదాయం 0.4 శాతం తగ్గి రూ.6,440 కోట్లకు, ఎబిటా 8.6 శాతం క్షీణించి రూ.5,123 కోట్లకు పరిమితమైంది. వార్షికాదాయం రూ.25,211 కోట్లు, ఎబిటా రూ.21,188 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో కేజీ డీ6 బ్లాక్ నుంచి రోజుకు 26.73 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువును, 19 వేల పీపాల చమురును ఉత్పత్తి చేసినట్లు కంపెనీ తెలిపింది.

జియోస్టార్: డిస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ యాప్‌ల విలీనం ద్వారా ఏర్పాటు చేసిన జియోస్టార్ ఆదాయం క్యూ4లో రూ.10,006 కోట్లుగా, ఎబిటా రూ.774 కోట్లుగా నమోదైంది. జియోస్టార్ దేశంలో అతిపెద్ద ఓటీటీ వేదికగా అవతరించిందని, దీన్ని విడుదల చేసిన ఐదు వారాల్లోనే పెయిడ్ చందాదారుల సంఖ్య 10 కోట్లు దాటిందని రిలయన్స్ తెలిపింది.

మారుతి సుజుకీ లాభం రూ.3,911 కోట్లు

ఒక్కో షేరుకు రూ. 135 డివిడెండ్

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) కన్సాలిడేటెడ్ నికర లాభం 1 శాతం క్షీణించి రూ.3,911 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.3,952 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో వ్యయాలు గణనీయంగా పెరగటం పనితీరును దెబ్బతీసిందని తెలిపింది. మార్చి త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.38,471 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు కూడా 8.5 శాతం పెరుగుదలతో రూ.34,624 కోట్లుగా నమోదైనట్లు మారుతి సుజుకీ తెలిపింది.

స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ నికర లాభం రూ.3,878 కోట్ల నుంచి రూ.3,711 కోట్లకు తగ్గగా నికర ఆదాయం రూ.36,697 కోట్ల నుంచి రూ.38,849 కోట్లకు పెరిగింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1,52,913 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.14,500 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కాగా గడచిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రతి షేరుకు రూ.135 డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

ఎల్ఐసీ హౌసింగ్ వడ్డీ రేట్లు తగ్గింపు

న్యూఢిల్లీ: ఎల్ఐసీ అనుబంధ సంస్థ ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తన గృహ రుణాల కనీస వడ్డీ రేట్లను 8.25 శాతం నుంచి 8 శాతానికి తగ్గించింది. ఈ నెల 28 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపింది. ఆర్‌బీఐ ఇటీవల కీలక రెపో వడ్డీ రేటును పావు శాతం తగ్గించింది. అందులో భాగంగానే ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తన గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది.

వార్ వర్రీస్!

- భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు..
- సెన్సెక్స్ ఒకదశలో 1,196 పాయింట్లు డౌన్
- చివరికి 589 పాయింట్ల నష్టంతో సరి
- 2 రోజుల్లో రూ.8.88 లక్షల కోట్ల నష్టం



ముంబై: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై తీవ్రవాదుల దాడి అనంతరం భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇది రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీయవచ్చన్న భయాలు శుక్రవారం మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో సూచీ 1,195.62 పాయింట్లు (1.49 శాతం) క్షీణించి 78,605.81 వద్దకు జారుకుంది. చివరికి 588.90 పాయింట్లు (0.74 శాతం) నష్టంతో 79,212.53 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 207.35 పాయింట్లు (0.86 శాతం) పతనమై 24,039.35 వద్ద ముగిసింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 903.96 పాయింట్లు (1.12 శాతం) కోల్పోయింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8.88 లక్షల కోట్లు తగ్గి రూ.421.58 లక్షల కోట్లకు (4.93 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

● ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు తగ్గి రూ.85.41 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒక దశలో 0.66 శాతం తగ్గి 66.11 డాలర్లకు దిగివచ్చింది.

పబ్లిక్ ఇష్యూకు కెనరా రొబెకో ఏఎంసీ

కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా ప్రమోటర్లకు చెందిన 4.98 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రమోటర్లైన కెనరా బ్యాంక్ 2.59 కోట్ల షేర్లు, ఓరిక్స్ కార్పొరేషన్ యూరప్ (గతంలో రొబెకో గ్రూప్) 2.39 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. కెనరా రొబెకో ఏఎంసీలో కెనరా బ్యాంక్ 51 శాతం, ఓరిక్స్ కార్పొరేషన్ 49 శాతం వాటా కలిగి ఉన్నాయి.

ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ రూ.2,700 కోట్ల ఐపీఓ

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అనుబంధ విభాగమైన ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్ లిమిటెడ్ కూడా ఐపీఓకు రాబోతోంది. ఐపీఓ ద్వారా రూ.2,700 కోట్లు సేకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. అందులో రూ.1,700 కోట్ల తాజా ఈక్విటీ జారీ ద్వారా, మరో రూ.1,000 కోట్లు ప్రమోటరైన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వాటా విక్రయం ద్వారా సమీకరించనున్నట్లు సంస్థ తెలిపింది.

ఒలెక్ట్రా నుంచి 'జీఎఫ్ఆర్‌పీ రీబార్స్'

- స్టీల్ కంటే రెండింతల ధృడత్వం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ మరో వినూత్న ఉత్పత్తిని అభివృద్ధి చేసింది. నిర్మాణ రంగానికి అవసరమైన జీఎఫ్ఆర్‌పీ రీబార్స్‌ను (గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ రీబార్) అభివృద్ధి చేసింది. సంప్రదాయ స్టీల్ రీఇన్‌ఫోర్స్‌మెంట్‌తో పోలిస్తే ఈ బార్స్ రెండింతల ధృడత్వం, నాలుగింతలు తేలికగా ఉంటాయని తెలిపింది. ఎంఈఐఎల్ బడ్జెట్ మీట్ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణా రెడ్డి ఈ బార్స్‌ను విడుదల చేశారు. ఈసీఆర్ గ్లాస్, ఇపోక్సీ రెజిన్‌లతో ఈ జీఎఫ్ఆర్‌పీ రీబార్స్‌ను కంపెనీ అభివృద్ధి చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ తుప్పుపట్టక పోవడం, విద్యుత్ ప్రసరించకపోవడం, అయస్కాంత ప్రభావానికి లోనుకాక పోవడం, నీటిలో తడిచినా పాడుకాకపోవడం ఈ బార్స్ ప్రత్యేకతలు.

బీఓఎం లాభంలో 23% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం).. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో రూ.1,493 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.1,218 కోట్లు)తో పోల్చితే లాభం 23 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసిక కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.6,488 కోట్ల నుంచి రూ.7,711 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు 1.74 శాతం, నికర ఎన్‌పీఏలు 0.18 శాతంగా ఉన్నాయి.

జనవరి 28 నుంచి వింగ్స్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరోసారి వింగ్స్ ఇండియా వైమానిక ప్రదర్శనకు వేదికవుతోంది. వింగ్స్ ఇండియా- 2026 పేరుతో వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ఈ ప్రదర్శన జరగనుంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, భారతీయ విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ), ఫిక్కీ సంయుక్తంగా రెండేళ్లకు ఒకసారి హైదరాబాద్‌లో ఈ ప్రదర్శన నిర్వహిస్తూ వస్తున్నాయి.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.22.26 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు దాదాపుగా నిర్ణీత లక్ష్యాన్ని చేరాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి నికరంగా రూ.22.37 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రూ.22.26 లక్షల కోట్లు వసూలు చేయడం ద్వారా 99.51 శాతం లక్ష్యాన్ని సాధించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 13.57 శాతం ఎక్కువ. అయితే ఇది తాత్కాలిక అంచనా మాత్రమేనని, ఇంకా పూర్తి రిఫండ్ వివరాలు అందాల్సి ఉందని ప్రభుత్వం తెలిపింది. ఈ తాత్కాలిక అంచనాల ప్రకారం చూసినా 2024-25లో ఆదాయ పన్ను శాఖ గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.4,76,743 కోట్ల రిఫండ్స్ జారీ చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	425
వరంగల్	407	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	115
కరీంనగర్	120	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	90
కర్నూలు	120	నెల్లూరు	95
విశాఖపట్నం	111	అనంతపురం	95
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,200 ▼	90,000 ▼	1,10,900 ▼
విజయవాడ	98,600 ▼	93,500 ▼	99,000 ▼
విశాఖపట్నం	98,240 ▼	90,050 ▼	1,10,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,500 ▼
ప్రొద్దుటూరు	97,600 ▲	89,880 ▲	1,00,000 ▲
ముంబై	95,631 ▼	87,598 ▼	97,684 ▲

అమ్మపైనా విమర్శలా?

- పహల్గాం దాడికి ముందే పాక్ అథ్లెట్‌కు ఆహ్వానం
- నీరజ్ చోప్రా ఆవేదన



న్యూఢిల్లీ : 'నీరజ్ చోప్రా క్లాసిక్' పేరిట వచ్చే నెల 24న బెంగళూరులో అంతర్జాతీయ జావెలిన్ త్రో పోటీ జరగనుంది. భారత స్టార్ నీరజ్ చోప్రా స్వయంగా నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో ప్రఖ్యాత అంతర్జాతీయ జావెలిన్ త్రోయర్లు బరిలోకి దిగుతున్నారు. ఈ పోటీకి పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్‌ను నీరజ్ ఆహ్వానించాడు. దీంతో తన కుటుంబంపై వ్యక్తిగత దూషణకు దిగడంపట్ల నీరజ్ ఆవేదన వ్యక్తంజేశాడు. ఈమేరకు శుక్రవారం అతడు ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. 'అర్షద్‌ను ఆహ్వానించడంపై నాపై ఎన్నో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో నా కుటుంబాన్నీ వదలడం లేదు. అసభ్య పదజాలంతో నిందిస్తున్నారు. టెర్రరిస్టుల దాడికి రెండు రోజుల ముందే అథ్లెట్లందరికీ ఆహ్వానాలు పంపాం. 48 గంటల్లో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. నా తల్లిని కూడా లక్ష్యంగా చేసుకొని విమర్శించడం ఎంతో బాధిస్తోంది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో అర్షద్ పసిడి పతకం గెలిచినప్పుడు..అతడు కూడా నా కొడుకులాంటివాడేనని అమ్మ చెప్పింది. అప్పట్లో అమ్మపై అంతా ప్రశంసలు కురిపించారు. కానీ సంవత్సరంలో ఎంత తేడా ! ప్రజలు అంత త్వరగా తమ అభిప్రాయాల్ని ఎలా మార్చుకుంటారో అర్థం కావడంలేదు. కారణం లేకుండా నన్ను, నా కుటుంబాన్ని తిడుతున్న వారికి వివరణ ఇవ్వాల్సి రావడం విచారకరం' అని ఆర్మీలో పని చేస్తున్న నీరజ్ వాపోయాడు.

ఆసియా అథ్లెటిక్స్ భారత జట్టులో ముగ్గురు తెలుగోళ్లు



జ్యోతి నందిని నిత్య

న్యూఢిల్లీ : ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. 59 మంది బృందంలో ముగ్గురు తెలుగు అథ్లెట్లకు చోటు లభించింది. వచ్చేనెల 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియాలోని గుమిలో పోటీలు జరగనున్నాయి. అయితే పలు అంతర్జాతీయ పోటీలపై దృష్టి సారించడంతో స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ పోటీల్లో పాల్గొనడంలేదు. తెలుగు అథ్లెట్లలో నిత్య గంధే (200 మీ. పరుగు, 4x100 మీ. రిలే), జ్యోతి యర్రాజీ (100 మీ. హర్డిల్స్), నందిని అగసార (హెప్టాథ్లాన్) పోటీపడనున్నారు. అవినాష్ సబ్లే (3వేల మీ. స్టీపుల్ చేజ్), తేజస్వీన్ శంకర్ (డెకాథ్లాన్), ప్రవీణ్ చిత్రవేల్, అబూబాకర్ (ట్రిపుల్ జంప్), అన్నూరాణి (జావెలిన్‌త్రో), పారుల్ చౌదరి (3వేల మీ. స్టీపుల్ చేజ్, 5వేల మీ. పరుగు) తదితర స్టార్లు జట్టులో ఉన్నారు.

కమిందు ఆల్‌రౌండ్‌షో



కమిందు మెండిస్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టాడు. చెన్నై ఇన్నింగ్స్‌లో భారీ షాట్లతో దూసుకెళుతున్న బ్రెవిస్ అతడి సూపర్ క్యాచ్‌తోనే వెనుదిరిగాడు. గోల్‌కీపర్ బంతిని అందుకునే తరహాలో కమిందు 11.09 మీటర్ల దూరం పరిగెత్తి తన ఎడమవైపునకు సమాంతరంగా డైవ్ చేస్తూ ఆ క్యాచ్‌ను పట్టేయడం హైలైట్‌గా నిలిచింది. ఇక బ్యాటింగ్‌లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చివరి దాకా నిలిచి విజయాన్ని అందించాడు. అలాగే బౌలింగ్‌లో జడేజా వికెట్ పడగొట్టాడు.

రైజర్స్ రేసులోనే..



హర్షల్ పటేల్ (4-0-28-4)

- ఆదుకున్న ఇషాన్, కమిందు
- చెన్నై ఆశలు గల్లంతే..
- హర్షల్‌కు నాలుగు వికెట్లు

1 చెపాక్‌లో తొలిసారి చెన్నైని ఓడించిన సన్‌రైజర్స్

కెరీర్‌లో 400 టీ20 మ్యాచ్‌లాడిన నాలుగో భారత ఆటగాడిగా ధోనీ. రోహిత్ (456), దినేశ్ కార్తీక్ (412), విరాట్ (408) ముందున్నారు.

4 ఐపీఎల్‌లో ఇన్నింగ్స్ తొలి బంతికే వికెట్ తీయడం షమికిది నాలుగోసారి.

చెన్నై: ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇరు జట్లదీ కచ్చితంగా గెలిచి తీరాల్సిన పరిస్థితి. ఈ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కాస్త తడబడినా కీలక విజయం అందుకుంది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 44), కమిందు మెండిస్ (22 బంతుల్లో 3 ఫోర్లతో 32 నాటౌట్) సమయోచిత బ్యాటింగ్‌తో 5 వికెట్ల తేడాతో గట్టెక్కించారు. అటు సొంత మైదానంలోనూ చెన్నై సూపర్ కింగ్స్ మరోసారి చేతులెత్తేసింది. బౌలర్లు కాస్త ఆశలు రేపినా.. చివర్లో తడబాటుతో చెపాక్‌లో వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. దీంతో ధోనీ సేన మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లో గెలిచినా ప్లేఆఫ్స్ బెర్త్ కష్టమే. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌటైంది. బ్రెవిస్ (25 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 42), ఆయుష్ మాత్రే (19 బంతుల్లో 6 ఫోర్లతో 30), దీపక్ హుడా (21 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 22) రాణించారు. హర్షల్‌కు 4, కమిన్స్, ఉనాద్కట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 5 వికెట్లకు 155 రన్స్ చేసి నెగ్గింది. హెడ్ (19), అనికేత్ (19), నితీశ్ (19 నాటౌట్) ఆకట్టుకున్నారు. నూర్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హర్షల్ నిలిచాడు.

ఆరంభంలో తడబడినా..: స్వల్ప ఛేదన.. పైగా మంచు ప్రభావం కూడా ఎక్కువే ఉండడంతో సన్‌రైజర్స్ సునాయాసంగా మ్యాచ్‌ను ముగిస్తుందని అంతా భావించారు. కానీ స్లో పిచ్‌పై సీఎస్‌కే బౌలర్లు పట్టు వదల్లేదు. పరుగులను కట్టడి చేయడంతో పాటు వరుస విరామాల్లో వికెట్లు తీశారు. అయితే ఇషాన్‌తో పాటు మిడిలార్డర్‌లో కమిందు, నితీశ్ రాణించడంతో ఊపిరిపీల్చుకుంది. అంతకుముందు ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ అభిషేక్‌ను పేసర్ ఖలీల్ డకౌట్ చేశాడు. ఇక మరో ఓపెనర్ హెడ్‌ను అన్షుల్ బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో జట్టు 37/2 స్కోరు మాత్రమే చేసింది. ఆ తర్వాత ప్రమాదకర క్లాసెన్ (7)ను జడ్డూ అవుట్ చేయడంతో రైజర్స్ షాక్‌కు గురైంది. ఈ దశలో ఇషాన్‌కు జత కలిసిన అనికేత్ కాసేపు పోరాడాడు. చక్కగా కుదురుకున్న ఈ జోడీని నూర్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో సీఎస్‌కే పోటీలోకి వచ్చినట్టయ్యింది. నాలుగో వికెట్‌కు వీరి మధ్య 36 పరుగులు జత చేరాయి. అయితే డెత్ ఓవర్లలో బౌలర్లు లయ తప్పడంతో రైజర్స్ పని సులువైంది. కమిందు, నితీశ్ ఇబ్బంది లేకుండా ఆడేస్తూ సులువుగా బౌండరీలు రాబట్టారు. దీంతో మరో 8 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

ఆదుకున్న బ్రెవిస్: టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు బ్యాటింగ్ ఎప్పటిలాగే పేలవంగా సాగింది. వీరి ఇన్నింగ్స్‌లో మొదట ఓపెనర్ ఆయుష్ మాత్రే.. మధ్య ఓవర్లలో బ్రెవిస్ జోరు తప్ప చెప్పుకోవడానికేమీ లేదు. ఇక సీనియర్ ఆటగాళ్లు జడేజా (21), దూబే (12), ధోనీ (6) కీలక సమయాల్లో వెనుదిరగడంతో ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ రషీద్ (0)ను పేసర్ షమి అవుట్ చేయగా, సామ్ కర్రాన్ (9) వన్‌డౌన్‌లో బరిలోకి దిగాడు. మాత్రే జోరుతో పవర్‌ప్లేలో 50 పరుగులు సాధించింది. అయితే అప్పటికే వరుస ఓవర్లలో కర్రాన్, మాత్రే పెవిలియన్‌కు చేరారు. ఇక జడ్డూ పదో ఓవర్‌లో కమిందుకు చిక్కాడు. 74/4తో ఇబ్బందుల్లో పడిన జట్టును బ్రెవిస్ ఆదుకున్నాడు. మరో ఎండ్‌లో దూబే ఉన్నా రైజర్స్ బౌలర్లు కట్టడి చేశారు. కానీ సీఎస్‌కే తరఫున తొలి మ్యాచ్ ఆడిన బ్రెవిస్ మాత్రం తన సహజశైలిలో చెలరేగాడు. దీనికి తోడు 12వ ఓవర్‌లో మూడు సిక్సర్లతో 20 పరుగులందించాడు. ఆ వెంటనే హర్షల్ ఓవర్‌లోనూ భారీ సిక్స్ బాదినా కమిందు కళ్లు చెదిరే క్యాచ్‌తో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత భారీ షాట్‌కు వెళ్లి దూబే.. కాసేపటికే ధోనీ (6) పెవిలియన్‌కు చేరి ఫ్యాన్స్‌ను నిరాశపరిచారు. టెయిలెండర్లను హర్షల్ కుదురుకోనీయలేదు. చివర్లో దీపక్ హుడా కాసిన్ని పరుగులు జత చేయడంతో స్కోరు 150కి చేరగలిగింది.



కమిందు మెండిస్ (32 నాటౌట్)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
ముంబై	9	5	4	0	10	0.673
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: షేక్ రషీద్ (సి) అభిషేక్ (బి) షమి 0, ఆయుష్ మాత్రే (సి) ఇషాన్ (బి) కమిన్స్ 30, సామ్ కర్రాన్ (సి) అనికేత్ (బి) హర్షల్ 9, జడేజా (బి) మెండిస్ 21, బ్రెవిస్ (సి) మెండిస్ (బి) హర్షల్ 42, శివమ్ దూబే (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 12, దీపక్ హుడా (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 22, ధోనీ (సి) అభిషేక్ (బి) హర్షల్ 6, అన్షుల్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 2, నూర్ అహ్మద్ (సి) షమి (బి) హర్షల్ 2, ఖలీల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.5 ఓవర్లలో 154 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-39, 3-47, 4-74, 5-114, 6-118, 7-131, 8-134, 9-137, 10-154; **బౌలింగ్:** షమి 3-0-28-1, కమిన్స్ 4-0-21-2, జైదేవ్ ఉనాద్కట్ 2.5-0-21-2, హర్షల్ పటేల్ 4-0-28-4, జీషన్ అన్సారి 3-0-27-0, కమిందు మెండిస్ 3-0-26-1.

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) ఆయుష్ (బి) ఖలీల్ 0, హెడ్ (బి) అన్షుల్ 19, ఇషాన్ (సి) కర్రాన్ (బి) నూర్ 44, క్లాసెన్ (సి) హుడా (బి) జడేజా 7, అనికేత్ (సి) హుడా (బి) నూర్ 19, మెండిస్ (నాటౌట్) 32, నితీశ్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 18.4 ఓవర్లలో 155/5; వికెట్ల పతనం:** 1-0, 2-37, 3-54, 4-90, 5-106; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-21-1, అన్షుల్ 3-0-16-1, నూర్ అహ్మద్ 4-0-42-2, జడేజా 3.4-0-22-1, కర్రాన్ 2-0-25-0, పథిరన 3-0-27-0.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్	వేదిక కోల్‌కతా
కోల్‌కతా X పంజాబ్	రా.7.30 నుంచి



'ఐసీసీ' గ్రూప్ దశలోనూ కష్టమే?

భారత్Xపాక్ మ్యాచ్‌లపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: చాలా ఏళ్లుగా భారత్-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. తాజాగా పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇకముందు కూడా తలపడేది లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. అయితే ఐసీసీ వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఈ దాయాది జట్లను ఒకే గ్రూప్‌లో ఆడించడం పరిపాటి. టోర్నీలకు క్రేజ్ తెప్పించడంతోపాటు ఆర్థికంగాకూ అధిక ఆదాయం లభిస్తుందనే భావనలో ఐసీసీ ఇలాంటి షెడ్యూల్‌ను ఏర్పాటు చేస్తుంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇకముందు పాక్‌తో గ్రూప్ దశలోనూ తలపడవద్దని బోర్డు భావిస్తోందని, ఇప్పటికే ఐసీసీకి కూడా లేఖ రాసినట్టు కథనాలు వెలువడ్డాయి. బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 'ప్రస్తుతానికైతే అలాంటి వార్తల్లో నిజం లేదు. భవిష్యత్ గురించి ఇప్పుడే చెప్పలేం' అని బోర్డు అధికారి తేల్చాడు. పురుషుల విభాగంలో వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి మహిళల వరల్డ్‌కప్ జరగనుంది. ఇందులో భారత్-పాక్ మ్యాచ్‌లను తటస్థ వేదికపై ఆడిస్తారా? లేక రద్దు చేస్తారా? అనేది చూడాలి.

పాక్ హాకీ జట్టు పరిస్థితేంటి?

పాక్ జాతీయులకు వీసా నిలిపివేతతో భారత్‌లో జరిగే ఆసియాకప్‌లో ఆ దేశ హాకీ జట్టు ఆడేది సందేహం నెలకొంది. ఆగస్టు-సెప్టెంబరులో ఈ టోర్నీ జరుగుతుంది.

సెమీస్‌లో బాక్సర్లు ఖుషీ, తికమ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బాలికల అండర్-17 విభాగంలో ఖుషీ చాంద్, బాలుర అండర్-17 కేటగిరిలో తికమ్ సింగ్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. 46 కిలోల విభాగం క్వార్టర్స్‌లో గుయెన్ తి హాంగ్ ఎన్ (వియత్నాం)పై ఖుషీ, ఓత్మన్ దియాబ్ (పాలస్తీనా)పై తికమ్ విజయం సాధించారు. వీరితో పాటు మిగతా భారత బాక్సర్లలో బాలుర విభాగం నుంచి అంబేకర్ మీటీ (48 కిలోలు), ఉద్ధమ్ సింగ్ (54 కి), రాహుల్ గారియా (57కి), అమన్ దేవ్ (50 కి).. బాలికల్లో జియా (48 కి), జన్నత్ (54 కి) కూడా సెమీస్‌లో ప్రవేశించారు.

వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వొద్దు

- వక్ఫ్ ఆస్తుల నమోదుపై స్టే ఇచ్చినా ఇబ్బందే
- ఇస్తే న్యాయ వ్యవస్థే చట్టం చేసినట్లవుతుంది
- పార్లమెంటు చేసిన చట్టం రాజ్యాంగబద్ధమే
- సుప్రీంలో కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: సవరించిన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించింది. దానిపై పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ స్టే విధించాలన్న ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించింది. చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ను కొట్టేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. పార్లమెంటు ఆమోదించిన చట్టం కనుక రాజ్యాంగ ధర్మాసనం భిన్నమైన తీర్పు ఇచ్చేవరకు ఆ చట్టాన్ని రాజ్యాంగ బద్ధంగానే రూపొందించి ఉంటారని భావించాలని చెప్పింది. పిటిషనర్లు దురుద్దేశపూరితమైన తప్పుడు వాదనలను ముందుకు తెచ్చారని వ్యాఖ్యానించింది. వాటిని కోర్టు పరిశీలిస్తున్న దశలో స్టే విధించరాదని కోరింది. రేపు ఆ పిటిషన్లు కొట్టివేసిన తర్వాత ఏ కమ్యూనిటీ తరఫున పిటిషన్లు వేశామంటున్నారో ఆ కమ్యూనిటీయే స్టే వల్ల వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని, ఇది అవాంఛనీయ పరిస్థితని వ్యాఖ్యానించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం తన వాదనను అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. 1332 పేజీల ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని గట్టిగా సమర్థించుకుంది. 2013



వక్ఫ్ చట్టం తర్వాత దాదాపు 21 లక్షల ఎకరాల భూమి వక్ఫ్ జాబితాలో తాజాగా చేరిందని ప్రస్తావించింది. మొఘలుల కాలం నుంచి స్వతంత్ర్యం వచ్చినప్పటి వరకు ఉన్న వక్ఫ్ భూములన్నీ కలిపి 18.29 లక్షల ఎకరాలు మాత్రమేనని వెల్లడించింది. గత చట్టంలోని నిబంధనలను అవకాశంగా చేసుకొని ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నట్లు పేర్కొంది. మైనారిటీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి షేర్షా సీ షేక్ మొహినుద్దీన్ పేరిట అఫిడవిట్‌ను దాఖలు చేశారు. సాధారణంగా తుది తీర్పు ఇచ్చేవరకు రాజ్యాంగ ధర్మాసనాలు పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై స్టే విధించవని గుర్తు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వక్ఫ్ బిల్లుపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయాలన్న విజ్ఞప్తిపై మే 5న విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్టే ఆలోచన వద్దని సుప్రీంకోర్టును కోరింది. ఏప్రిల్ 8వ తేదీలోగా వక్ఫ్ బై యూజర్ ఆస్తులను నమోదు చేసుకోవాలని చట్టంలో ఉన్న నిబంధనపైనా నియంత్రణలు విధించాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దానిపై ఎలాంటి స్టే విధించినా న్యాయస్థానం ఆదేశాలతో చట్టం చేసినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. కొత్త చట్టంతో కేంద్ర, రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల్లో ముస్లిములు మైనారిటీలు అవుతారన్న పిటిషనర్ల వాదనను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. సెంట్రల్ వక్ఫ్ బోర్డులో 22 మంది సభ్యుల్లో కేవలం నలుగురు ముస్లిమేతరులు ఉంటారని, దానివల్ల ముస్లిం మెజారిటీకి ఎలాంటి భంగం కలగదని పేర్కొంది. వక్ఫ్ బై యూజర్ ఇప్పటిదాకా భూమిని రిజిస్టర్ చేసుకోలేదన్న వాదనను కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. ఇప్పుడు ఈ విషయంలో సుప్రీంకోర్టు కనుక స్టే ఇస్తే చాలా తేడాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. చట్టం లక్ష్యమే నెరవేరకుండా పోతుందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగబద్ధంగా భావిస్తున్న ఒక చట్టాన్ని మార్చాలన్న ప్రతిపాదనను అనుమతించరాదని స్పష్టం చేసింది. న్యాయసమీక్ష కూడా ఒక రాజ్యాంగ బద్ధ చట్టాన్ని ఆపకూడదని వ్యాఖ్యానించింది. పిటిషనర్లు కోరిన వాటికి అనుకూలంగా ఏ ఉత్తర్వు ఇచ్చినా మొత్తం చట్టంపై స్టే ఇచ్చినట్లేనని కేంద్ర ప్రభుత్వం వాదించింది. కొత్త చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తుల గుర్తింపు, నియంత్రణకు న్యాయస్థానాల ప్రామాణికత వస్తుందని వ్యాఖ్యానించింది. ఆస్తి హక్కు విషయంలో ఏ వ్యక్తీ కోర్టుకు వెళ్లలేని పరిస్థితి ఉండకూడదని ఈ మార్పులు చేసినట్లు తెలిపింది. ఈ చట్టంతో ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందన్న వాదనను కూడా కేంద్రం ఖండించింది. ముస్లింల మతాచారాలను గౌరవిస్తూ చట్టాన్ని రూపొందించామని, విశ్వాసం, ప్రార్థన లాంటి అంశాల జోలికి పోలేదని, వక్ఫ్ నిర్వహణలో లౌకిక అంశాలపైనే చట్టం చేశామని వివరించింది.

ప్రజ్ఞా ఠాకూర్‌కు ఉరి శిక్ష వేయండి

మాలేగావ్ పేలుళ్ల కేసులో కోర్టుకు ఎన్ఐఏ విజ్ఞప్తి



ముంబై, ఏప్రిల్ 25: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాలేగావ్ పేలుళ్ల కేసులో.. సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ సహా ఏడుగురు నిందితులకూ చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)లోని సెక్షన్ 16 కింద మరణ శిక్ష విధించాలని ఎన్ఐఏ కోర్టుకు విజ్ఞప్తిచేసింది. ముంబై ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణ కిందటి శనివారం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ కేసును విచారించిన జడ్జి ఏకే లహోటీ.. తీర్పును మే 8వ తేదీకి వాయిదా వేశారు. 1389 పేజీలతో తన తుది వాదనలను సమర్పించిన ప్రాసిక్యూషన్.. నిందితులందరికీ మరణశిక్ష విధించాలని అందులో కోరింది. నిజానికి ఈ కేసులో నిందితులకు ఎనిమిదేళ్ల క్రితం క్లీన్‌చిట్ ఇచ్చిన ఎన్ఐఏ.. ఆ తర్వాత పూర్తి యూటర్న్ తీసుకోవడం గమనార్హం. కేసు వివరాల్లోకి వెళ్తే.. 2008 సెప్టెంబరు 29న మహారాష్ట్రలోని మాలేగావ్‌లో రంజాన్ ప్రార్థనల సమయంలో రెండు పేలుళ్లు జరిగి ఆరుగురు ముస్లింలు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసును తొలుత మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ విచారించి.. ప్రజ్ఞా ఠాకూర్, శివనరాయణ్ గోపాల్ సింగ్ కల్సంగ్రా, శ్యామ్ భవర్లాల్ సాహూను అరెస్టు చేసింది. ఆ ముగ్గురితో సహా.. మొత్తం 16 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎంకోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్) కింద అభియోగాలు నమోదు చేయడంతో వారికి ఎక్కడా బెయిల్ దొరకలేదు. 2011లో ఎన్ఐఏ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. 2015లో ఎన్ఐఏ ఈ కేసులో సాక్షులను తిరిగి విచారించి, ప్రజ్ఞా ఠాకూర్ సహా మరికొందరికి క్లీన్‌చిట్ ఇస్తూ 2016లో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇదే కేసులో.. లెఫ్టినెంట్ కర్నల్ పురోహిత్ సహా మరో 10 మందిపై ఎంకోకా చట్టం కింద దాఖలు చేసిన అభియోగాలన్నింటినీ తొలగించింది. కానీ, కోర్టు ప్రజ్ఞా ఠాకూర్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసి విచారణను కొనసాగించింది. దాదాపు 17 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా కొనసాగిన ఈ కేసు విచారణ ఎట్టకేలకు 2025 ఏప్రిల్ 19న ముగిసింది. అయితే.. ఈ కేసులో నిందితులకు 2016లో క్లీన్‌చిట్ ఇచ్చిన అదే ఎన్ఐఏ.. ఆ తర్వాత యూటర్న్ తీసుకుని.. సాక్షులు 2015లో మాటమార్చారని, వారి వాంగ్మూలాలను విశ్వాసంలోకి తీసుకోలేమని.. ప్రజ్ఞాఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, సుధాకర్ ద్వివేది, రిటైర్డ్ మేజర్ రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్కర్, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణికి మరణశిక్ష విధించాలని కోరింది.

హైపర్‌సోనిక్ స్క్రామ్‌జెట్ కంబస్టర్ పరీక్ష సక్సెస్

- హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లో ప్రయోగం



అల్వాల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అత్యంత వేగంగా దూసుకుపోయే హైపర్ సోనిక్ క్షిపణుల సాంకేతికతలో రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) మరో ముందడుగు వేసింది. ధ్వని కంటే ఐదు రెట్లు ఎక్కువ వేగంతో అంటే గంటకు 6,100 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్లే క్షిపణుల్లో వినియోగించే.. అత్యాధునిక స్క్రామ్‌జెట్ ఇంజన్‌కు సంబంధించి క్షేత్రస్థాయి పరీక్షను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్)లో కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక 'స్క్రామ్‌జెట్ కనెక్ట్ టెస్ట్ ఫెసిలిటీ'లో ఈ పరీక్ష నిర్వహించారు. ఇది స్క్రామ్‌జెట్ ఇంజన్ సబ్‌స్కేల్ పరీక్ష (అసలైన పెద్ద ఇంజన్‌కు సంబంధించిన అచ్చమైన చిన్న ప్రతిరూపాన్ని తయారు చేసి పరీక్షించడం). అత్యధిక శక్తిని విడుదల చేస్తూ, హైపర్ సోనిక్ వేగంతో ప్రయాణించినప్పుడు తీవ్రమైన ఉష్ణం వెలువడుతుంది. దాన్ని నియంత్రించకుంటే ఇంజన్ ఫెయిలవుతుంది. ఆ వేడిని నియంత్రించేందుకు యాక్టివ్ కూల్డ్ సాంకేతికతను వినియోగిస్తారు. శుక్రవారం హైపర్ సోనిక్ స్క్రామ్‌జెట్ ఇంజన్‌కు సంబంధించి.. యాక్టివ్ కూల్డ్ సబ్‌స్కేల్ కంబస్టర్ (ఇంధనాన్ని మండించే) పరీక్ష నిర్వహించారు. ఇందులో ఇంజన్ 1,000 సెకన్లకుపైగా విజయవంతంగా పనిచేసింది. అంటే నేరుగా పూరిస్థాయి స్క్రామ్‌జెట్‌ను పరీక్షించేందుకు మార్గం సుగమం అయినట్టే. ఈ విజయం సాధించిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

ఉగ్రవాదంపై పోరుకు ఐక్యంగా భారత్: రాహుల్

- ఆర్మీ92 బేస్ ఆస్పత్రిలో పహల్గాం క్షతగాత్రుడికి పరామర్శ



శ్రీనగర్, ఏప్రిల్ 25: ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత్ ఐక్యంగా నిలుస్తుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. దేశ ప్రజలను విభజించేందుకే జరిగిన ఉగ్రదాడిని తిప్పికొట్టేందుకు ప్రతి భారతీయుడు ఒక్కటిగా కలిసి పోరాడాలన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించడానికి ఆయన శుక్రవారం ఉదయం జమ్మూకశ్మీర్ చేరుకున్నారు. బాదామీబాగ్‌లోని ఆర్మీ 92 బేస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శించిన అనంతరం రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడ జరిగిన ఉగ్రదాడి గురించి తెలుసుకుని సాయపడేందుకు వచ్చానన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష భేటీలోనూ కేంద్రానికి బాసటగా నిలిచిన ఐక్య విపక్షం ఉగ్రదాడిని ఖండించిందని గుర్తు చేశారు. అటుపై శ్రీనగర్‌లో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లాలతోనూ రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. ఉగ్రదాడి, తదనంతర పరిణామాలను ఆయనకు వారు వివరించారు.

భారత్-పాక్ సంయమనం పాటించాలి

- ఉగ్రదాడి నేపథ్యంలో యూఎన్ సెక్రటరీ జనరల్ స్పందన

న్యూయార్క్, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటొనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. రెండు దేశాలు సంయమనం పాటించాలని సూచించారు. గుటెరస్ తరఫున ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ మీడియాతో మాట్లాడారు. తాజా పరిణామాలను గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని, ఏ సమస్య తలెత్తినా రెండు దేశాలు చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారని వెల్లడించారు.

రాహుల్ గాంధీకి సుప్రీం చీవాట్లు

'సావర్కర్ బ్రిటిష్ సేవకుడు' అన్న వ్యాఖ్యలపై మండిపడ్డ న్యాయస్థానం

- గాంధీ కూడా బ్రిటిష్ పాలకులకు 'యువర్ సర్వెంట్' అనే లేఖ రాసేవారని వెల్లడి
- దేశ చరిత్ర తెలియనప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీసిన ధర్మాసనం
- సమరయోధులను ఎగతాళి చేయరాదని హితవు







న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేశారంటూ మండిపడింది. 'మన స్వాతంత్ర్య సమరయోధులను అపహాస్యం చేయరాదు' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేస్తూ మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ 2022లో మహారాష్ట్రలో నిర్వహించిన ర్యాలీలో సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వీర సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయంటూ నృపేంద్ర పాండే యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ దశలో తమ జోక్యం అనవసరమని, సెషన్స్ కోర్టులోనే రివిజన్ పిటిషన్ దాఖలు చేయాలని హైకోర్టు లఖ్‌నవూ బెంచ్ సూచించింది. ఈ నేపథ్యంలో తనపై క్రిమినల్ చర్యలను నిలిపివేయాలని కోరుతూ రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం.. రాహుల్ గాంధీని తీవ్రంగా మందలించింది. "మహాత్మా గాంధీ కూడా బ్రిటిష్ పాలకులకు లేఖ రాసినప్పుడు 'మీ విశ్వసపాత్రుడైన సేవకుడు' అనే రాసేవారు. ఈ విషయం మీ కక్షిదారు(రాహుల్)కు తెలుసా? మహాత్ముడు లేఖలో రాశారని.. ఆయన్ను కూడా బ్రిటిషర్లకు సేవకుడని అంటారా? ఆ రోజుల్లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులు కూడా 'యువర్ సర్వెంట్' అనే రాసేవారు. మీకు(రాహుల్) దేశ చరిత్ర గురించి ఏమీ తెలియనప్పుడు.. అలాంటి వ్యాఖ్యలు చేయకూడదు" అని ధర్మాసనం రాహుల్ తరఫున వాదనలు వినిపించిన అభిషేక్ మను సింఘ్వీకి స్పష్టం చేసింది. ఒక ప్రముఖ రాజకీయ పార్టీ నేత అయి ఉండీ ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీసింది. మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన వారి పట్ల ఇలాగేనా వ్యవహరించేది? అని నిలదీసింది. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సుమోటోగా తీసుకుంటామని హెచ్చరించింది. అయితే రాహుల్‌పై క్రిమినల్ చర్యలను నిలిపివేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదుదారు నృపేంద్ర పాండేకు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

సోనియా, రాహుల్‌కు నోటీసుల జారీకి నో

- నిరాకరించిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు
- నేషనల్ హెరాల్డ్ కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: నేషనల్ హెరాల్డ్ ఆస్తుల బదిలీలో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇతరులకు నోటీసులు ఇచ్చేందుకు శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు నిరాకరించింది. వారికి నోటీసులు ఇవ్వాలన్న ఈడీ వినతిని ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే అంగీకరించలేదు. కొత్త నిబంధనల ప్రకారం నిందితుల వాదనలు వినకుండా ఈడీ సమర్పించిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకోకూడదని అందువల్ల వారికి నోటీసులు ఇవ్వలేమని తెలిపారు. అవసరముందని భావించినప్పుడు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. చార్జిషీటులో ఏమైనా లోపాలు ఉన్నాయా అన్న విషయాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.



శుక్రవారం సాకేత్ కోర్టు ఆవరణలో మేధా పాట్కర్

పరువు నష్టం కేసులో మేధా పాట్కర్ అరెస్టు, విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పరువు నష్టం కేసులో సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అయితే, కొద్ది గంటల వ్యవధిలోనే ఆమె విడుదలయ్యారు. మరోవైపు ఆమెకు విధించిన శిక్షను హైకోర్టు సస్పెండ్ చేసింది. 24 ఏళ్ల నాటి ఈ కేసులో ప్రొబేషన్ బాండు సమర్పించనందున ఆమెను అరెస్టు చేయాలని బుధవారం అదనపు సెషన్స్ జడ్జి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. దాంతో పోలీసులు ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న ఆమె ఇంటికి వెళ్లి కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మేధాపాట్కర్‌పై నర్మదా బచావో ఆందోళన్ సమయంలో పరువు నష్టం దావా వేశారు. దీనిపై ఈ నెల 8న విచారణ జరిపిన అదనపు సెషన్స్ జడ్జి సమాజానికి చేసిన సేవల దృష్ట్యా మేధా పాట్కర్‌కు జైలు శిక్ష నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే రూ.లక్ష జరిమానా విధించారు. అరెస్టు చేయకుండా ఏడాది పాటు ప్రొబేషన్ ఇచ్చారు. ఈ నెల 23లోగా రూ.25వేలకు ప్రొబేషన్ బాండు చెల్లించాలన్నారు. కానీ ఆ రోజున జరిగిన విచారణకు మేధా హాజరుకాకపోవడంతో అరెస్టు చేయాలంటూ తాజాగా వారెంట్లు జారీ చేశారు. ప్రస్తుతం రూ. లక్ష జరిమానా చెల్లించడంతో పాటు, ప్రొబేషన్ బాండు సమర్పించడంతో ఆమెను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు, మేధా పాట్కర్ రివిజన్ పిటిషన్‌పై విచారించిన ఢిల్లీ హైకోర్టు ఆమె జైలు శిక్షను సస్పెండ్ చేసింది.

అమెరికాకు పంపే ఐఫోన్లు.. ఇక భారత్‌లోనే తయారీ!

- చైనాలో ఉన్న తమ పరిశ్రమను భారత్‌కు తరలించాలని ఆపిల్ యోచన
- ట్రంప్ విధించిన సుంకాలే కారణం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: అమెరికాలో విక్రయించే ఐఫోన్‌ల తయారీ యూనిట్‌ను చైనా నుంచి భారత్‌కు తరలించాలని ఆపిల్ కంపెనీ యోచిస్తున్నట్లు వెల్లడైంది. చైనా మీద ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతోపాటు, ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల ప్రభావమూ దీనికి కారణమని సమాచారం. చైనా దిగుమతుల మీద ట్రంప్ 145 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. దీనికి తాత్కాలికంగా 90 రోజుల మినహాయింపు ఇచ్చినప్పటికీ.. చైనా మీద ట్రంప్ తొలినుంచీ గుర్రుగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో, చైనాలో తయారయ్యే ఐఫోన్లను అమెరికాకు తీసుకెళ్తే సుంకం కారణంగా వాటి ధర భారీగా పెరుగుతుంది. దీంతో, ఈ తయారీకేంద్రాన్ని భారత్‌కు తరలించాలని ఆపిల్ భావిస్తోంది. భారత ఉత్పత్తుల మీద సుంకాన్ని ట్రంప్ 26 శాతానికే పరిమితం చేశారు. ప్రస్తుతం ఇది కూడా అమలులో లేదు. ఇప్పటికే భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థల సహకారంతో ఆపిల్ యూనిట్లు నడుస్తున్నాయి. అమెరికా మార్కెట్లో ఆపిల్ ఏటా సగటున ఆరు కోట్ల ఐఫోన్లను విక్రయిస్తోంది. 2026 నాటికి ఈ ఆరు కోట్ల ఐఫోన్ల తయారీని మొత్తంగా భారత్‌లోనే చేపట్టాలని ఆపిల్ భావిస్తోంది.

కస్తూరిరంగన్ కన్నుమూత

- తొమ్మిదేళ్లపాటు ఇస్రో చైర్మన్‌గా విశేష సేవలు
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ.. ఇతర ప్రముఖులు నివాళి



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష రంగంలో విశేష సేవలందించిన ఇస్రో మాజీ చైర్మన్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ బెంగళూరులో కన్నుమూశారు. కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కస్తూరి రంగన్ (84) శుక్రవారం మారతహళ్లిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. చివరి చూపు కోసం ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రామన్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఆర్ఐ)లో ఉంచి అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. కేరళలోని ఎర్నాకుళంలో కృష్ణస్వామి అయ్యర్, విశాలాక్షి దంపతులకు 1940 అక్టోబరు 24న కస్తూరి రంగన్ జన్మించారు. 1994లో ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కస్తూరిరంగన్ తొమ్మిదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగి 2003 ఆగస్టులో పదవీ విరమణ చేశారు. ఆ సమయంలో ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాలు విజయవంతమయ్యాయి. అంతకుముందు ఆయన ఇస్రో ఉపగ్రహ కేంద్రం డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఇన్‌శాట్-2, ఐఆర్ఎస్-1ఏ, 1బీ విజయవంతానికి శ్రమించారు. భాస్కర-1, 2 ప్రాజెక్టులకు డైరెక్టర్‌గానూ సేవలందించారు. సివిల్ శాటిలైట్ ఐఆర్ఎస్-1సీ, 1డీ ప్రయోగాలతోపాటు మూడోతరానికి అవసరమైన ప్రయోగాలను సైతం విజయవంతం చేశారు. ఐఆర్ఎస్ పీ3, పీ4ల లాంచింగ్‌లో కీలకపాత్ర పోషించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ సెంటర్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. 2003-2009 మధ్యకాలంలో రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించారు. భారత ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ పనిచేశారు. దేశానికి చేసిన సేవలకుగానూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు ఆయనను వరించాయి.

మహోన్నత వ్యక్తిని కోల్పోయాం: మోదీ

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనకు ఘన నివాళి అర్పించారు. 'భారత వైజ్ఞానిక, విద్యారంగంలో మహోన్నత వ్యక్తి కస్తూరి రంగన్ మరణం తీవ్రంగా కలచివేసింది. ఆయన దార్శనిక నాయకత్వం, దేశానికి చేసిన నిస్వార్థ సేవ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఎంతో అంకిత భావంతో ఇస్రోకు సేవలందించిన ఆయన.. భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు' అని మోదీ కొనియాడారు. కాగా, కస్తూరి రంగన్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. సీఎం రేవంత్ కూడా కస్తూరి రంగన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. భారత అంతరిక్ష పరిశోధనల్లో ఆయన విశేష కృషి చేశారని అన్నారు.

కస్తూరి రంగన్ ఒక ఆణిముత్యం: ఇస్రో చైర్మన్ నారాయణన్

కస్తూరిరంగన్ ఒక లెజెండరీ నాయకుడని, 20వేల మందితో కూడిన ఇస్రోకు ఆయన కుటుంబం లాంటివారని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. ఇస్రోను ప్రపంచస్థాయి సంస్థగా ఆయన తీర్చిదిద్దారని, తనలాంటి యువకులను ఎంతగానో ప్రోత్సహించారని కొనియాడారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతమైనప్పుడు ఆయన బాగా సంతోషించారని, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఆయన ఒక ఆణిముత్యమని పేర్కొన్నారు. కస్తూరిరంగన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కాగా.. కస్తూరిరంగన్ తన మాయాజాలంలో ఇస్రోకు అనేక అద్భుత విజయాలు కట్టబెట్టారని ఆయన సహచరులు, జూనియర్లు గుర్తుచేసుకున్నారు.

పాక్‌కు గుణపాఠం ఖాయం!

- స్థలం, సమయం ఖరారు చేయాలంతే
- అదీ సీసీఎస్ భేటీలో జరిగే ఉంటుంది
- 'ఆంధ్రజ్యోతి'తో జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్రకుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమని జమ్మూకశ్మీరు మాజీ డీజీపీ రాజేంద్రకుమార్ అన్నారు. అయితే స్థలం, సమయం ఎప్పుడన్నదే తేలాల్సి ఉందని చెప్పారు. "పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయం. దీనిపై భద్రతా వ్యవహారాలపై ఏర్పడిన క్యాబినెట్ కమిటీ(సీసీఎస్) సమావేశంలో నిర్ణయం జరిగే ఉంటుంది. ఆ సమావేశంలో అన్ని ప్రతిపాదనలూ ఉంటాయి. మనం దాడిచేస్తే పాక్ ఎలా స్పందించవచ్చు? ఎప్పుడు, ఎక్కడ దాడి చేయాలి? ఇవన్నీ చర్చించే ఉంటారు" అని రాజేంద్రకుమార్ చెప్పారు. మనకు అనుకూలమైన సమయం, స్థలం చూసి, దాడి చేస్తారని.. ఇది జరగడం వంద శాతం ఖాయమని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆయన జమ్మూకశ్మీర్‌లో వివిధ హోదాల్లో పనిచేసి డీజీపీగా పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవోగా ఉన్న రాజేంద్రకుమార్‌తో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా మాట్లాడింది. సింధు జలాల ఒప్పందం రద్దు, భవిష్యత్ పరిణామాలు, ఉగ్రవాదానికి పాక్ మద్దతిస్తున్న తీరు.. తదితర అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మన బ్యారేజీల ఎత్తు పెంచుకోవచ్చు..

సింధు నది జలాల ఒప్పందం తర్వాత పాకిస్థాన్‌తో మనకు మూడు యుద్ధాలు జరిగాయి. కానీ, ఎన్నడూ ఆ ఒప్పందాన్ని రద్దు చేయలేదు. ఈసారి మాత్రమే కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఒప్పందం రద్దుతో నీళ్లు వెళ్లకుంటే పాక్‌లోని పశ్చిమ పంజాబ్‌లో 80% వ్యవసాయం పడావు పడుతుంది. ఈ ఏడాదా? వచ్చే ఏడాదా? అన్నదే ప్రశ్న. అదే జరిగితే పాక్ జీడీపీలో 22 శాతం నేరుగా కోత పడుతుంది. మరోవైపు ఇప్పుడు మనం కావాలనుకుంటే మన బ్యారేజీల ఎత్తు పెంచుకోవచ్చు. విద్యుత్తు ప్రాజెక్టులకు ఎక్కువ నీటిని వినియోగించుకోవచ్చు.

జీ-7 దేశాల ఎఫ్ఏటీఎఫ్‌తో మళ్లీ బ్లాక్‌లిస్ట్ చేయించాలి

ఉగ్రవాద ప్రోత్సాహం అనేది పాకిస్థాన్ సిద్ధాంతం. హఫీజ్ సయీద్‌తో పాటు ప్రపంచం ఉగ్రవాదులుగా గుర్తించిన 90% మందికి పాకిస్థానే ఆశ్రయం కల్పిస్తోంది. ఇలా ఉగ్రవాదానికి సాయం చేసే దేశాలకు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి సంస్థల నుంచి నిధులు, విదేశీ సాయం అందకుండా చూసేందుకు జీ-7 దేశాలు 'ఫైనాన్షియల్ అసిస్టెన్స్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)' సంస్థను ఏర్పాటు చేశాయి. మనీలాండరింగ్, ఉగ్రవాదానికి సాయం చేసే దేశాలను ఇది గుర్తించి.. ఆయా దేశాలను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతుంది. ఒకప్పుడు పాక్‌కు విదేశీ ఆర్థిక సాయం నిలిపివేయాలని ఇది సిఫారసు చేసింది. దాంతో నిలిపివేశారు. ఆ తర్వాత తాను ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం లేదని పాక్ చెప్పుకోవడంతో నిషేధాన్ని తొలగించారు. ఇప్పుడు మళ్లీ పాక్ ఉగ్రవాదానికి మద్దతిస్తున్న అంశాన్ని లేవనెత్తి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించాలి.

వాణిజ్య మార్గాలు బంద్

జమ్మూకు రెండు, కశ్మీర్‌కు రెండు వ్యాపార మార్గాలు ఉండేవి. గత ప్రభుత్వాలు మన కశ్మీర్, పాక్ ఆక్రమిత కశ్మీర్ మధ్య అంతర్గత వాణిజ్యానికి, సరుకుల రవాణాకు అనుమతించాయి. దీంతో అక్కడి కూరగాయలు, వస్తువులు ఇక్కడకు, ఇక్కడి వస్తువులు అక్కడకు సరఫరా చేసేవారు. ఈ వస్తువుల మాటున పాక్ మాదకద్రవ్యాలను సరఫరా చేసేది. ఆర్టికల్ 370 రద్దుతో ఇవన్నీ ఆగిపోయాయి. అంతేకాదు, అక్కడ పర్యాటకం వృద్ధి చెంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా బాగా పెరిగాయి.

పాక్ రెండు జాతుల సిద్ధాంతం విఫలం

ముస్లింల సంఖ్య పాక్ కంటే మనదేశంలోనే ఎక్కువ. జిన్నా నుంచి మొన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిఫ్ మునీర్ వరకు చెప్పిన రెండు జాతుల సిద్ధాంతం తప్పని నిరూపితమైంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం తోలుబొమ్మ ప్రభుత్వం ఉంది. మరోవైపు మిలటరీ కూడా బలూచిస్థాన్‌లో దెబ్బలు తింది. వారిపైనా ప్రజల్లో వ్యతిరేకత. అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకే పహల్గాం దాడి. అనంతనాగ్‌లో గతంలో ఇలాంటి దాడే జరిగింది.

గైడ్ కాదు.. దేవుడు!

11మంది పర్యాటకులను కాపాడిన కశ్మీరీ గైడ్ నజకత్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడి నుంచి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పర్యాటకులు, వారి పిల్లలను ఓ కాశ్మీరీ గైడ్ తన ప్రాణాలు పణంగా పెట్టి కాపాడాడు. ఛత్తీస్‌గఢ్‌లోని మనేంద్రగఢ్-చిర్మిరి- భరత్‌పూర్ జిల్లాకు చెందిన 11 మంది కశ్మీర్ యాత్రకు వెళ్లారు. వీరిలో నలుగురు దంపతులతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కశ్మీర్‌లో వీరికి నజకత్ అహ్మద్ షా(28) గైడ్‌గా వ్యవహరించారు. ఉగ్రదాడి జరిగిన సమయంలో వారంతా బైసారన్ మైదానంలో ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు. ఇంతలో తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. పర్యాటకులంతా తలో దిక్కుకు పరిగెత్తడం గమనించిన నజకత్.. ముగ్గురు చిన్నారులను తీసుకొని ఒక చిన్న మార్గం నుంచి బయటపడ్డాడు. ప్రమాదకరమైన కొండ దారుల్లో దాదాపు 14 కిలోమీటర్లు పరిగెత్తుకుంటూ వెళ్లి పహల్గాం పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ సురక్షిత ప్రాంతంలో పిల్లలను ఉంచి మరోసారి వెనక్కువచ్చి మిగిలిన నాలుగు జంటలను కూడా కాపాడాడు. కాగా, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో తన మేనమామ కుమారుడు ఆదిల్ ముష్కరుల తూటాలకు బలయ్యాడని నజకత్ ఆవేదన వ్యక్తం చేశారు. తనను నమ్ముకున్న పర్యాటకులు క్షేమంగా తిరిగి వెళ్లేవారకూ వారి వెంటే ఉండటం తన బాధ్యతగా భావించానని, అందుకే ఆదిల్ అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయానని తెలిపారు.

కాల్చేసి.. ప్రాణం పోయాకే వెళ్లారు

» హిందువులు, ముస్లింలను వేర్వేరుగా నిల్చోమన్నారు

» ఉగ్రదాడిలో భర్త శైలేశ్‌ను కోల్పోయిన శీతల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: భార్యాభర్తలు.. వారి ఇద్దరు పిల్లలు 'మినీ స్విట్జర్లాండ్'గా పేరున్న ఆ పెహల్గాంకు వచ్చి అప్పటికి కేవలం 15-20 నిమిషాలే అవుతోంది. దూరం నుంచి తుపాకీ చప్పుళ్ల మోత వినిపించింది.. అప్రమత్తయ్యేలోపు సాయుధులైన ఉగ్రవాదులు దగ్గరికొచ్చేశారు. దంపతుల్లో భర్తను కాల్చేశారు. రక్తపుమడుగులో కొట్టుకుంటున్న అతడు చనిపోయేదాకా అక్కడే ఉన్నారు. ఇలా ముష్కరుల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న శైలేశ్ కాలతీయ గురించి ఆయన భార్య శీతల్ గుర్తుచేసుకున్నారు. ఉగ్రవాదులు వచ్చీరాగానే పురుషుల్లో హిందువులు, ముస్లింలు వేర్వేరు బృందాలుగా నిలబడాలంటూ చెప్పి.. రెండు, మూడు నిమిషాల్లో హిందువులను కాల్చిచంపారని శీతల్ చెప్పారు. తూటాల గాయాలతో కుప్పకూలిన తన భర్త తలను ఒళ్లో పెట్టుకొని సాయం కోసం అర్థించినా ఎవ్వరూ రాలేదని.. ఉగ్రవాదులు పారిపోయాక కూడా వెంటనే సహాయక చర్యలు చేపట్టలేదని ఆమె వాపోయారు. పిల్లలను తీసుకొని అక్కడి నుంచి పారిపోండంటూ స్థానికులు గట్టిగా అరవడంతో తాను తన ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని చెప్పుల్లేని కాళ్లతో మోకాలి లోతులో ఉన్న బురదను దాటుకుంటూ వెళ్లాలని.. ఓ చోట ఆర్మీ జవాను తారసపడి " అసలు మీరు అక్కడికి ఎందుకు వెళ్లారు?" అని ప్రశ్నించాడని వెల్లడించారు. తాము ప్రభుత్వాన్ని, భద్రతా దళాలపై నమ్మకం పెట్టుకొనే అక్కడికి వెళ్లామని చెప్పారు.

గుర్రం యజమానులతో బేరమే బతికించింది!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: మరీ.. అంతా? బాబ్బాబూ చార్జీలు కొంచెం తగ్గించరూ! పెహల్గాంకు వెళ్లేందుకు ఇలా గుర్రాల యజమానులను ఆ బృందం బతిమాలుకుంది! వారేమో కుదరదంటున్నారు.. వీరేమో బతిమాలుతునే ఉన్నారు! ఇలా ఓ 15 నిమిషాల పాటు బేరమాడటమే ఆ బృందం ప్రాణాలను కాపాడింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్, సాంగ్లీ, పుణె, రత్నగిరి ప్రాంతాలకు చెందిన ఓ 28 మంది ఈనెల 17న కశ్మీర్‌లోని బైసారన్ లోయకు వెళ్లారు. 22న పెహల్గాం సమీపంలోకి చేరుకున్నారు. గుర్రాల మీద అక్కడికి చేరుకొనేందుకు వాటి యజమానులతో బేరమాడి.. అప్పటికే పర్యాటకులను ఎక్కించుకొని వెళ్లిన గుర్రాల రాక కోసం ఎదురుచూస్తున్నారు. అంతలోనే.. గుర్రాల నిర్వాహకుల్లో ఒకరు పరుగుపరుగున అక్కడికి వచ్చి.. ఎవ్వరూ అక్కడికి వెళ్లకండి.. అక్కడ కాల్పులు జరుగుతున్నాయి అని చెప్పాడు. "మృత్యువు నుంచి తృటిలో తప్పించుకున్నాం. 'మేం బేరమాడకపోతే గనక.. ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల్లో మా పేర్లూ ఉండేవి" అని 28 మంది బృందంలో కురానే అనే వ్యక్తి భయంభయంగా చెప్పాడు.

ముసాఫిర్, సమీర్..నా ప్రాణాలు కాపాడారు!



కొచ్చి, ఏప్రిల్ 25: ఆమె కేరళకు చెందిన మహిళ. పేరు ఆరతి మేనన్! ప్రస్తుతం తనకు కశ్మీర్‌లో ముసాఫిర్, సమీర్ అనే సోదరులు ఉన్నారని ఆమె చెబుతోంది. ఆరతి కూడా పెహల్గామ్ ఉగ్రదాడి బాధితురాలు. ఆరేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులతో కలిసి బైసారన్‌కొచ్చింది. తల్లి షీలా మాత్రం దూరంగా కార్లో కూర్చుంటే మిగతా వారంతా అక్కడ ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ గుర్రపు స్వారీ చేస్తున్నారు. అయితే ఆరతి కళ్లెదుటే తండ్రి, 65 ఏళ్ల రామచంద్రన్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. పిల్లలను తీసుకొని భయంతో తాను దారితెన్నూ లేకుండా అడవులవైపు పరుగెత్తి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నానని చెప్పింది. ఇంతటి విషాద సమయంలో తనకు ఏమాత్రం పరిచయం లేకున్నా ముసాఫిర్, సమీర్ అనే ఇద్దరు కశ్మీరీ ట్యాక్సీ డ్రైవర్లు ఓ సోదరిలా భావించి ఎంతో సాయం చేసి, అండగా నిలిచారని ఆరతి చెప్పింది. తన వెంట ఇద్దరూ కలిసి మార్చురీ దాకా వచ్చారని.. లాంఛనాలన్నీ పూర్తయ్యేదాకా దగ్గరుండి అన్నీ చూసుకున్నారని.. ఎయిర్‌పోర్టు దాకా కూడా వచ్చారని ఆమె వివరించింది. తనకు ముసాఫిర్, సమీర్ ఇద్దరూ సోదరులని.. వారిని అల్లా ఎప్పుడూ కాపాడాలని ఆరతి భావోద్వేగానికి గురైంది.

మా బిడ్డను కాపాడండి!

» పాక్ చెరలో ఉన్న జవాను పట్ల తల్లిదండ్రుల ఆందోళన

హుగ్లీ, ఏప్రిల్ 25: పాక్ చెరలో ఉన్న బీఎస్ఎఫ్ జవాను, పశ్చిమ బెంగాల్‌కు చెందిన పూర్ణం సాహూ క్షేమ సమాచారం తెలియక ఆయన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డను ఎలాగైనా విడిపించి.. క్షేమంగా ఇంటికి తీసుకురావాలంటూ భారత ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు. పూర్ణం సాహూ సెలవుల్లో ఇంటికొచ్చి మూడు వారాల క్రితమే విధుల్లో చేరాడని.. తమ బిడ్డ పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదని తండ్రి భోలేనాథ్ సాహూ ఆవేదన వ్యక్తం చేశాడు. కుమారుడు క్షేమంగా ఉన్నాడా? బతికే ఉన్నాడా? అనేదానిపై ఎవ్వరూ సమాచారం ఇవ్వడం లేదన్నారు. పెహల్గాం ఉగ్రదాడి ఘటనతో పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ.. పూర్ణం సాహూ దాయాది చేతికి చిక్కడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఉగ్రవాదులు దేశభక్తులా?

» పాక్ ఉపప్రధానిని ప్రశ్నించిన క్రికెటర్ కనేరియా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్‌గామ్‌లో దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులు దేశభక్తులని పాక్ ఉప ప్రధాని ఇషాక్ దర్ ప్రశంసించడాన్ని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తప్పుపట్టారు. ఆయన ఎక్స్‌లో పోస్టు పెడుతూ ఉగ్రవాదులను దేశభక్తులనడం అవమానకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వమే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న వాదనను బహిరంగంగా అంగీకరించినట్టయిందని పేర్కొన్నారు.

చుక్క నీరు పోనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. త్వరలోనే ఆయా నదుల్లో పూడికతీత పనులు పూర్తిచేసి, నీటిని మళ్లిస్తాం" అని ఆయన వివరించారు. అనంతరం.. "సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయం న్యాయబద్ధమైనది. అది దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం. సింధు జలాల్లో ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా మేం చూస్తాం" అని ఆయన 'ఎక్స్'లో కూడా పోస్ట్ చేశారు. పర్యాటకులపై దాడి నేపథ్యంలో అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా.. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్న బలమైన సందేశాన్ని భారతదేశం పాక్‌కు పంపిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. తాజా పరిణామాల నేపథ్యంలో సింధు జలాల వినియోగం నిమిత్తం చేపట్టిన వివాదాస్పద కాల్వల ప్రాజెక్టును పాక్ ఉపసంహరించుకుంది.



బాంబు పేలుడులో ధ్వంసమైన ఉగ్రవాది ఆదిల్ ఇల్లు

మరిన్ని దాడులు?

కశ్మీర్‌లోని స్థానికేతరులు, రైల్వే ఆస్తులు, పండిట్లే లక్ష్యంగా దాడులకు ఉగ్రవాదులు క్రియాశీలంగా ప్రణాళికలు రచిస్తున్నారంటూ నిఘా వర్గాలు అందించిన సమాచారంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న రైల్వే సిబ్బందిలో చాలా మంది స్థానికేతరులే. చాలా మంది రైల్వే భద్రతా సిబ్బంది తరచుగా తమ బ్యారక్‌ల నుంచి బయటకు వచ్చి స్థానిక మార్కెట్లకు వెళ్తుంటారు. నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో.. బ్యారక్‌ల నుంచి బయటకు వెళ్లినవారిపై దాడులు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అలా వెళ్లొద్దంటూ అధికారులు వారిని ఆదేశించారు. ఉగ్రవాదులే కాక.. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కూడా శ్రీనగర్, గాందర్‌బల్ జిల్లాల్లో కశ్మీరీ పండిట్లు, పోలీసులే లక్ష్యంగా దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్టు హెచ్చరికలు జారీ అయ్యాయి. మరోవైపు.. పహల్గాం దాడి నేపథ్యంలో భారత సైన్యం ఉగ్రవాదులపై వేటను ముమ్మరం చేసింది. పారామిలటరీ బలగాలకు సెలవులు రద్దు చేసింది. సెలవుపై ఉన్న జవాన్లు వెంటనే తిరిగి వచ్చి విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. జమ్మూకశ్మీర్ అంతటా భద్రత బలగాలను మోహరించారు. శ్రీనగర్ విమానాశ్రయంలో భద్రతను పెంచారు. అన్ని వైమానిక స్థావరాల్లో యుద్ధ విమానాలను సిద్ధం చేస్తున్నారు. సైనికులను సరిహద్దులకు తరలిస్తున్నారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకుని భద్రత పరిస్థితిని సమీక్షించారు.

పాక్ దుస్సాహసం..ఎల్‌వోసీ వద్ద కాల్పులు

పహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్‌పై పాకిస్థాన్ కాల్పులకు తెగబడింది. కాల్పుల విరమణను ఉల్లంఘించి నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో భారీఎత్తున కాల్పులు ప్రారంభించింది. భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శ్రీనగర్, ఉధంపూర్‌లో పర్యటించడానికి కొన్ని గంటల ముందు ఈ దుశ్చర్యకు దిగింది. అయితే భారత జవాన్లు దీటుగా తిప్పికొట్టారు. కాగా.. ఎల్‌వోసీ వెంబడి పాక్ తన సేనలను రెట్టింపు చేసింది. భారత్ ఏ క్షణమైనా సైనిక దాడి చేయవచ్చన్న అంచనాతో పెద్దఎత్తున బలగాలను తరలిస్తోంది. అయితే సైనికులంతా బంకర్లలోనే ఉండి.. పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించింది. పాక్ ఆపరేషనల్ కంట్రోల్-కమాండ్ చూసే పదాతిదళం పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ ఆదేశించారు.

అది ముమ్మాటికీ ఉగ్రదాడే!

జమ్మూకశ్మీర్‌లోని పహల్ గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని అమెరికాలోని ప్రముఖ మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్'.. 'తీవ్రవాద దాడి'గా పేర్కొనడాన్ని అగ్రరాజ్యానికి చెందిన విదేశీ వ్యవహారాల హౌస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. "అది ముమ్మాటికీ ఉగ్రదాడే. మీరు తీవ్రవాద దాడి అని ఎలా తీర్మానిస్తారు?" అని మీడియా సంస్థను నిలదీసింది. అంతేకాదు.. సదరు పత్రిక ఈ కథనానికి పెట్టిన శీర్షికను సవరించి 'తీవ్రవాదులు' అనే పదాన్ని 'ఉగ్రవాదులు'గా మార్చి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కమిటీ సభ్యులు షేర్ చేశారు.

సరిహద్దుల్లో రాఫెల్స్ గర్జన

జమ్ము కశ్మీర్‌లోని పహల్ గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత వాయుసేన(ఐఏఎఫ్) పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలే పంపించింది. సరిహద్దు వెంబడి 'ఎక్సర్‌సైజ్ ఆక్రమణ్' పేరుతో యుద్ధ విన్యాసాలు చేసింది. గురువారం చేపట్టిన ఈ విన్యాసాల్లో భారీ సంఖ్యలో రాఫెల్స్, ఎస్‌యూ-30ఎంకేఐ, ఎస్-400, మిగ్-21 యుద్ధ విమానాలు గగనతలంలో గర్జించాయి. వీటితోపాటు.. గరుడ కమాండోలు, ఎయిర్‌బార్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్, మిడ్ ఎయిర్ రెఫ్యూయెర్స్ కూడా పాల్గొన్నాయి. ముఖ్యంగా ఉగ్రవాదులు దాడి జరిపిన చోట ఉన్న మైదాన ప్రాంతాలు, ఎత్తయిన పర్వత ప్రాంతాల పైన ఈ విన్యాసాలు సాగినట్టు మీడియా తెలిపింది. రాబోయే చార్‌ధామ్ యాత్ర కోసం ఉత్తరాఖండ్ పోలీసులు భద్రతను కట్టు దిట్టం చేశారు.

భద్రతాదళాలే లక్ష్యంగా..

పహల్గాం దాడిలో కీలకపాత్ర పోషించిన ఇద్దరు ఉగ్రవాదులు.. ఆదిల్ హుసేన్, అసిఫ్ షేక్ ఇళ్లలో గురువారం రాత్రి భారీ పేలుళ్లు జరిగాయి. రెండు ఇళ్లూ నేలమట్టమయ్యాయి. దర్యాప్తులో భాగంగా వారి నివాసాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన భద్రతా దళాలు.. అక్కడ అనుమానాస్పద వస్తువులను గుర్తించి బయటకు వచ్చేశాయి. ఆ తర్వాత పేలుళ్లు సంభవించాయి. దర్యాప్తు అధికారులు తమను వెతుక్కుంటూ అక్కడికి వస్తారని ముందుగానే ఊహించి.. వారిని లక్ష్యంగా చేసుకుని పేలుడు జరిపేందుకే ఉగ్రవాదులు వాటిని అక్కడ ఉంచారని జమ్ముకశ్మీర్ పోలీసు అధికారి ఒకరు అన్నారు.

హమాస్ హస్తం?

మరోవైపు 2023, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి, తాజాగా పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండకు పోలికలు ఉన్నాయని భారత్‌కు ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ అన్నారు. రెండు ఘటనల్లోనూ సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాద గ్రూపుల మధ్య సమన్వయం పెరుగుతోందని, అన్ని స్థాయిల్లో సహకరించుకుంటున్నారని, ఒకరినొకరు అనుకరిస్తున్నారని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లో మ్యూజిక్ ఫెస్టివల్‌ను జరుపుకుంటున్న వారిపై హమాస్ దాడులకు తెగబడినట్లుగానే.. పహల్గాంలో అమాయక పర్యాటకులకు ఉగ్రవాదులు దాడి చేశారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ఇటీవల హమాస్ నేతలు పర్యటించారని, అక్కడ జైషే మహ్మద్ ఉగ్రవాదులు తదితరులను కలిసినట్లు తెలిసిందని తెలిపారు. ఆ తర్వాతనే జరిగిన పహల్గాం దాడి అనుమానాలకు తావిస్తోందన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులైన వారిని వేటాడుతామని ప్రధాని మోదీ చేసిన ప్రకటనతో పాటు భారత్ తీసుకున్న 1960 నాటి సింధూ జలాల ఒప్పందం రద్దు తదితర చర్యలను ప్రశంసించారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు పెట్టండి

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం చేసి ప్రపంచానికి దేశ ఐకమత్యాన్ని చాటుదామని, ఇందుకోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబాల్ ప్రధాని మోదీని కోరారు. అంతేకాక, అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను వివిధ దేశాలకు పంపి పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని పెంచాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన 10 మంది సైనికులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ చేతిలో హతమయ్యారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టా శివారు ప్రాంతంలో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన సైనికులు ప్రయాణిస్తున్న వాహనాన్ని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ).. రిమోట్ కంట్రోల్ ఐఈడీ ఉపయోగించి పేల్చేసింది.



అవును.. ఉగ్రవాదాన్ని పోషించాం..

ఉగ్రవాదం విషయంలో దాయాది దేశం తన ముసుగు తానే తొలగించుకుంది. 'అవును.. ఉగ్రవాదులకు మా గడ్డపై శిక్షణ, నిధులు అందిస్తున్నాం' అంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమదేశాల కోసం ముప్ఫై ఏళ్లుగా ఈ చెత్త పనులు తాము చేస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. 'స్కై న్యూస్.ఇన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. పాక్ నిజ స్వరూపాన్ని ఆయన బయటపెట్టేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికే ఇదంతా చేశామనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడారు. "నిజమే, మేం ఈ చెత్త పనులను (ఉగ్రవాదులకు నిధులు, శిక్షణ) అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసం చేశాం" అని ఖవాజా తెలిపారు. ఇంతలోనే సర్దుకుని, ఆ పొరపాటును గ్రహించామని, దాని ఫలితాన్ని కూడా అనుభవిస్తున్నామని చెప్పారు. పహల్గాం దాడి తమ పనేనని లష్కరే తాయిబా అనుబంధ సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించుకుంది. దీనిపై వేసిన ప్రశ్నకు ఖవాజా స్పందిస్తూ.. లష్కరే తాయిబా ఇప్పుడు పాక్‌లో ఉనికిలో లేదని, రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే సంస్థ పేరు వినసే లేదని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ దాడిని పురస్కరించుకుని పాక్‌పై రక్షణ చర్యలకు భారత్ ఉపక్రమిస్తోందంటూ ఆయన ఎదురుదాడికి ప్రయత్నించారు. తమ భూభాగంలో భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ నోరు పారేసుకున్నారు.

"మీరు నీళ్లు ఆపేస్తే.. మేము మీ ఊపిరి ఆపేస్తాం"

» హఫీజ్ సయీద్ భారత్‌ను బెదిరిస్తున్న పాత వీడియో వైరల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 : పహల్గాం ఉగ్రదాడికి బదులుగా భారత్ సింధు జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన నేపథ్యంలో పాకిస్థాన్ పరోక్ష బెదిరింపులకు దిగింది. 2008 ముంబై ఉగ్రదాడి సూత్రధారి, లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్.. సింధు జలాల అంశంలో భారతదేశాన్ని, ప్రధాని మోదీనీ తీవ్రంగా హెచ్చరిస్తున్న ఓ పాత వీడియోను బయటకు తీసింది. "మీరు పాకిస్థాన్‌కు నీళ్లు ఆపేస్తే, మేము మీ ఊపిరి ఆపేస్తాం. నదుల్లో రక్తం పారుతుంది" అంటూ హఫీజ్ సయీద్ ఓ బహిరంగ సభలో భారత్‌ను హెచ్చరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసింది.

బందీపోరాలో ఎదురుకాల్పులు: లష్కర్ కమాండర్ లల్లీ హతం

శ్రీనగర్, ఏప్రిల్ 25: జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు భద్రతా బలగాలు ముమ్మరంగా కృషి చేస్తున్నాయి. శుక్రవారం బందీపోరా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కర్ ఎ తోయిబాకు చెందిన అగ్రస్థాయి కమాండర్ అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. పహల్గాం దుర్ఘటన అనంతరం పోలీసులు-భద్రతా బలగాలు ఉమ్మడిగా గాలింపు చర్యలు చేపడుతుండగా కుల్నార్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టు కచ్చితమైన సమాచారం అందింది. బలగాలు అజాస్ ప్రాంతం వద్దకు రాగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో మొదట ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అనంతరం జవాన్లు దీటుగా సమాధానం ఇవ్వడంతో అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం వారు కోలుకుంటున్నారు.

పాకిస్థానీలను వెనక్కి పంపండి

(మొదటి పేజీ తరువాయి)



అట్టారీ-వాఘా చెక్‌పోస్టు వద్ద స్వదేశానికి వెళ్తున్న పాకిస్థానీలు

తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని కోరారు. పాకిస్థానీలకు ఇచ్చిన వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో నిర్దేశిత గడువు తర్వాత ఒక్క పాకిస్థానీ కూడా దేశంలో ఉండవద్దని షా స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రులను కోరారు. ఆయా రాష్ట్రాల్లో ఎంత మంది పాకిస్థానీలు ఉన్నారో లెక్క తీయాలని, వారందరినీ తిప్పి పంపేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ఫోన్ చేసి తెలంగాణలోని పాకిస్థానీలను పంపించేయాలని షా చెప్పారు. వాస్తవానికి హైదరాబాద్‌లోని అనేక ముస్లిం కుటుంబాలకు పాకిస్థాన్ దేశస్థులతో పెళ్లి సంబంధాలు, బంధుత్వాలు ఉన్నాయి. అలాగే అనేక మంది పాకిస్థానీలు వైద్యం కోసం హైదరాబాద్ వస్తుంటారు. వీరిలో సరైన పత్రాలు, వీసాలతో వచ్చేవారితో పాటు అక్రమంగా వచ్చి వెళ్లే వారూ ఉంటారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసినట్లు రేవంత్‌కు అమిత్‌షా తెలిపారు. పాక్ పౌరులను పంపించివేయాలని చెప్పారు. సాధారణ వీసాపై వచ్చిన పాక్ వాసులు ఈ నెల 27 కల్లా, మెడికల్ వీసాపై వచ్చిన వారు 29 కల్లా దేశం విడిచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. షాతో మాట్లాడిన అనంతరం పాక్ పౌరులను పంపించే విషయంలో తగు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని ఆదేశించారు.

హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో డీజీపీ జితేందర్ ఓ ప్రకటన విడుదల చేశారు. సాధారణ వీసాలపై వచ్చిన పాకిస్థానీలు ఈ నెల 27 కల్లా, వైద్య వీసాలపై వచ్చినవారు 29 కల్లా దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్నట్లు తెలిపారు. నిర్దేశిత గడువులోగా పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుంటే చట్టరీత్యా చర్యలుంటాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 8 మంది మెడికల్ వీసాలపై, 156 మంది లాంగ్‌టర్మ్ వీసాలపై, నలుగురు షార్ట్ టర్మ్ వీసాలతో వచ్చారని, మిగిలిన వారు ఇతర పనులపై వచ్చారని తేల్చారు.

జైల్లో ఒకరు.. పోలీసుల అదుపులో మరొకరు

రాష్ట్ర జైల్లో ఏళ్ల తరబడి ఉంటున్న పాక్ ఖైదీని ఏం చేయాలనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాడంటూ పాక్‌కు చెందిన నజీర్(55)ను రాజస్థాన్ పోలీసులు పట్టుకున్నారు. విచారణలో తాను హైదరాబాదీనని చెప్పడంతో అతన్ని తెలంగాణ పోలీసులకు అప్పగించారు. అయితే అక్రమంగా చొరబడినట్లు తేలడంతో నజీర్‌కు కోర్టు ఐదేళ్ల శిక్ష విధించింది. 2018లోనే శిక్ష పూర్తయినా నజీర్ ఇంకా జైల్లోనే ఉన్నాడు. అతని విషయాన్ని అధికారులు పాకిస్థాన్ ఎంబసీ దృష్టికి తీసుకెళ్లగా.. తమ దేశస్థుడు కాదని చెప్పడం గమనార్హం. ఇప్పుడు నజీర్ విషయంలో ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కాగా, హైదరాబాద్ పోలీసుల అదుపులో ఉస్మాన్ అనే పాకిస్థానీ ఉన్నట్లు సమాచారం.

బెంగళూరులో పాకిస్థానీయులను గుర్తిస్తాం

» హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో అధికారికంగా, అనధికారికంగా నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తిస్తామని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాకిస్తానీలను వెనక్కు పంపే విషయంలో వివాదం లేదని, ఇప్పటికే వీసాలు రద్దు చేశారని వివరించారు. బెంగాళూరులో అనధికారికంగా ఉంటున్న పాకిస్థానీల కోసం పోలీసులు గాలిస్తున్నారని తెలిపారు. జాతీయ భద్రత విషయంలో ఇంకా కఠినమైన నిర్ణయాలు రావాల్సి ఉందని పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, పహల్‌గామ్‌లో ప్రభుత్వం ఎందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రశ్నించిన సీనియర్ జర్నలిస్టుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. జమ్మూ-కశ్మీర్‌లోని కథువాలో బీజేపీ కార్యకర్తలు పహల్‌గామ్ దాడికి నిరసనగా ధర్నా చేశారు. అయితే అక్కడ భద్రతపరమైన లోపాలు ఎందుకు ఉన్నాయని దైనిక్ భాస్కర్ రిపోర్టర్ రాకేశ్ శర్మ, మరికొందరు విలేకరులు వారిని ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నలు వేసి, వేర్పాటువాదుల భాష మాట్లాడుతావా అంటూ బీజేపీ కార్యకర్తలు ఆయనపై దాడి చేశారు.

సైనికంగా బుద్ధి చెప్పేందుకు నాలుగు మార్గాలు

పాక్‌పై మిలటరీ చర్యల అంశంలో రక్షణ నిపుణుల అంచనాలు


న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ సైనికపరంగా ఎలాంటి చర్యలు చేపట్టవచ్చనే దానిపై రక్షణ రంగ నిపుణులు నాలుగు అంశాలను వివరిస్తున్నారు.

ఆధునిక యుద్ధ విమానాలతో దాడి

రఫేల్, మిరేజ్ 2000 వంటి అత్యాధునిక యుద్ధ విమానాలు, వాటికి అమర్చిన క్షిపణులతో పాకిస్థాన్‌లోని లక్ష్యాలపై దాడులు చేయవచ్చు. అత్యంత వేగంగా, కచ్చితత్వంతో ఉగ్ర, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేసేందుకు అవకాశం ఉంటుంది. పాక్‌కు భారీ నష్టం కలిగించవచ్చు. అయితే ఇది ఒక రకంగా యుద్ధానికి పురికొల్పడమే. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చే అవకాశాలు ఎక్కువ.

నియంత్రణ రేఖ వెంట దాడులు

పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ)కు విలువ లేకుండా పోతుంది. అంటే మన సైన్యం దాన్ని దాటి ముందుకు చొచ్చుకెళ్లి.. పాక్ ఔట్‌పోస్టులు, ఉగ్రస్థావరాలపై దాడి చేయవచ్చు. కానీ అక్కడి భౌగోళిక పరిస్థితులపై అవగాహన లేక ఇబ్బంది తప్పదు. పాక్ సైన్యం ముందే సిద్ధంగా ఉండి దూకుడుగా ప్రతిదాడి చేయవచ్చు. నష్టం ఇరువైపులా ఉంటుంది.



సిమ్లా ఒప్పందం జరిగిన టేబుల్‌పైన పాక్ జెండాను తొలగించిన దృశ్యం

సర్జికల్ దాడులు

వ్యూహాత్మక మిలటరీ స్థావరాలు, ఉగ్ర క్యాంపులపై సర్జికల్ దాడులు చేయవచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పాక్ ముందే సిద్ధంగా ఉండే అవకాశాలు ఎక్కువ. పక్కా ప్రణాళిక, లక్ష్యాల వద్ద పరిస్థితిని నిరంతరం గమనించే నిఘా, అధునాత బలగాలు అవసరం. దీనితో పాక్‌కు కలిగే నష్టం అంత ఎక్కువగా ఉండకపోవచ్చు.

సరిహద్దు ఇవతలి నుంచే

నియంత్రణ రేఖ లోపలే ఉండి.. శతఘ్నులు, భారీ మోర్టార్లు, గన్‌లతో నియంత్రణ రేఖ వెంట పాక్ స్థావరాలు, ఔట్‌పోస్టులు, సరఫరా వ్యవస్థలను ధ్వంసం చేయవచ్చు. కచ్చితంగా గురిపెట్టి లక్ష్యాలను ఛేదించే స్నైపర్ ఆపరేషన్లు నిర్వహించవచ్చు. కానీ దీనివల్ల ఆ దేశానికి జరిగే నష్టం పరిమితంగానే ఉంటుంది.

ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజారావు



హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజారావు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జారీ చేశారు. తక్షణమే ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని అందులో పేర్కొన్నారు. దీంతో డాక్టర్ రాజారావు వెంటనే బాధ్యతలు స్వీకరించారు. గతంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ రాజారావు.. గత ఏడాది ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో.. అడిషనల్ డీఎంఈ హోదాలో యాదాద్రి భువనగిరి బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. కరోనా సమయంలో గాంధీ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించడంలో సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజరావు కీలక పాత్ర పోషించారు.

జైళ్లలో భద్రతా తనిఖీలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జైళ్లలో పరిస్థితిని తెలుసుకునేందుకు డీజీ సౌమ్య మిశ్రా ప్రత్యేకంగా అధికారుల్ని పంపించి తనిఖీ చేయిస్తున్నారు. జైళ్లలో ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి? వాటి పనితీరు ఎలా ఉంది? భద్రతా సిబ్బంది ఎంత మంది విధుల్లో ఉన్నారు? ఎక్కడైనా భద్రతా లోపాలున్నాయా? టెక్నాలజీ వాడకం.. తదితర అంశాలపై అధికారులు పరిశీలిస్తున్నారు. జైళ్లను సందర్శించిన అధికారులు పరిశీలన అనంతరం డీజీకి సమగ్ర నివేదిక అందజేస్తున్నారు. వాటి ఆధారంగా అన్ని జైళ్లలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై తగు ఆదేశాలు జారీ చేయనున్నారు.

ఉద్యోగ విరమణ రోజే పింఛను చెల్లింపు

- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ విరమణ పొందిన రోజే పింఛను చెల్లింపు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్ తెలిపారు. అకౌంటెంట్ జనరల్ ఏఅండ్‌ఈ, కలెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పింఛను అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా చందాపండిట్ మాట్లాడుతూ..ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పింఛను, సాధారణ భవిష్యనిధి పత్రాలు అందిన వెంటనే పరిశీలించి.. మంజూరు ఉత్తర్వులు అందిస్తామన్నారు.

బీజేపీ కేసులో రేవంత్‌కు ఊరట

- వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరించారని నాంపల్లి ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో నమోదైన కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. తనపై దాఖలైన కేసు కొట్టేయాలంటూ రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు స్వీకరించిన జస్టిస్ కె.లక్ష్మణ్ సారథ్యంలోని ధర్మాసనం.. దిగువ కోర్టులో ప్రత్యక్షంగా హాజరు కాకుండా ఆయనకు హైకోర్టు మినహాయింపునిచ్చింది. అయితే, ఆ కేసును కొట్టివేయడానికి మాత్రం నిరాకరించింది. సీఎం క్వాష్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారు కాసం వెంకటేశ్వర్లుకు, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేసింది.

క్యాన్సర్‌తో బాధపడుతున్నా.. బెయిల్ ఇవ్వండి

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు వాదన

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఫోన్‌ట్యాపింగ్ కేసు నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చేసిన వినతిపై శుక్రవారం హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. క్యాన్సర్‌తో బాధపడుతున్నానని ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలను పోలీసులు ఖండించారు. ఆయన చెప్పేవి సాకులని, వ్యక్తిగత లాభం కోసం ఫోన్ ట్యాపింగ్‌ను వినియోగించుకున్నందున బెయిల్ ఇవ్వవద్దని కోరారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభాకరరావు తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 65 ఏళ్ల వయసులో ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే వెంటనే హైదరాబాద్‌కు వచ్చి దర్యాప్తునకు సహకరిస్తారని చెప్పారు. ఈ వాదనను ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు ఖండించారు. పాస్‌పోర్టు రద్దుకావడం, రెడ్ కార్నర్ నోటీసులు జారీ కావడం వల్లనే భారత్‌కు వస్తున్నారే తప్ప, తనంతటతానుగా కాదని చెప్పారు. వయసును సాకుగా చూపించి దర్యాప్తు నుంచి తప్పించుకోలేరని అన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతుంటే పదవీ విరమణ తర్వాత ఓఎస్‌డీగా ఎలా కొనసాగారని ప్రశ్నించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ ఈ నెల 29కు వాయిదా వేశారు.

అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చేయూత

- భోజనం సరఫరాకు వాహనాల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అక్షయపాత్ర ఫౌండేషన్‌కు హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో), ఫ్రాంక్లిన్ టెంప్లేటోన్ సర్వీసెస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ చేయూత అందించాయి. వంటగది పరికరాలు, భోజనం సరఫరా చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాలకు సుమారు రూ.88 లక్షలు హడ్కో ఆర్థిక సాయం అందించింది. ఫ్రాంక్లిన్ టెంప్లేటోన్ సర్వీసెస్ మధ్యాహ్న భోజన సరఫరా వాహనాన్ని ఇచ్చింది. ఈ రెండు సంస్థల సహకారంతో తాము ఎక్కువ మంది విద్యార్థుల వద్దకు ఆహారాన్ని చేర్చగలుగుతామని అక్షయపాత్ర ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీసత్యగౌరచంద్ర దాస తెలిపారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను బహిష్కరించాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ డిమాండ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను ప్రజలు బహిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ పిలుపునిచ్చింది. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, ఆయన కుటుంబం అక్రమంగా సంపాదించిన సొమ్మును స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేసింది. ఉద్యమకారులపై పెట్టిన ఉపా వంటి కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి తదితరులు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి మూడేళ్లు మాత్రమేనని రజతోత్సవం పేరుతో మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

- 34 బోధనాస్పత్రుల్లో 20పడకలతో జెరియాట్రిక్ విభాగం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 34 బోధనాస్పత్రుల్లో వృద్ధులకు వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా జెరియాట్రిక్ విభాగం ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. డార్క్ బ్లూ, బ్లూ రంగుల్లో ప్రత్యేకంగా కనిపించే ఈ విభాగం సేవలు వచ్చేనెల రెండోవారంలో ప్రారంభించడానికి వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి ఆస్పత్రిలోనూ వారి కోసం 20 పడకలతో ఏర్పాటు చేసే ప్రత్యేకంగా కనిపించేలా చర్యలు తీసుకుంటోంది. ఓపీ విభాగంలో జనరల్ మెడిసిన్ వైద్యులతోపాటు రోగుల సమస్యను బట్టి స్పెషలిస్టుల వైద్య సేవలందుతాయి. ముదిమి వయస్సులో ఉండటం వల్ల కీళ్లనొప్పులతో నడవలేని పరిస్థితితో సతమతమయ్యే వారికి ఫిజియోథెరపీ సేవలుంటాయి. గాంధీ బోధన ఆసత్రిరలో ప్రస్తుతం నాలుగు జెరియాట్రిక్ ఎండీ సీట్లు ఉండటంతో ఇప్పటికే అక్కడ ఆ విభాగం విడిగా ఏర్పాటైంది. ఇందులో ప్రధానంగా మెంటల్, మొబిలిటీ, ఐ కేర్, డెంటల్ సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు నరేంద్ర కుమార్ తెలిపారు.

కేసీఆర్ మాటే వేదం

(మొదటిపేజీ తరువాయి)

వేశారు. కేంద్రంలో బీఆర్ఎస్ పాత్ర కీలకం అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం చంద్రబాబు, నితీశ్‌లపై ఆధారపడి కేంద్రం నడుస్తోంది. అసెంబ్లీలో గెలిచి, లోక్‌సభలో పొరుగు రాష్ట్రాలతో కలిసి 30-40 ఎంపీ సీట్లు బీఆర్ఎస్ గెలిస్తే ఇప్పుడు కేంద్రంలో కీలకం అయ్యే వాళ్లం. తెలంగాణకు ఎంతో మేలు జరిగేది. తెలంగాణ సాధన కోసమే పార్టీ పెట్టాం. ఎవరూ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి అందించాం. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒక పార్టీగా వైఫల్యాలకు ఆత్మ విమర్శ చేసుకోవడం మా బాధ్యత.

సభ ఎలా ఉంటుంది? ప్రభుత్వ వైఫల్యాలా? మీ పార్టీ ఆత్మవిమర్శా?

ప్రతిపక్షంగా సర్కారు వైఫల్యాలను ప్రశ్నిస్తాం. పాలించే అవకాశం వాళ్లకి, ప్రశ్నించే అధికారం మాకు ప్రజలు ఇచ్చారు. కేసీఆర్ ఏం మాట్లాడతారో ముందే ఎలా చెబుతాం. పేపర్ లీకేజీ అవుతుంది.

కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదు?

అదో వ్యూహం. ఎన్టీఆర్, బాబు, జయలలిత కూడా గతంలో ఒక ప్రతిజ్ఞ చేసి అసెంబ్లీకి వెళ్లలేదు. సభలో మేం సర్కారును ప్రశ్నిస్తున్నాం. మా లైన్ అంతా కేసీఆరే ఇస్తున్నారు. కాంగ్రెస్ వచ్చాక పరిపాలన వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. పెట్టుబడులు రావడం లేదు. రియాల్టీ దెబ్బతింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మందగించింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఎందుకా పరిస్థితి వచ్చింది?

పోటీ చేయకుండా ఉండటం కూడా ఒక వ్యూహం. ఆ ఒక్క సీటుకు పోటీ చేసినా అందులో గెలిచినా ఉపయోగం లేదు. ప్రభుత్వం పడిపోయేది లేదు. ఎప్పుడు పోటీ చేయాలి ఎప్పుడు వద్దు అనేది పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోమని ముందే చెప్పాం.

కేసీఆర్ కామెంట్స్, నేతల అహంకారం వల్లే ఓడిపోయారా?

మాలో ఎవరికి అహంకారం లేదు. మాలో కొందరి మాటతీరు, ప్రశ్నించే తీరు వల్ల అలా కనిపించవచ్చు. ప్రజలు మమ్మల్ని పూర్తిగా తిరస్కరించ లేదు. మాకు గౌరవప్రదమైన సీట్లు ఇచ్చారు. ఆయన కామెంట్ల వల్లే మేం ఓడిపోలేదు. ప్రజలు ఆశీర్విదిస్తే పాలిస్తం..లేకుంటా తప్పుకుంటామని కేసీఆర్ సహజంగా చెప్పారు. మళ్లీ కేసీఆరే కావాలని రైతులు కోరుకుంటున్నారు.

వారసులు ఎవరు?

కేసీఆరే మా నాయకుడు. మళ్లీ ఆయనే మా సీఎం. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా పాటిస్తాం. కట్టుబడి ఉంటాం. కేసీఆర్ నాకు ఏ బాధ్యతలు



అప్పగిస్తే వాటిని సంతోషంగా స్వీకరిస్తా. నేను కార్యకర్తను. ఉద్యమ కారుడిని. ఇచ్చిన పాత్రకు న్యాయం చేస్తా.

కేటీఆర్, కవిత మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందా?

అదంతా సోషల్ మీడియా చేస్తోంది. గిట్టని వాళ్ల దుష్ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనపై కూడా ఇలాగే దుష్ప్రచారం చేశారు. ప్రజలు నమ్మారు.

రేవంత్ టార్గెట్‌గా మీ రాజకీయాలు ఉన్నాయి?

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన్ను కాల్చిపారేయాలని రేవంత్ అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా రెచ్చగొట్టే భాష మాట్లాడుతున్నారు. ఆయన ఇష్టం వచ్చినట్లు మాట్లాడతానంటే ఆయన భాషలోనే కొందరు సమాధానం చెబుతారు.

కాంగ్రెస్‌లో ఒకరిద్దరు తప్ప మిగతా వారు రేవంత్‌ను కాచుకోవడం లేదు?

అది కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారం. రేవంత్ కూడా ఆయన పరిధి దాటి మాట్లాడుతున్నారు. ఆ విషయాన్ని ఆయనకు ఆ పార్టీ వాళ్లే చాలాసార్లు చెప్పారు. కాంగ్రెస్‌కు నష్టం చేస్తుందని వాళ్లే చెబుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాదిరిగా మాట్లాడితే వాళ్లెందుకు ఆయన్ను కాపాడుకుంటారు? ప్రజల్ని మోసం చేస్తే వాళ్లెందుకు కాపు కాస్తారు? ఈ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని, రేవంతే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా. ఐదేళ్లుంటే మళ్లీ 20 ఏళ్లు కాంగ్రెస్‌కు ఓటేయ్యరు.

బీజేపీ, బీఆర్ఎస్ బంధం ఏంటి?

బీజేపీకి బీఆర్ఎస్ దగ్గరగా ఉండదు. కేంద్రంలో కీలకంగా ఉండాలనేది మా లక్ష్యం. ఎంపీ జనరల్ ఎన్నికల్లో బీజేపీకి దూరంగానే ఉన్నాం. ప్రత్యేక పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ అనే పద్ధతిలో జరిగాయి. రెండు పార్టీలు ఎనిమిదేసి చొప్పున గెలిచి ఉపయోగం లేకుండా పోయింది. నిధులు కూడా తీసుకురాలేక పోయారు.

బీఆర్ఎస్‌పై కుంభకోణాల ఆరోపణలకు వరంగల్ సభలో బదులిస్తారా?

సభలో ఏం మాట్లాడాలో మా వ్యూహం మాకుంది. మమ్మల్ని ఇబ్బంది పెట్టాలనే కేసులు బయటకు తెస్తున్నారు. కోర్టుల్లో అవి నిలబడవు.

కేటీఆర్, కవిత రౌడీలుగా మారామంటున్నారు. మీరేందుకు మారడం లేదు?

పోలీసులు కేడర్‌ను ఇబ్బంది పెడుతున్న సందర్భంలో ఆ వ్యాఖ్యలు చేశారు.

అధికారంలో లేకపోతే ఎలా ఉంది?

సర్కారులో ఉన్నదానికంటే ఉద్యమంలో ఉండటమే ఎక్కువగా సంతృప్తినిచ్చింది. ప్రతిపక్షంలో సమర్థంగా అధికారపక్షాన్ని నిలదీస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకుడిగా పరిణతి చెందుతాం. శాసన సభకు బాగా ప్రిపేర్ అయి వెళ్తున్నాం. మంత్రిగా ఉన్నప్పుడు నిద్ర కూడా పోలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నాడు అద్దాల మేడలో ఉన్నట్లు ఉండేది. ప్రస్తుతం ప్రజలకు దగ్గరయ్యే గొప్ప అవకాశం లభించింది. ప్రతిపక్ష నేతగా ఎంజాయ్ చేస్తున్నా.

అరాచకాన్ని అరికట్టేందుకు

నాడు రామదండు.. నేడు గులాబీ దండు

- తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగుబంధం: హరీశ్ రావు
- 27న నిర్వహించనున్న ఎల్కతుర్తి సభకు పాదయాత్రగా వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25: లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామ దండు కదిలిందని.. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాన్ని అడ్డుకునేందుకు గులాబీ దండు కదిలిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి వద్ద అమరుల స్థూపానికి ఆయన నివాళులర్పించారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి దాదాపు 1500 మంది యువకులు, పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని చెప్పారు.ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకైనా, 2001లో బీఆర్ఎస్ ఆవిర్భవించిన సందర్భమైనా.. అన్నింటితో సిద్దిపేటకు పేగు బంధం ఉందన్నారు. ఈ పాదయాత్ర బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి విజయయాత్ర కాబోతున్నదని స్పష్టం చేశారు. దేశంలో చాలా పార్టీలు పుడుతుంటాయి.. పోతుంటాయి.. కానీ, బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడిందని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా చరిత్రలో నిలిచినట్లు పేర్కొన్నారు. 14 ఏళ్ల ఉద్యమం, పదేళ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం, ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షాన నిలబడుతుందని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, ఆ పార్టీ మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.



సిద్దిపేటలో జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు



రెండు నెలలుగా గోదాంలో నిల్వ ఉంచిన నగదు

కరెంటు.. సీసీటీవీలు లేని గోదాంలో 8.5 కోట్లు

- ఏటీఎంలలో జమ చేయాల్సిన డబ్బు
- సెక్యూరిటీ సంస్థ గోదాంలో పర్యవేక్షణ లేకుండా పడి ఉన్న వైనం
- సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవటంతో రెండు నెలలుగా విధులకు దూరం
- బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో వెలుగులోకి.. హైదరాబాద్‌లో ఘటన

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆ గోదాంలో కరెంటు లేదు.. సీసీటీవీలు లేవు.. అయినా, అందులో ఏకంగా రూ.8.5కోట్లకుపైగా నగదు నిల్వ ఉంది. ఆ డబ్బును ఎత్తుకెళ్లినా పట్టించుకునే నాథుడు లేడు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీ-సెక్యూర్ వాల్యూ ఇండియా ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన గోదాం అది. ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఎస్ బ్యాంకు, ధనలక్ష్మి, కోటక్ తదితర బ్యాంకులకు చెందిన 107 ఏటీఎంలలో ఈ సెక్యూరిటీ సంస్థలు డబ్బులు డిపాజిట్ చేస్తుంటాయి. అయితే, కొన్ని రోజులుగా ఏటీఎంలలో డబ్బులు జమ కాకపోవడంతో ఆయా బ్యాంకుల అధికారులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయటంతో.. గోదాంలో దిక్కు లేకుండా పడి ఉన్న రూ.8.52కోట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు గోదాంను పరిశీలించారు. నగదు అక్కడే ఉండటంతో బ్యాంకు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కనీసం కరెంటు, సీసీటీవీల నిఘా, భద్రత ఏర్పాట్లు లేకుండా రెండు నెలలుగా ఇంత పెద్ద మొత్తంలో డబ్బు నిల్వ చేయడంపై పోలీసులు సదరు సెక్యూరిటీ సంస్థపై అసహనం వ్యక్తం చేశారు. ఆ సెక్యూరిటీ సంస్థలో పనిచేసే సిబ్బందికి 4 నెలలుగా వేతనాలు చెల్లించటం లేదని, దీంతో వారు రెండు నెలలుగా రావటం విధులు మానేశారని వెల్లడైంది. ఫలితంగా, ఏటీఎంలలో జమ చేయాల్సిన రూ.8.52 కోట్లు గోదాంలోనే ఉండిపోయాయి. ఈ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయం ముంబైలో ఉందని, తాము అక్కడికి వెళ్లి కలిసినప్పటికీ వారు స్పందించడంలేదని ఏజెన్సీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ ఏమీ జరగలేదని తెలిపారు.

సీఎంగానే అసెంబ్లీకి కేసీఆర్

ఆ దిశగా బీఆర్ఎస్ శ్రేణులు పని చేస్తున్నాయి.. రేవంత్‌రెడ్డి దూషణలు వినేందుకు రావాలా?

- వరంగల్‌లో కేసీఆర్ ఏం చెప్తారోనని అందరిలో ఆసక్తి
- చరిత్రలో నిలిచింది టీడీపీ,బీఆర్ఎస్‌లే
- రేవంత్ రెండు జాతీయ పార్టీల సీఎం
- రాష్ట్రంలో ఆ పార్టీలకు భవిష్యత్తు లేదు
- స్మితా సబర్వాల్ రీట్వీట్ చేస్తే కేసా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీకి వస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు నిర్విరామ కృషికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నారని, అలాంటి వ్యక్తులున్న సభకు 47 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఎందుకు రావాలని ప్రశ్నించారు. కేసీఆర్ వయసును, స్థాయిని చూడకుండా దుర్భాషలాడే ముఖ్యమంత్రి ఉన్నపుడు.. ఆ దూషణలు వినడానికి అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి తమనే తట్టుకోలేకపోతున్నారని, ఇక కేసీఆర్ వస్తే వారంతా అసెంబ్లీ నుంచి పారిపోయే పరిస్థితి వస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లకు సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం ఉన్నామన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం కేటీఆర్ కొందరు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణకు కృష్ణా జలాల్లో నష్టం జరుగుతున్నపుడు నల్లగొండ బహిరంగ సభలో కేసీఆర్ గర్జిస్తే.. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుందన్నారు. కేసీఆర్‌కు ఎప్పుడు, ఏం మాట్లాడాలో తెలుసునన్నారు. ఆయన ప్రజల్లో లేరంటూ విమర్శలు చేయడం తగదని, గెలిపించిన ప్రజలకు దగ్గరగా ఉన్నారని చెప్పారు. గజ్వేల్ ప్రజలకు కేసీఆర్



అందుబాటులో ఉన్నారని, రోజూ ఆయన వద్దకు వందల మంది వచ్చి వెళ్తున్నారని తెలిపారు.

కేసీఆర్ ఏం చెబుతారా అని..

కాంగ్రెస్ అసమర్థ పాలన, ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఏం చేయబోతోందన్న ఆసక్తి అందరిలోనూ నెలకొందని కేటీఆర్ అన్నారు. వరంగల్ సభ ద్వారా కేసీఆర్ ఏం చెబుతారా అని తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ సభకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సభా వేదిక తెలంగాణ ప్రజలకు విశ్వాసం కల్పిస్తామన్నారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీ కూడా అప్రతిహతంగా ప్రతిభ చాటిన సందర్భంలేదని, అది కేవలం ఎన్‌టీ రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీకి, కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటైన బీఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమైందని అన్నారు. మరో 50ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలకు అండగా గులాబీ పార్టీ ఉంటుందన్నారు. వచ్చే రెండు, మూడు దశాబ్దాలపాటు కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే ఉంటాయని, కేంద్రంలో, రాష్ట్రంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని పార్టీ రజతోత్సవ సభ స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా.. కాంగ్రెస్ తరఫున గెలిచిన రేవంత్‌రెడ్డి.. రెండు జాతీయ పార్టీలకు అనుకూల సీఎంగా పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఓవైపు మోదీని, మరోవైపు రాహుల్‌ను సంతోషపెడుతూ కొనసాగుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో చాలామంది సీఎం కావాలనుకుంటున్నారని, అయితే రేవంత్ పూర్తికాలం ఉండాలని తాము ఆశిస్తున్నామన్నారు. ఆయన అనాలోచిత చర్యలు, అరాచకాలు పెరిగి.. వచ్చే 20ఏళ్లు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయని పరిస్థితి వస్తుందన్నారు.

మాపై కక్షసాధింపు చర్యలు..

ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలేసి.. తమపై కేసులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కేటీఆర్ ఆక్షేపించారు. సైబర్ క్రైమ్ విభాగం వారు సోషల్ మీడియా పోస్టులపై అతిగా స్పందిస్తున్నారని, బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. రేవంత్ ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్న పోలీసుల ఆటలు ఎక్కువకాలం సాగవన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, లెక్కలు పక్కాగా తిరిగి అప్పజెబుతామని హెచ్చరించారు. 'ఎక్స్' వేదికగా వచ్చిన ఓ పోస్టును స్మితాసబర్వాల్ రీట్వీట్ చేసినందుకే ఆమెపై కేసు పెట్టడం కాంగ్రెస్ సర్కారు తీరుకు నిదర్శనమన్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేతిలో ఓటమిపాలైన బీజేపీ నేతలు.. ఆ తర్వాత ఎంపీలుగా గెలవడం వారి గొప్పతనం కాదని, మోదీ హవానే కారణమన్నారు. ప్రజల గుండె ధైర్యం గులాబీజెండా అని, బీఆర్ఎస్ ఎంత బలంగా ఉంటే తెలంగాణకు అంత లాభమని చెప్పారు. రాష్ట్ర ప్రజలపై తమకున్న ప్రేమలో అణువంత కూడా ఢిల్లీ పార్టీలకు ఉండదని, రాష్ట్రంలో ఈ రెండు జాతీయ పార్టీలకు భవిష్యత్తు లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లో ఒక ప్రయత్నం చేశామని, కానీ.. అనుకూలించలేదని తెలిపారు.

బీసీని బీఆర్ఎస్ అధ్యక్షుడిని చేయాలి: జాజుల

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి పన్నెండు సార్లు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం నిబంధనలకు విరుద్ధమని, కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి ఆ స్థానంలో బీసీని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చే శారు. అన్ని రంగాల్లో బీసీలను అణిచివేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వరంగల్ రజతోత్సవ సభలో బీసీ పాలసీని ప్రకటించాలని ఆయన అన్నారు. అధికారం కోల్పోయి 16 నెలలు గడచినా ఎక్కడున్నాడో తెలియని కేసీఆర్ అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలన్నారు. కేసీఆర్‌కు రాసిన బహిరంగ లేఖను బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాజుల విడుదల చేశారు. కేసీఆర్ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాముఖ్యం ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. ఇదే కొనసాగితే రాబోయే రోజుల్లో బీసీలే బీఆర్ఎస్‌ను బొంద పెడతారని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు బీసీలకు ప్రాధాన్యం ఇస్తుండగా కేవలం బీఆర్ఎస్ మాత్రమే బీసీలను అణచివేస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని కేసీఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని వరంగల్ సభలో ప్రకటించాలని జాజుల డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.